
ఓం

# విద్య-విజ్ఞానము-ప్రజ్ఞానము
# ప్రయోజకులైన పౌరులుగా విద్యార్థులు





లోకాస్సమస్తాః సుఖినోభవంతు

సంకలనము
తూములూరు ప్రభ
తూములూరు కృష్ణమూర్తి

## విద్య

విద్య యెసగు వినయము! వినయమునను
బడయు పాత్రత! పాత్రత వలన ధనము!
ధనము వలన ధర్మము! దాని వలన
ఐహికాముష్మికా! సుఖముల నందు, నరుడు ॥

*(శ్రీ సత్యసాయి ప్రబోధామృతము. పు. 458)*

## సరస విద్య

విశ్వశాంతిని చేకూర్చు విధము నేర్చి
సంకుచిత భావములం దెల్ల సమయ చేసి
ఐకమత్యము సహజీవనాదికములు ।
సమత నేర్పుటయె కాదె సరస విద్య ॥

## విద్య డిగ్రీల కొరకు కాదు

విద్య డిగ్రీల కొరకు కాదు వెట్టి వీడి
సేవాకా వృత్తికై మీరు చేరబోక ।
స్వీయ దేశ సౌభాగ్య శ్రేయ మరసి
జగతి శ్రామిక విద్యలు చదువ వలయు ॥

*(శ్రీ సత్యసాయి ప్రబోధామృతము. పు. 855)*



## విద్య లేని వాడు పశు సమానుడు

విద్యానామ నరస్వరూప మధికం ప్రచ్ఛన్న గుప్తం ధనం
విద్యాభోగకరీ యశశ్శుభకరీ విద్యాగురూనాం గురుః
విద్యా బన్ధుజనో విదేశగమనే విద్యాపరాలోచనం
విద్యా రాజ్యసుపూజ్యతే నహిధనం విద్యావిహీనః పశుః

ఈ ప్రాకృత ప్రపంచములో ప్రతి మానవునకు విద్యయే అలంకారము. ఈ విద్యయే యోగ్యమైన ధనము. ఈ విద్యయే కీర్తి, సుఖము, భోగమునకు ఆధారము. విద్యయే గురువులకు గురువు. విదేశములకు వెళ్లినప్పుడు విద్య బంధువుగా తోడ్పడుతుంది. విద్య మూడవ నేత్రము వంటిది. ఇట్టి పవిత్రమైన విద్య రాజాస్థానమునందు గౌరవము నందుకునేందుకు మహాపాత్ర ధరించినది. విద్యకు యిచ్చిన ఘనత ధనమునకు లేదు. ఇట్టి పవిత్రమైన విద్యలేని మానవుడు కేవలము పశు సమానుడు.

## విద్య సుఖం కొరకు కాదు

సుఖార్థీ త్యజతే విద్యా విదార్థీ త్యజతే సుఖం
సుఖార్థినః కుతో విద్యా కుతో విద్యార్థినః సుఖం.
సుఖము కోరువాడు విద్యను పొందలేడు. నిజముగా విద్యార్థి సుఖమును ఆశించడు. విద్యను పొందినవానికి సుఖము అక్కర లేదు. సుఖము నాశించువారు విద్యను పొందలేరు.

*(శ్రీ సత్యసాయి ప్రబోధామృతము. పు. 852/853)*

ఓం

# విద్య-విజ్ఞానము-ప్రజ్ఞానము
# ప్రయోజకులైన పౌరులుగా విద్యార్థులు


సంకలనము:

**తూములూరు ప్రభ**

బి.ఏ., బి.ఇడి.

**తూములూరు కృష్ణమూర్తి**

బి.కామ్., బి.యల్., ఎఫ్.సి.ఎ., ఎఫ్.సి.యస్.



**విద్య – విజ్ఞానము – ప్రజ్ఞానము**
ప్రయోజకులైన పౌరులుగా విద్యార్థులు

సంకలనము
తూములూరు ప్రభ
తూములూరు కృష్ణమూర్తి

ప్రథమ ముద్రణ 2003

ప్రచురణ : 1000

ప్రచురణ:
**తూములూరు పబ్లికేషన్స్**
'అనసూయ'
-సి-66 దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ
హైదరాబాద్ - 500 007.
ఫోన్: 27428904, 27427083
e-mail: hyd1_tumuluru@sancharnet.in

*ముద్రణ:*
**విష్ణ కంప్యూటర్ సర్వీసెస్**
*(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)*
నల్లకుంట, హైదరాబాద్ - 500 044.
ఫోన్: 27676910

# ఉపోద్ఘాతము

'విద్య వి జ్ఞానం కోసం. కృషి కూటి కోసం' అనేది సూక్తి. అంటే విద్యను విజ్ఞానార్జనకు ఉపయోగించాలి. కాని విద్యతో ఏదో పట్టం పుచ్చుకుని (డిగ్రీ సంపాదించి) దాన్ని పట్టుకుని పరదేశానికి కూడు కోసం ప్రయాణమై పోవటం గొప్పతనం కాదు అని అర్థం చేసుకోవాలి. 'కూటి కోసం కోటి విద్యలు' అనే నానుడి కూడా వ్యాప్తిలో ఉంది.

ప్రపంచంలో సృష్ఠింపబడిన ప్రాణికోటి కంతటి మనుగడకు ఆహారం (కూడు) తప్పక అవసరమే. పశువులు, పక్షులు కూడా తమ ఆకలిని తీర్చుకోవటానికి ఆహారం సంపాదించుకుంటాయి. తమ గూళ్ళల్లో పిల్లల కోసం జాగ్రత్త పెట్టుకుంటాయి. ఆ విధంగా వాటికి'Reason'- ఆకలి,'Season' దొరకని పరిస్తితులు (పిల్లలికోసం ముఖ్యంగా) ఉంటాయి. కాని 'జంతూనాం నరజన్మదుర్లభం' అని శాస్త్రాల్లో చెప్పబడిన మానవుడు-మాత్రం Reason-Season అని లేకుండా విచక్షణ రహితంగా ప్రవర్తిస్తూ కేవలం భౌతిక, లౌకిక అవసరాలకోసమే తాపత్రయ పడుతుంటాడనే కదా మొదట్లో చెప్పిన వాక్యాలు. నరజన్మ చాలా దుర్లభమైనది. పవిత్రమైనది. ప్రశస్తమైనది. విశిష్ఠ మైనది. అట్టి దుర్లభమైన నరజన్మ పొందినందుకు, పవిత్ర పుణ్యభూమియైన భారత దేశంలో జన్మించినందుకు, మానవుడు జన్మను అన్ని విధాలా సార్థకం చేసుకోవాలి.

## ప్రాచీన గురుకులములు

ప్రాచీనకాలం నుండి ఋషులు, మహర్షులు, మహనీయులు, భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు, భారత దేశ వైభవం, వేదపురాణాల వైశిష్ట్యం మొదలైనవి చెపుతూవచ్చేరు. ఏ దేశానికైనా**'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుష్యులోయ్'** అనే సిద్ధాంతమే ముఖ్యం. ఆవిధంగా సృష్టిలో మానవుడు తన యొక్క నిజస్వరూపాన్ని గుర్తించగల్గాలి. అట్టి గుర్తింపుకు ప్రాచీన గురు కులములలో గురువులు తమ శిష్యులకు నైతిక శిక్షణ తోపాటు. ఆధ్యాత్మిక, ధార్మిక శిక్షణ నిచ్చేవారు. కాని నేడు మానవుని తెలివితేటలు పెరిగి పోతున్నాయి. విజ్ఞాన ప్రజ్ఞానములు శీఘ్ర గతిని అధికమౌతున్నాయి. కాని అవన్నీ కృత్రిమమైన జ్ఞానంగా రూపొందుతున్నవి. అందుచే మానవునిలో రెండు రకాలైన తత్త్వములు బయలుదేరుతున్నవి. ఏది సత్యము, ఏది అసత్యము, ఏది నిత్యము, ఏది అనిత్యము అని విచారణచేసి, విచారించే తత్త్వములలో ఒకటి నిత్యము,రెండవది అనిత్యము; ఒకటి ఆత్మ. మరొకటి అనాత్మ. ఒకటి శరీరము. మరొకటి శరీరి. ఒకటి దేహము. మరొకటి దేహి. ఒకటి క్షేత్రము. మరొకటి క్షేత్రజ్ఞుడు. దైవముతో కూడినటువంటి మానవుడు తన నిజ స్వరూపాన్ని గుర్తించటమే ప్రధాన కర్తవ్యంగా భావించాలి. దీనినే భగవద్గీత ప్రబోధిస్తూ వచ్చింది. నేటి కలియుగంలో ఆవిధంగా ప్రబోధలు చేసే పవిత్ర గ్రంధాలు-వేదములు, బ్రహ్మసూత్రములు, బైబిలు, ఖురాను, జెండాఅవెస్తా, గ్రంధసాహేబ్ మొదలైనవెన్నో ఉన్నాయి. లక్షల కొద్దీ మతాచార్యులు, ప్రచారకులు కూడా ఉన్నారు. ఇన్ని ఉన్నా, ఒక ప్రక్క విజ్ఞాన శాస్త్రం కూడా ఎంతో వేగంగా పురోగమిస్తున్నా, ప్రపంచలోని అన్ని దేశాల్లోను అన్ని రంగాల్లోను అనేకమైన అకృత్యాలు, అశాంతి, ఆందోళనలు స్వేచ్ఛావిహారం చేస్తున్నాయి. మానవుని యందు పశుత్వము, (ఒకరినొకరు హింసించుట, చంపుకొనుట) రాక్షసత్వము పెచ్చుపెరిగిపోతున్నాయి. ఎక్కడ చూచినా, విన్నా అధర్మం, అసత్యం, హింసలే. కృష్ణపరమాత్మ చెప్పిన

**'యదా యదాహి ధర్మస్య గ్లాని ర్భవతి భారత:**
**అభ్యుత్థాన మధ ర్మస్య తదాత్మానం సృజామ్యహమ్'**

(ఎప్పుడెప్పుడు ధర్మమునకు హానియు, అధర్మమునకు వృద్ధియు కలుగుచుండునో అప్పుడు మాయ చేత నేను పుట్టుచుందును)

**'పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్,**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే'**

(ప్రతి యుగమునందును సన్మార్గులను రక్షించుటకును, దుర్మార్గులను నశింప చేయుటకును ధర్మాచరణ బాగుగా స్థాపించుటకును నేను పుట్టుచుందును). అను నవి జరుగుచుండును.

అట్టి పరిస్థితుల్లో దైవం అవతరించి, మానవుని వివేకవంతునిగా మార్చి, వైయుక్తిక, సాంఘిక పరిణామం తీసుకువస్తాడు. ఇటువంటి శోచనీయ పరిస్థితుల్లోనే **1926, నవంబరు 23**వ తేదీన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అవతరించటం జరిగింది.

**సత్యసాయి అవతారము:**

శ్రీ సత్యసాయి తమ పవిత్ర కార్యాచరణకు అనేక విధములైన పద్ధతుల్ని అనుసరిస్తూ ప్రపంచంలో పాతుకుపోయిన చెడును రూపుమాపి, " మానవునికి ఏదైనా చెడ్డ సంస్కారము వచ్చిన, దానిని ప్రయత్నముతో మార్చుకోగలడని; **పశువుగా జన్మించిన మానవుడు పశుపతికాగలడని**" ప్రబోధిస్తూ, నిజమైన జ్ఞానబోధ గావిస్తున్నారు.

ఇటువంటి జ్ఞాన సంపదనార్జించటానికి మార్గాలు చెపుతున్నారు. దివ్యస్వభావమే మానవుని నిజమైన ఆత్మ. **ఏదైతే వాస్తవముగా ఉందో దాని జ్ఞానమును పొందుట, దాని సాక్షాత్కారమును పొందుటే "విద్య"** అని నిర్వచనము చెపుతూ, **"విద్య సంపూర్ణ జీవితము యొక్క కళ"**గా శ్లాఘించేరు. ఎన్నో విద్యలు- సంఖ్యా శాస్త్రము, వ్యాకరణము, సంగీతము, సాహిత్యము మొదలగు విద్యలెన్నో భారతదేశము నందే ఆవిర్భవించి, ప్రపంచానికి వ్యాపించేయి. భారతదేశంలో లభ్యం కానిది ఇంకెక్కడా మనకు లభించదు **'యన్న భారతే తన్న భారత'** అంటూ **"భావసంపదల కిది మహాపంట భూమి; అఖిల దేశాలకిది ఉపాధ్యాయి"**, అన్నారు, భగవాన్. మరి ఇటువంటి మహోన్నత సంస్కృతీ సాహిత్యాలు, కీర్తి ప్రతిష్టలు, సిరిసంపదలతో తులతూగుతున్న భారతదేశం నుండి అసంఖ్యాక జనం ఎందుకు విదేశాలకు పరుగులుతీస్తున్నారు. పట్టుపట్టితే సాధించలేనిది భారతదేశం లో ఏదీలేదని ఖేదం వ్యక్తం చేస్తారు. ప్రాచీన భారత విద్యావిధానం, దాని విశిష్ఠతను కొనియాడుతూ అనాడు విద్యార్థుల సంఖ్య మితము, ఆచార్యుల బోధనాశక్తి అమితముగా ఉండేదని అమూల్యమైన, ఆనందమైన విద్యలను చిన్నపిల్లలకు సహితం అర్థ మయ్యే రీతిలో పెద్ద పెద్ద శాస్త్రాలను ప్రబోధించేవారని, ప్రశాంత వాతావరణంలో ఏ వృక్షము క్రిందనో కూర్చుంటే ఆ వృక్షమే వారికి విశ్వ విద్యాలయంగా ఉండేదని, ఆ చల్లని గాలిలో మెల్లగా గురువు బోధించే వాక్యాల అంతరార్థము, మాధుర్యము విద్యార్థులు తనివితీరా గ్రోలేవారని కొనియాడుతారు, స్వామి.

'సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమేసదా,
పద్మపత్ర విశాలాక్షి పద్మ కేసర వర్ణనీ
నిత్యం పద్మాలయాదేవీ సామాం పాతు సరస్వతీ,
భగవతీ, భారతీ పూర్ణేందు బింబాననా".

అని సరస్వతీ దేవిని వర్ణిస్తూ, భక్తి శ్రద్ధలతో ప్రార్థిస్తూ అక్షరాభ్యాసం, విద్యాభ్యాసం చేసేవారు. ఆవిధింగా మన ప్రాచీనులు కర్మ, ఉపాసన, జ్ఞాన మార్గాల్ని అనుసరిస్తుండేవారు. కానీ ఈనాటి ప్రజలు వికారబుద్ధులతో అన్నీ- ఆహారము, ఆరోగ్యము, విద్య- విక్రయానికే ప్రారంభించేరు అని భగవాన్ బాధను వ్యక్తం చేస్తుంటారు. ఈ పరిస్థితుల్ని చక్కదిద్దుకునే సద్విద్య ఏ విధంగా నేర్వాలి, అభ్యసించాలి, విద్య యొక్క ప్రయోజనములు ఏమిటి, విద్యార్థి కుండవలసిన లక్షణాలు, గుణాలు ఏవి, అదర్శ విద్యార్థి ఎవరు, విద్యార్థి ప్రయోజకుడైన భావి పౌరుడుగారూపొందవలసిన మార్గాలేమిటి మొదలైన ఎన్నో విషయాలు 'గురుదేవులు' గా భగవాన్ బోధిస్తున్నారు. వారి ముఖత: శ్రేష్ఠమైన శిక్షణను పొందుతున్న మనమందరం - వయోవృద్ధులు, యువత, బాలబాలికలు, భక్తులు, ఇతరులు - ప్రశస్తమైన తర్ఫీదును పొంది, ఉత్తమ మానవులముగా తయారవుదాము. " మానవుడు దేహము, మనస్సు, ఆత్మల యొక్క త్రయము కనుక మూడు స్వభావములు కలిగి ఉంటాడు. నీచమైన జంతు స్వభావము మొదటిది; ప్రపంచజ్ఞానముకల మానవ స్వభావము రెండవది; మిక్కిలి ముఖ్యమైన దివ్య స్వభావము మూడవది". పరమాత్మ యొక్క ప్రేమ శాసనమును అనుభవిస్తూ, ఆచరిస్తూ మానవ స్వభావులుగా, క్రమేపి దివ్య స్వభావులుగా మారుదాము. అదే మన తీర్మానము. మన ధృఢ నిశ్చయము. అదే మనము అర్పింపదగిన గురుదక్షిణ అని భావిద్దాము. ఇటువంటి మంచిభావాలు భద్రపరచునదే విద్య. అదే ఆత్మ విద్య -Educare అంటున్నారు భగవాన్ బాబా. ఈ విధంగా మంచి భావాలను మనస్సుల్లోను హృదయాల్లోను పదిల పరచుకొని మన గమ్యాన్ని మంచిగా చేరాలన్న దీక్షతో భగవాన్ విద్య గురించి తెలిపిన వివరణలను అన్ని కోణాలనుండి వీలైనంత వరకు వీక్షిద్దాం.

ఇదివరకటి ఏ అవతారంలోను జరుగని రీతిగా కలియుగ అవతార పురుషుడు శ్రీ సత్యసాయి బాబా ప్రవచించే ప్రబోధలు, ప్రవచనాలు, సూత్రాలు,

సూక్తులు, చిన్నకథలు, ఉపమానాలు, ఉపమేయాలు, నిర్వచనాలు, అంతరార్థాలు మొదలైనవి అనంతం. వాటికి సంబంధించి వచ్చిన సాహిత్యం కూడా తక్కువేమీ లేదు. అయితే ప్రజల్లో రావలసినంత మార్పు ఎందుకు రావటం లేదని ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకుంటుండాలి. భగవాన్ అవతార పురుషుడనే ప్రగాఢ విశ్వాసం ప్రపంచంలోనిఅనేక దేశాల (ఇంచుమించు 180 దేశాలు) ప్రజల్లో చాలాఉంది. భగవాన్ దర్శన, స్పర్శన, సంభాషణల కోసం ప్రతి నిత్యం అనేక మంది ప్రశాంతి నిలయం వస్తుంటారు. వారి దివ్యవాక్కుల్తో ప్రభావితు లవుతుండ బట్టే ఇంత 'సాహిత్యం' కూడా అందుబాటులో ఉంది. అయితే భగవాన్ తరుచు చెపుతున్నట్లు, **"పుస్తకాల్లోంచి మస్తకాల్లోకి, మస్తకాల్లోంచి తిరిగి పుస్తకాల్లోకి"** మాత్రమే జరుగు తుండటం తో నేమో, మానవుడు పరిశీలనాత్మక దృష్టితో, విశ్లేషణతో భగవాన్ పలికే మహావాక్యాల్ని, దివ్యవాక్కుల్ని సరిగా అర్థంచేసుకోక, హృదయాల్లో నిలుపుకోక పోవడంతో నేమో ప్రజల్లో రావలసిన పరివర్తన రావటంలేదని పడే తపన ఫలితం గా ఈ మధ్య తరుచు వినిపించే **'ఏడ్యుకేర్ - సత్యసాయి ఎడ్యుకేర్'** ని గురించి ఆలోచించటం మొదలు పెట్టేము. ఆ ప్రక్రియలో భాగంగా శ్రీ సత్య సాయి 'వాహినుల'లో ఒకటైన **విద్యావాహిని** తిరిగి చదవటం తటస్థించింది. **పంథొమ్మిది ప్రబోధలతో ఉన్న ఆ విద్యావాహిని మనని ప్రభావితుల్ని, క్రియాశీలురుల్ని చేసే బ్రహ్మవిద్య, ఆత్మవిద్య, ఉన్నతవిద్య, ఉచిత మరియు ఉత్తమ విద్య అని విశదమవుతుంది.**

భగవాన్ బాబా బాల్యం నుండి గ్రామ ప్రజలను సంస్కరించు బాధ్యతను ఏ విధంగాస్వీకరించేరో సనాతన సారధి ఎడిటర్, N. కస్తూరిగారు తమ 'మనవి'లో ఉల్లేఖించేరు. పాఠకుల సౌలభ్యంకోసం ఆ మాటలను ఎత్తి వ్రాస్తున్నాము. **"బాబా వారు మానవాళిని ఈ "విద్య" ద్వారా సంస్కరించి, తరింప జేయుటకే అవతరించారు. నేటి విద్యావిధానము మానవుని అయోమయ స్థితిలో పడవేసి పెడమార్గమును పట్టించు చున్నది. 'విద్య' మానవ జీవిత గమ్యామునకు సురక్షితముగా చేర్చగల్గు నౌక వంటిది. నౌక భద్రమైనదిగా ఉండ వలెను. కాని నేటి జీవన నౌక మానవుని నడి సముద్రగర్భమున ముంచి వేయుచు భయాందోళనలను కలిగించు రీతిగా ఉంటున్నది. బాల్యమునుండి బాబా వారు గ్రామ ప్రజలను సంస్కరించు బాధ్యతను స్వీకరించినారు. ప్రజలు కూడ బాల బాబాను "గురువు"గా సంబోధించెడివారు. ఆ నాడు సంఘంలో ప్రబలి ఉన్న జీవహింస, స్వార్థపూరిత మైన దోపిడీ తత్త్వము, వడ్డీ వ్యాపార్థుల నిర్దాక్షిణ్యత్వము, జూదము, నిరక్షరాస్యత, ఆడంబర జీవన విధానము..... మొదలైన దురాచారములను తీవ్రముగ బాబా విమర్శించేవారు. ప్రజలందరికీ అర్థమయే రీతిలో హాస్యోక్తులు, ప్రహసనలు, వ్యంగ్య రచనలు, గేయములు, నాటికలు వ్రాసి, ప్రదర్శింపచేసి సంస్కరించ డానికి ప్రయత్నించినారు. స్త్రీలు, పురుషులు పాల్గొను సంకీర్తనలలో 'సత్య, ధర్మ, శాంతి, ప్రేమలతో, నీ నిత్యజీవన యాత్ర సాగించు' అని ఆ నాడే ప్రబోధించినారు. 1943 సంవత్సరంలో తన 17డవ ఏటనే బాబా - 'విద్య' యొక్క- లక్ష్యము, - మానవతా విలువలైన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను అలవరచుట యే అనే సందేశమును అందించినారు.**

**"ఆధ్యాత్మ విద్యా విద్యానామ్" అని గీతాచార్యులు అర్జుననికి బోధించినారు. నేటి జగత్తును సంరక్షించగలిగలిగేది "ఆధ్యాత్మక విద్య" మాత్రమే. మానవ జీవిత పరమార్థము "ఏకం సత్" అనే వేద సూక్తిని అనుభూతమొనర్చు కొనుటయే. అట్టి దివ్యానుభూతిని అందుకునే నిమిత్తము - సత్యాన్వేషణ, పూర్ణత్వమును పొందవలెనను కాంక్ష, అభేద జ్ఞాన పిపాస, చిత్త శుద్ధి అను సాధనలు అత్యవసరం. గత 50 సంవత్సరముల నుండి బాబా వారు అందించిన దివ్యోపన్యాసముల సారాంశము, సందేశము ఇదియే.**

**ఆత్మశాంతిని, విశ్వశాంతిని చేకూర్చి, విముక్తిని ప్రసాదించు విద్యా విధానమును అందించమని పలువురు ప్రార్థింపగా బాబా వారు 19 ప్రబోధాత్మక వ్యాసములతో ఈ విద్యా వాహినిని ప్రసాదించారు".**

ఆ విధంగా **'21వ శతాబ్దపు వేదం ఎడ్యుకేర్, 'సత్యసాయి ఎడ్యుకేర్'** అని మనం ఆశ్చర్య పడటం, ఉత్సాహ ఉల్లాసాల్ని ప్రదర్శించటమే కాకుండా, భగవాన్ గత 60 సంవత్సరములుగా చేస్తున్న ప్రబోధలు, ఇస్తున్న సందేశాలు, అనుగ్రహిస్తున్న ఆదేశాలు, వారు ఆచరిస్తున్న బృహత్కార్యాలు మొదలైన వానిలో మనం ఏవిధంగా, ఎంతవరకూ అనుసరించగలవని మార్గాల్ని అన్వేషించాలి. వాని ప్రభావంగా, ఎంతవరకూ అనుసరించి, ఆచరించగలమని ప్రతి ఒక్కరూ పద్ధతుల్ని ఆలోచించాలి. అవి ఎంత శక్తి వంతంగా పనిచెయ్య

గలవని మార్గాల్ని అన్వేషించాలి. వాని ప్రభావం మానవులపై ఏ విధంగా పని చేస్తున్నదని గుర్తించాలి. ఆ గుర్తింపే , వ్యక్తిగతంగా, సమాజంలో, దేశంలో, ప్రపంచంలో మానవుని ఆచరణకు దారితీస్తుంది.

నేటి విద్యార్థులే రేపటి పౌరులు.**'మొక్కగా వంగనిది మ్రానైవంగుతుందా,'** అనే సామ్యంలా పిన్న వయస్సులోని పిల్లల లేత మనస్సుల్లో మానవతా లక్షణాలు అభివ్యక్తమై, అభివృద్ధియేలాచేయాలి. అట్టి పిల్లలు ప్రయోజకులైన పౌరులుగా, భగవాన్ అకుంఠిత సేవాకార్యాల్లో ఉత్తమ పాత్రలు నిర్వహించ గల్గాలి. ఆ లక్ష్యంతోనే పాఠశాలలు, కళాశాలలు స్థాపించి ఉచితమైన, ఉత్తమమైన విద్యను భగవాన్ అందిస్తున్నారు, అట్టి సద్విద్యాసక్తి సాధనలో ఉపకరిస్తుందని 'ఉడతాభక్తిగా, చంద్రునికోనూలుపోగు' లా ఈ చిన్న పుస్తకాన్ని ముఖ్యంగా విద్యార్థులు, అధ్యాపకుల కోసం వ్రాయటమైనది. ఈ ప్రయత్నంలో సరైన స్ఫూర్తిని, మంచి అవగాహనను అందించగల్గితే అంతకంటె అదృష్ట మేముంటుంది! కృతజ్ఞతలతో, భగవాన్ పాద పద్మములకు ప్రణామములతో....

హైదరాబాదు
ఫిబ్రవరి 2003

**తూములూరు ప్రభ.**
**తూములూరు కృష్ణమూర్తి.**

# విషయ సూచిక

ఉపోద్ఘాతము

మొదటి ప్రకరణము.. విద్య అనగా.. 1

రెండవ ప్రకరణము.. విద్యార్థినీ-విద్యార్థులు 7

మూడవ ప్రకరణము.. అధ్యాపకులు-గురువులు 18

నాలగవ ప్రకరణము.. ప్రయోజకులైన పౌరులుగా విద్యార్థులు - సంస్కృతి 21

అనుబంధం గురించి నాలుగు మాటలు 32

అద్భుత సృష్టి అందించు గుణపాఠాలు 34

ఆత్మ ప్రబోధ అందరికీ 37

విద్యార్థులకు హితబోధ - పరమార్థ విశ్లేషణ 41

విద్యలో మానవతా విలువల మేళవింపు 50

కొన్ని ప్రార్థనా గీతాలు 53

ఉప సంహారము 56

మంగళాశాసనము 61

## మొదటి ప్రకరణము

# విద్య అనగా.........

విద్య అనే పదం **'విద్' అను ధాతువు నకు 'య' అను ప్రత్యయమును చేర్చుటవలనఏర్పడుచున్నది. 'విద్' అనగా వెలుగు. ఏది వెలుగును ఇచ్చునో అదియే నిజమైన విద్య.** విద్యలో రెండు ప్రధాన అంశాలున్నాయి. ఒకటి ప్రాపంచికము. అది కేవలం పుస్తకాలనుండి సేకరించే విషయ పరిజ్ఞానం. ప్రతి వ్యక్తిలోను అంతర్గతంగా ఉండే మానవతా విలువల్ని బయటకు కార్య రూపములో తీసుకు వచ్చే అంశం రెండవది. Physics, chemistry, Mathematics, Zoology గా మొదలైన పరిమితజ్ఞానాన్ని అందించేవి లౌకిక విద్యలు. ప్రస్తుత ఆధునిక యుగంలో అనంతమైన సాంకేత జ్ఞానం (Technical Education) వెల్లివిరుస్తుఉంది. ఇది బాహ్యా మైన నాగరికతను మాత్రమే బోధిస్తూ ఉంటున్నది. కాని **నేడు కావలసినవి ఆత్మవిశ్వాసము, ఆత్మపరిపాకము, హృదయ నిర్మలము.**ఇవి అంతర్గత నాగరికతను, సంస్కృతి ని, సంస్కారమును అందచేసి, మానవునికి కేవలం జీవన విధానాన్ని మాత్రవె కాక జీవితానికి ఉపకరిస్తాయి -not only for living but for life.

**" నేటి విద్య తెలివి తేటలనే పెంచు**
**కొంచమైన గుణము పెంచబోదు**
**కోటి విద్యలుండి గుణములేకున్నచో**
**అట్టి విద్య కన్న మట్టి మిన్న".**

నేడు భౌతిక విద్యలు జీవనో పాధికోసం ఏర్పడినవి. ధనార్జన నిమిత్తమేర్పడినవి.

### పవిత్ర విద్య :

అందుచే వ్యక్తిత్వాన్ని పోషించి, **దివ్యత్వాన్ని వికసింప చేసేదే నిజమైన విద్య** అని భావించాలి. పూర్వం 5 సంవత్సరముల పిల్లలచేత విద్యాభ్యాసం చేయించేటప్పుడు మొట్టమొదట 'ఓం నమశ్శివాయ; ఓం నమో నారాయణాయ' అనే పవిత్ర మంత్రములను నేర్పించేవారు. కాని నేడు చిన్నపిల్లలకు 'బాబా బ్లాక్ షీప్' (Ba-Ba black sheep) అనే అర్థరహితమైన విషయాల్ని నేర్పిస్తున్నారు. ఆధ్యాత్మిక, భౌతిక సమ్మిళత స్వరూపమైన

విద్యగా ఉండాలి. మెదడునకు మాత్రమే కాక హృదయమునకు ప్రకాశమునందించునదిగా ఉండాలి. విద్య యే మానవునకు సౌందర్యము. అదియే గుప్త ధనము. మానవునకు కీర్తి, సుఖభోగములను అందించును. అది గురువునకు గురువు. విదేశములకు వెళ్ళినప్పుడు ఒక బంధువువంటిది విద్య. మానవునకు వినయమును, శీలమును అందిస్తుంది. ఇట్టి పవిత్ర విద్య లేకుండిన మానవుడు 'వింత పశువని' చెప్ప వచ్చును.

## ప్రాకృతమైన విద్య :

అవిద్య ఎంత హానికరమో విద్య కూడా అంతటి హానికరము. ఈ నాడు పిల్లలు ఏ స్థాయిలో ఉన్నారంటే వారికి తెలియదు. పరులు చెపితే వినరు. పిల్లలు మంచి వారే. నిజమైన విద్యను అర్థం చేసుకొనేటట్లు పెద్దలు చెప్పాలి. వారు చరిత్ర లోని ఘోరీమహమ్మదు, పృధ్వీరాజు, జయచంద్రుల జీవిత తత్త్వాన్ని చక్కగా గుర్తించి ఏ సమయమందు ఏ వ్యక్తి కి ఏ సహాయం చెయ్యాలని నిత్యానిత్య పరిశీలన చెయ్యాలి. ఈ విధమైన విచారణ శక్తితో ఇతరులకు సహాయం, ఉపకారం చెయ్యడమే కాకుండా వారు కూడా ఆనందం పొందుతారు. ఈ నాడు అధ్యాపకులు నేర్పేవి, విద్యార్థులు నేర్చేవి అన్నీ Education మాత్రమే. ఏదో బుక్కులు కంఠస్థం గావించుకోవటము. కంఠస్తము చేసిన విషయాలలో మార్కులు తెచ్చుకోవటం, డిగ్రీలు పొందటం జరుగుతున్నది. ఈ Education తో విద్యానందంకాని, విషయానందంకాని లేదు. చైతన్యము, నైపుణ్యము అసలే కనిపించటంలేదు. వి**ద్య శరీరానికి, మనస్సుకి, అత్మకు సంబంధించి ఉండాలి. అదే ప్రజ్ఞానం.** ఈ ప్రజ్ఞానాన్ని పోషించాలి. అప్పుడు విద్యార్థి మేధస్సును పోషించుకోవటమే కాకుండా, ఆత్మవికాసాన్ని అభివృద్ధి చేసుకో గల్గుతాడు. ఒక విద్యార్థి Maths లో చాలా clever గా ఉంటే, దానిని develop చేసుకోవాలి, మొదట. అధిపతులు, ఉపాధ్యాయులు కూడా ప్రోత్సహించాలి. ఆ విధంగా ఒక్కొక్క subject develop చేసుకుంటూ పోవాలి. తనకి అభిరుచి ఏర్పడి, అన్ని subjects నీ develop చేస్తాడు. అభిరుచిని పురస్కరించుకొని ముందుకి సాగిపోవాలి. అంతే కాని భవిష్యత్తులో ఏ ఉద్యోగం చిక్కుతుందో, ఎంత సంపాదిస్తానో అని మొదట్లో నే సంపాదనకు, ఉద్యోగానికి ప్లానులు వేస్తే జీవనోపాధికి చదువ్ర తున్నట్లవుతుంది. కాని జీవిత పరమావధి గురించి ఆలోచించ నట్లే, ఈ జీవిత పరమార్థం, పరమావధి తెలుసుకోవటానికి సదాలోచన, సత్కార్యం, శుద్ధమైన



మనస్సు కావాలి. మంచి ఫలితాల కోసం మంచి ఆలోచనలు (సదాలోచనలు) మంచి కార్యాలు (సత్కార్యలు), మంచి మనస్సు (ధృడ విశ్వాసం) తో గుణవంతులుగా ఉండాలనుకోవటం అవసరం. ఇవన్నీ మానవునిలో అంతర్లీనంగా ఉండే శక్తులు, లక్షణాలు, గుణాలు, విలువలు. వాటిని కార్య రూపంలో బయటకు తీసుకు రావాలి. తాళం చెవిని తాళంలో పెట్టి కుడివైపుకి తిప్పితే అది తెరుచుకుంటుంది. ఎడమ వైపుకు తిప్పితే తాళం పడిపోతుంది మానవ హృదయం తాళం వంటిది. మనస్సు తాళంచెవి.**మనస్సును ప్రపంచం వైపు తిప్పితే బ ంధం కలుగుతుంది. భగవంతుని వైపు తిప్పితే ముక్తి (దురాలో చనలు, దుష్కార్యాలు అనే బంధాలనుండి బయట పడటం) లభిస్తుంది. మనస్సుకు ఫలించని కోరికలు అరిషడ్వర్గాలైన కామం, క్రోధం, ఈర్ష్య, అసూయ, ద్వేషం మొదలైనవిగా తలెత్తి అశాంతిని, అసౌఖ్యాన్ని కలుగచేస్తాయి. ఇంకా కోరికల్ని పెంచుతాయి. ఫలితంగా పునర్జన్మ వస్తుంది. కాని జీవిత పరమార్థాన్ని, పరమావధిని అర్థం చేసుకుంటే జన్మ రాహిత్యం కలుగుతుంది. ఈ విధంగా హృదయం గుండా వచ్చిన పరివర్తనే Educare విధానం అన్నారు భగవాన్.**

## ఆత్మ విద్య EDUCARE:

**'అంతరాత్మయే మార్గ నిర్దేశక శక్తి' గా ఉంటుంది. దీనికి ' సదాలోచన అనే విత్తనం నాటు, సత్కార్యమనే పంటను పొందు; సత్కార్యమనే విత్తనం నాటు, సదభ్యాసమనే పంటను పొందు; సదభ్యాసమనే విత్తనంనాటు, సచ్ఛీలమనే పంటనుపొందు; సచ్ఛీలమనే విత్తనం నాటు, సద్గతి అనే పంటనుపొందు."** అని భగవాన్ ప్రవచించే ఈ పవిత్ర మహావాక్యాన్ని ప్రస్తుత విజ్ఞాన శాస్త్రానికి అన్వయించుకున్నా " Action -Reaction "Theory" కి సరిపోతుంది. అదే "As you sow - so you reap" అనే సూక్తి కి అన్వయిస్తుంది. ఈ ప్రక్రియలో సదాలోచనల్ని హృదయం నిండా నాటుకుంటే 'పరివర్తన' అనే పంట తప్పక చేతికి వస్తుంది. **మనస్సు చేసే సదాలోచనలకు,చెప్పే మాటలకు, చేసే పనులకు సామరస్యం కలిగి శాంతి యుత ఫలితాలు లభిస్తాయి. ఇదే భగవాన్ బోధించే 21వ శతాబ్దపు మహా వేదం - ఎడ్యుకేర్. ఇది మనస్సు, వాక్కు, కర్మ ఈ మూడింటిని ఏకీకృతం చేసే శక్తిని అభివృద్ధిపరుస్తుంది.**మనస్సుతో మంచి ఆలోచనలు చేస్తూ, నోటితో మంచి మాటలు మాట్లాడుతూ, శరీరం తో మంచి పనులు చెయ్యటం. ఈ

మూడు ఒక్కటిగా మానవుని జీవితం లో ఆంతరంగిక శాంతి, ఆత్మానందం కలుగ చేస్తాయంటారు, భగవాన్. ఇదే వారి ఎడ్యుకేర్ అందించే దివ్య సందేశం. మానవుడు తన అంతస్సత్యాన్ని అనుసరించాలి, అంతరాత్మ ప్రబోధాన్ని కార్యరూపంలో ఆచరించాలనేదే వారి ప్రబోధామృత సారం.

## గ్రంధ పఠనం - భౌతిక విద్య:

కేవలం Education - గ్రంధ పఠనం వల్ల ఏమీ ప్రయోజనముండదు. **చదివినదేదో ఆచరణలో పెట్టాలి.** అలా ఆచరణలో పెట్టినప్పుడు ఆ జ్ఞానం, విజ్ఞానం జీర్ణం కాని ఆహారం వంటిదిగా ఉంటుంది. ఆహారం జీర్ణం కావాలి (Digest అవాలి). అంటే దాన్ని బాగానమిలి, తేలికగా జీర్ణమయే స్థితిలో లోనికి తీసుకురావాలి. అంటే గ్రంధాల్ని కేవలం చదవటంతో సరిపెట్టరాదు. లోతుగా అర్థం చేసుకుని, దాని లోని విషయాలను పరిశీలనాత్మకంగా విచారించి (ఆలోచించి) దాని అర్థాన్ని జీర్ణించుకొని. నేర్చుకున్న దానిని ఆచరణలో పెట్ట గల్గాలి. మనం బోధించే వాటిని ఆచరించాలి. ఒక వ్యక్తి మంచి వాడా కాదా అని నిర్ణయించడానికి అతని హృదయాన్ని పరిక్షించి చూడలేము. అతని ప్రవర్తన, అతను చేసే పనుల ద్వారానే నిర్ణయించగలము. పెద్దలు (గురువులు) ఒక ఆదర్శాన్ని నెలకొల్పితే యువత (పిల్లలు, విద్యార్థులు, శిష్యులు) వారి అడుగు జాడల్లో నడుస్తారు. కనుక పెద్దలు మానవతా విలువలు ఆచరించి ప్రబోధించాలి. **(మొదట ఆచరణ ముఖ్యం - ఆచరించినవి మాత్రమే ప్రబోధించటం).** లేక పోతే జీవితమంతా సమాచారల్ని సేకరించటంతోనే సరిపోతుంది. దానికి తగినట్లు విద్యార్థులు సహకార సామరస్యంతో అర్థం చేసుకుని, ఆచరణలో పెడుతూ ఆదర్శ విద్యార్థులుగా తయారవాలి.

## భౌతిక విద్య -ఆత్మ విద్య

'భౌతిక విద్య కళలో రంగులను మేళవించే జ్ఞానన్నీ కలుగ చేస్తే ఎడ్యుకేర్ ఆ రంగులలోని సౌందర్యాన్ని ఆస్వాదించే శక్తినిస్తుంది.'

" భౌతిక విద్య, ఎడ్యుకేర్ ఇవి రెండూ పక్షికి ఉండే రెండు రెక్కలవంటివి. పక్షి ఆకాశంలో ఎగరడానికి ఈ రెండూ అవసరమే."

ఆ విధంగానే 'భౌతిక విద్య, ఎడ్యుకేర్లు మానవుని అంతర్గత విలువలను, బయటకు కనిపించే ప్రవర్తనను ఒకటిగ చెయ్యాలి'**భౌతిక విద్య శక్తి యుక్తులనిస్తే, ఎడ్యుకేర్ భక్తి ముక్తులనిస్తుంది.**



## శ్రీ సత్యసాయి విద్యా సంస్థలు:

విద్యార్థులు చిన్నప్పటినుంచీ ఈ విధమైన మేళవింపుతో విద్య నభ్యసించటం చాలా అవసరం. ఆ ఉద్దేశంతోనే శ్రీ సత్య సాయి విద్యాసంస్థలు స్థాపించబడ్డాయి. అదే విధంగా ప్రపంచదేశాల్లో పలు చోట్ల ఈ విధానాన్ని వీలైనంతగా అమలు జరిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి **"సత్యసాయి విశ్వ విద్యాలయంలో కేవలం వృక్షశాస్త్రమును బోధించటమే కాదు. దీనికి జీవిత వృక్షాన్ని కూడా అతికిస్తున్నాము. దీనిలో ఆర్థిక శాస్త్రము బోధించడమే కాదు. ఆస్తిక శాస్త్రమును కూడా బోధిస్తున్నాము. దీనిలో రసాయనిక శాస్త్రమును మాత్రమే కాదు. రసోవైసః అనే ఆత్మరసమును కూడా అందిస్తాము. పదార్థశాస్త్రమును కూడా దీనిలో ప్రవేశ పెడుతున్నాము. పరార్థమునకు పరార్థమునకు, భౌతికమునకు ఆధ్యాత్మికమునకు ఏ విధమైన ఎడబాటులేకుండా ఏకీభావమును, అవినాభావ సంబంధమును ఈ విశ్వ విద్యాలయములో బోధించుటకు పూనుకొంటున్నాము. ఇదే ఈ విశ్వ విద్యాలయం యొక్క ప్రత్యేకత. ఏవో కొన్ని కోర్సులను ప్రవేశ పెట్టి వాటిలో విద్యార్థులకు డిగ్రీలు ఇచ్చి వారిని బయటి ప్రపంచంలోనికి ఉద్యోగాలు వెదుక్కోటానికి పంపించే ఇతర విశ్వ విద్యాలయములవంటిది కాదిది. విద్యార్థులు తమ కాళ్ళపై తాము నిలబడి, తమశక్తి యుక్తులపై తాము ఆధారపడి, తమ జీవిన విధానమును తామే తీర్చి దిద్దుకోవడానికి అవసరమైన ధైర్యమును, విశ్వాసమును, విజ్ఞానమును అందిస్తుంది. అందువలన ఈ విశ్వవిద్యాలయములో నైతిక, లైకిక, ఆధిభౌతిక విద్యాబోధనలో ఆధ్యాత్మిక విద్యను మేళవంచి బోధించాలని నిర్ణయించాము. బోధనాభాష, క్రమశిక్షణ. తరువాత బోధింపబడే భాషలు వరుసగా ప్రేమ, సేవ, మరియు సాధన",** అని భగవాన్ శ్రీ సత్య సాయి విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయము గురించి ప్రత్యేకంగా ఉటంకించినా, క్రమంగా అన్ని విద్యాలయాల్లోను ఈ పద్ధతి అమలు జరిగి నట్లయితే ఎంత ప్రశస్తంగా ఉంటుందో అని అధికారులు, సంబంధించిన వారందరూ గ్రహించుకోవాలి.

## నేటి హిరణ్యకశిపులు:

ఇంకా, చిన్నతనంలోనే ఆధ్యాత్మిక సాధన లో ప్రవేశించినందుకు తమ బిడ్డలను దండించే హిరణ్యకశిపుల వంటి తల్లిదండ్రులు నేడూ ఉన్నారు. అంతే కాదు, వారిలో కొందరు తమ పిల్లల దుష్ప్రవర్తను గమనించనట్లు

వారు సత్ప్రవర్తనే కలిగి యున్నారని ఇతరులను భ్రమింప చేయడానికి కూడా ప్రయత్నిస్తారు. తమపిల్లలను మంచి మార్గంలో పెట్టడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయరు . ఈ విధంగా పిల్లల దుష్ప్రవర్తనకు తల్లిదండ్రులే బాధ్యులు. ఆ దుష్ప్రవర్తనే విద్యాసంస్థలలో క్రమశిక్షణారాహిత్యమునకు కారణభూతమవుతుంది. **మానవజాతి యొక్క మనుగడను ప్రధాన లక్ష్యము ఆత్మానందమును పొందుట. మానవులందరూ కలసిమెలసి ప్రేమతో జీవించుట,** ఈ విద్యా సంస్థలలో బోధించే ఉన్నత విద్య ఇదియే, అంటూ భగవాన్ సత్య సాయి విద్యాలయాల్లో ఎవిధమైన విద్యావిధానము విద్యార్థులకు అందించాలో అనే సందేశాన్ని అందించేరు. ఆ విధంగా విద్యాలయాలు రూపుదిద్దుకుని, విద్యార్థులుగా తమ జీవితాలను చక్క దిద్దుకో గలిగే జ్ఞానము, నైపుణ్యము సంపాదించ గల్గితే, తాము దివ్యానందాన్ని పొందుతారు. అంతే కాకుండా **"ఈ పరివర్తనతో నీనుండి, నీవద్దకు, నీవు ప్రయాణించినట్లు భగవంతుడు నీలో, నీచుట్టూ, నీతోపాటు, నీ ప్రక్కన ఉన్నట్లు"** మాన జాతి అంతా పరివర్తన చెందుతుంది. ఇదే కదా ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవలసింది.

### వసుదైక కుటుంబకము

**"సృష్టి అంతటికి భగవంతుడు బీజం.** ఈ బీజమైన భగవంతుని నుండి గుణాలుద్భవించాయి. ఆ బీజం మొక్కగా పెరుగుతుంది. ఈ వికసనం వివిధ దశలు-మొక్క, ముళ్ళు, ఆకులు, పూలు, పళ్ళు. అన్నీ బీజం లోనే ఉంటాయి," అన్నది మానవ వికాసానికి, జ్ఞానార్జనకు మహత్తర సందేశాన్నిస్తుంది. **ఈ ప్రక్రియలో జ్ఞానంతో ఆచరణ ను మేళవింపచెసి, కుల మత జాతి వర్ణ వ్యవస్థలకు అతీతంగా మానవుని తీసుకువెడుతుంది.** అణువునుండి మహత్తువరకు అనేక రూపాల్లో సాక్షీభూతంగా వ్యాపించి ఉన్న దివ్యత్వాన్ని మానవుడు అర్థం చేసుకుంటాడు. భిన్నత్వం లోని (అనేకత్వం) ఏకత్వం స్థాపింపబడుతుంది. 'వసుదైక కుటుంబకము' ఏర్పడుతుంది. ఆ విధంగా భావి పౌరులుగా చిన్నప్పటినుంచే విద్యార్థులు సరియైన విద్యను అభ్యసించటం జరుగుతుంది.

## రెండవ ప్రకరణము

# విద్యార్థినీ -విద్యార్థులు

భగవాన్ బాబాతరుచు తమ ఎదురుగా ఉన్న విద్యార్థినీ విద్యార్థుల్ని చూపుతూ, వీరే నా ప్రాపర్టీ(property) అంటూంటారు. అది ఆధ్యాత్మికంగా, ఆత్మపరంగా అన్న మాటలు. అయితే కేవలం తమ స్కూళ్ళు , కాలేజీల్లో చదివే వారిని గురించే కాకుండా, గురుదేవుడుగా అందర్ని ఆవిధంగానే భావిస్తారు, సహజంగా. పిల్లలు ప్రయాణించ వలసిన దూరం చాలా ఉందంటూ, ప్రత్యేకం వారిని ఉదాహరిస్తారు. అయితే, మనందరం, అన్ని తరహాల వారూ వారి దగ్గర శుశ్రూష చేయవలసిందే, సుశిక్షితులమవ వలసిందే కవక భగవాన్ అందించే ఆదేశాలు అందరికీ చెందుతాయి. లౌకికంగా ప్రాపర్టీ (property) అనటంతోనే ఎంత జాగ్రత్తగా ఆలోచిస్తూ, రక్షించు కుంటూ ఉంటామో, అంతకంటె ఎన్నెన్నో రెట్లు భగవాన్ తమ ప్రాపర్టీని పరిరక్షించుకుంటూ, సంరక్షించుకుంటూ ఉంటారు. ఆ విధంగా వారు ఎన్నో పద్ధతులు, ప్రణాళికలు మన ఉపయోగార్థం అందిస్తున్నారు. మనం వాటిని అనుసరించి, ఆచరించటం ముఖ్యం. విద్యార్థినీ విద్యార్థులు మరీ ముఖ్యంగా గమనించి పాటించాలి.

విద్యార్థులు ముఖ్యాంగా **మూడు విషయాలు** గమనించాలి.

1. తెలియని విషయములు చెప్పుటకు పూనుకోరాదు. అది అవివేకమవుతుంది.
2. తెలియకపోయినప్పటికీ తెలిసినట్లు నటించడం ప్రమాదం.
3. తెలిసికొనుటకు ప్రయత్నించి దానిని క్షుణ్ణంగా తెలిసిన తర్వాత చెప్పడాని ప్రయత్నించాలి. తెలియక పూర్వమే తెలిసినట్లుగా భావంచడం పెద్ద తప్పు. ఈనాడు అనేకులు అన్నీ తెలిసినట్లు నటిస్తున్నారు. అది అహం-కారం. ఈ అహంకారం మానవుని అధఃపతనానికి గురిచేస్తుంది. అహంకారం వృక్షమునకు వేరు పురుగులాంటిది.

దీనికి రాగద్వేషములనే తోడుదొంగలైన మిత్రులున్నారు. ఈ ముగ్గురి చేతనే జీవితం పూర్తిగా అడుగంటిపోతున్నది. అహంకారమును దూరముచేస్తే విద్య అలవడుతుంది. వినయ విధేయతలు పెరుగుతాయి. నిరాడంబరము

లేక పోవటం వల్ల ఖర్చు అనవసరంగా అవుతుంది. తల్లిదండ్రులకు కష్టం కలిగించిటం అవుతుంది. **విద్యార్థుల జీవితము, రక్తము, దేహము, సర్వస్వము తల్లిదండ్రుల ప్రసాదం. బ్లడ్డు (Blood), ఫుడ్డు (Food), దుడ్డు (Money) వారి ప్రసాదమే అని గ్రహించి తల్లిదండ్రులకు సాధ్యమైనంతవరకూ కష్టం కలిగించ కూడదు. కృతజ్ఞత, ప్రేమ చూపాలి.**

## విద్యార్థులకు కర్తవ్యబోధ

### జీవన సార్థకము:

పుట్టిన తక్షణమే కంటికి కనిపించేది, పాలిచ్చి పోషించేది, అన్ని విధాల ఉద్ధరించేదీ తల్లి. ఆమె మొట్టమొదట కనిపించే సుస్వరూపం. ఆ మాతృమార్తి బిడ్డకు తండ్రిని చూపిస్తుంది. తండ్రి పోషించి ఉద్ధరించి, అభివృద్ధి ఆశించి ఒక గురువును చూపిస్తాడు. ఆ గురువు కేవలం భౌతిక విద్యలే కాకుండా ఐహిక, ఆముష్మిక విద్యలతో పాటు అమృతత్త్వమైన దైవత్వాన్ని బోధించి చూపిస్తాడు. తల్లి తండ్రిని, తండ్రి గురువునూ, గురువు దైవాన్ని చూపించి పసిహృదయాలలో ప్రతిష్ఠింప చేస్తారు. ఆ విధంగా ప్రతిరోజూ తల్లి, తండ్రి, ఆధ్యాత్మికం గురువు, దైవం అనే మాటలలో అనంతమైన అర్థం, ఆనందం, ఇమిడి ఉన్నాయి, అదే విధంగా భక్తి - జ్ఞానం- వైరాగ్యం- తత్త్వం- ముక్తి అనే పదాలు ఒకదానినొకటి అనుసరించి, ఆశ్రయించి, అన్యోన్యానందాన్ని అందిస్తుంటాయి.

### భక్తి ద్వారాజ్ఞానం:

మానవుడు భక్తి ప్రపత్తుల చేతనే దివ్యమైన ఏకత్వమైన అనంతమైన జ్ఞానాన్ని అందుకోగలడు.

### జ్ఞానం నుండి వైరాగ్యము:

**'అద్వైత దర్శనం జ్ఞానం'** అనేకత్వ ఆరాధన ద్వారా ఏకత్వమైన జ్ఞానస్వరూపాన్ని నిరూపింప చేస్తుంది. ఈ జ్ఞానమే **'సర్వం విష్ణుమయం జగత్'** అనే మహాతత్త్వాన్ని అందించి ప్రాకృతమైన విషయ వాంఛల నుండి వైరాగ్యం వైపు నడిపిస్తుంది. **ఈ వైరాగ్యం చేతనే తత్త్వమసి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి అనే తత్త్వజ్ఞానం కలుగుతుంది**



తానెవరు? ఈ జగత్తు అంటే ఏమిటి? జీవుడు అంటే ఏమిటి? అనే విషయాలను చక్కగా విమర్శించి, విపులీకరించి హృదయానికి బోధిస్తుంది. దీనినే తత్త్వజ్ఞానమన్నారు. ఈ తత్త్వజ్ఞానం పొందిన వెంటనే సాయుజ్యం - ఐక్యత - అంటే భగవంతునిలో ఏకం కావటం. అదే అద్వితీయం. రెండవది లేకపోవటం అనే తత్త్వం నిరూపణవస్తుంది. అదే ముక్తి. అంటే **దుఃఖ నివృత్తి - అంటే ఆనందప్రాప్తి.** ఈ భక్తి, జ్ఞాన, వైరాగ్య తత్త్వముక్తులను నిరూపణ చేసిన ప్రత్యక్ష ప్రమాణ గ్రంథం **'భాగవతం'**. భా-గ-వ-త-ము. ఈ ఐదు అక్షరాలు మన పంచప్రాణాలుగా, పంచకోశాలుగా, పంచేంద్రియములుగా మనలో నిత్యం ప్రకటితమవుతూనే ఉంటూన్నాయి. 'భ' కారం భక్తి; 'గ' కారం జ్ఞానం; 'వ' కారం వైరాగ్యం; 'త' కారం తత్వం; 'ము' కారం ముక్తికి సంకేతాలు. ఇదే ఈ ఐదు అక్షరాల ప్రధాన తత్త్వం. ఇదే భాగవతము. భక్తి జ్ఞాన వైరాగ్య తత్త్వముల సమ్మిళిత సంబంధమే ముక్తి. **కనుక ప్రతి మానవునకు భక్తి అత్యవసరము. ఇదే పునాది.**

### భాగవత వైశిష్ట్యము:

**భాగవతం చదివితే బాగవుతాం అని చెప్పవచ్చు.**అంటే భక్తి, జ్ఞాన,వైరాగ్య తత్త్వాల చేతనే మనం బాగుపడతాం అని. అందుచేత భాగవతం కేవలం భగవత్సంబంధమైన విషయాల్నేకాక భక్తుల ప్రవర్తనను హృదయానికి హత్తుకునేటట్లుగా నిత్యజీవితంలో ఆనందించేటట్లుగా, ఇది అనుభవంచేటట్లుగా భగవంతుని లీలాగుణవిశేషాలను ప్రబోధిస్తూ వచ్చింది. భగవంతుణ్ణి భక్తుణ్ణి ఏకం కావించే దివ్యత్వాన్ని నిరూపించింది. భక్తుని దివ్యత్వం దీనిలో నే ఇమిడి ఉంది.

### పుట్టని చావని త్రోవ:

మానవ జీవితం దేని నిమిత్తమై వచ్చింది, దీని ఆదర్శమేమిటి, అంతరార్థమేమిటి, గమ్యమేమిటి అనే విషయం గురించి ప్రహ్లాదుడు తన తోటి విద్యార్థులతో ఇలా అన్నాడు:

'దీన శుభములేదు దివ్య కీర్తియులేదు
జగతి పుట్టి పుట్టి చచ్చి చచ్చి
పొరలనేల; **మనము పుట్టని చావని,
త్రోవ వెదుకు కొనుట దొడ్డ బుద్ధి.'**

చావటం పుట్టటం ఇది దేహతత్వం కావచ్చు. కానీ జీవిత లక్ష్యం ఇది కాదు, త్రో-వ-వె-దు-కు- కొ-ను-ట- దొ-డ్డ- బు-ద్ధి- అని పన్నెండు ద్వాదశ అక్షర (ద్వాదశాక్షర) మంత్రం. త్రోవ అనేది మామూలుగా ఇంటికి, హాస్టలుకి, సినిమాకి, **'ఎక్కడ పుట్టెనచ్చటికి ఏగుట నైజము ప్రాణి కోటికిన్'**. ఏమూల స్థానం నుండి వచ్చామో ఆ స్వస్థానానికి చేరేత్రోవ వెతుక్కోవాలి- ఎందుకంటే ఐహిక బోగభాగ్యాలలో అల్ప ఆనందాలలో, క్షణభంగుర జీవిత సుఖాలలో ఈ ప్రాకృత సంబంధాలలో మునిగి నిత్య సత్యమైన దివ్యత్వాన్ని మరచి పోయాము కనుక.

**పుట్టిన తక్షణమే బిడ్డ 'క్వాక్వా' అని అరుస్తుంది. అంటే నేనెక్కడ నాస్థానం ఎక్కడ అని పరితపిస్తుంది.** ఈ ప్రాకృత సంబంధ వాతావరణం అంటనంత వరకు పరితపిస్తుంది. ఈ వాతవరణం తనను ఆవరించిన తక్షణమే, ఈ ప్రపంచమే నా సర్వస్వమని విశ్వసించి అందులోనే మునిగి పోతుంది. ఈ మరుపు కలుగటంచేతనే వేదాంతం జీవుని హెచ్చరిస్తుంది **'ఎంతకాలం ఈ క్యాంపులో ఉంటావు.. నీవు వచ్చిన స్వస్థానం మరచిపోయి పరస్థానం లో కాలక్షేపంచేస్తున్నావు. తిరిగి నీ స్వస్థానాన్నిచేరుకో'** అనే మంత్రోపదేశంతో ('త్రోవ వెదుకుట దొడ్డ బుద్ధి-త్రోవమరిచేది గొడ్డు బుద్ధి' అని) చెప్తుంది. అందువలన ఈ స్వస్థానంలోనే దివ్యత్వాన్నికి ప్రయాణం కావాలి.

**పురందరదాసు** ఇలా అన్నాడు, **'స్వామీ, నిన్ను మరచి పోవటం చేతనే ఈ ప్రకృతి లో పుట్టవలసి వచ్చింది. చిన్మయుడవైన నిన్ను మరచి పోయి, మృణ్మయరూపంలో చిక్కుకుని, మృణ్మయ లోకాని వచ్చిపడ్డాను'**, అని. ఆ విధంగా ప్రతి ఆస్తికుడు, జ్ఞాని, తత్వవేత్త ఈ పై లక్ష్యాన్ని హృదయంలో పెట్టుకొని నిత్యజీవితాన్ని గడుపుతూ తిరిగి ఆ సత్యతత్త్వంలోనికి చేరుకుంటుంటాడు. ఈ విధంగా ప్రతివిషయాన్ని చక్కగా విచారణ చేయ్యాలి. ఎన్ని చదువులు, పట్టాలు పొందినా మానవ జీవిత లక్ష్య మైన దానిని పొందాలి. **తెలుసుకోవలసింది సత్యం, పొందవలసింది అమృతత్త్వం, విడువవలసింది అనిత్యం.** అనిత్య జగత్తుని వదలి సత్య స్వరూపుడైన భగవంతుని స్మరించి నిత్య మైన అమృతత్త్వాన్ని చేరాలి. అదే మనం చేసే ప్రార్థనలో మొదటిది.



**అసతోమాసద్గమయ**
**తమసో మాజ్యోతిర్గమయ**
**మృత్యోర్మాఅమృతంగమయ'**

మనం ఆత్మనుండి వచ్చాము. ఆ ఆత్మను వదలి అన్నాన్ని వెదుక్కొంటు న్నాము. కాని మనకు నిత్య సత్య మైనది అమృతత్త్వం. అదే ఆనందతత్త్వం. అలాంటి అమృరమైన అమృతత్త్వాన్ని మరచిపోయి అనృత తత్త్వంలో మునిగి అనేక అశాంతులకు గురి అవుతున్నాము.

**విద్యార్థినులు ఆదర్శ ప్రాయమైన మాతృమూర్తులుగా తయారై, పిల్లలకు, తోటి మానవులకు తగిన మార్గాలను బోధించాలి.** సంసారాన్ని ఆశించవచ్చు - అనుభవించవచ్చు కానీ దానిపై ఎక్కవగా ఆశలు పెంచుకోరాదు.. ప్రేమించవలసింది ప్రేమ తత్త్వ మైన ఆత్మ తత్త్వాన్నే. పవిత్రమైన వయసులో మరల మరల మంచి మాటలు వినాలి. మంచి పనులు చెయ్యాలి. మంచి జీవితాన్ని గరుపుకోవాలి. అదే మానవతకు సార్ధకత.

## నామం, దానం, త్యాగం :

ఈ జగత్తులో భౌతికంగా, వ్యావహారికంగా జీవితంలో ఈ విద్యలు అవసరమే. కానీ పారమార్థిక జీవితంలో ఈ విద్యలకంటె అతీతమైన నిజ తత్త్వాన్ని గుర్తించ ప్రయత్నించాలి.**గుర్తించ వలసింది గమ్యం. అపుడు జీవితం ధర్మం అవుతుంది.** కావలసినవి రెండే. రెండిని గుర్తించాలి **-ఒకటి నామం, రెండవది దానం. నామాలలో హరినామం, దానాలలో అన్నదానం ముఖ్యం.** అన్నమయమైన దేహంతో అన్నదానం చేసినపుడే హరినామం హృదయఁలో ప్రతిష్ఠత మవుతుంది. **హరినామం జీవననౌక. అన్నదానం జీవనగమ్యం.**

**మన హృదయానికే ఆత్మ అని పేరు.**ఆత్మ అంటే ప్రత్యేకమైన దేదీకాదు. శ్రుతులు పెట్టిని పేరిది.నిత్య సత్య మైన పేరు నిలుపుకోవటానికి ప్రయత్నం చేయాలి. తంజావూరు మహారాజు త్యాగరాజు ఇంటికి ధన, కనక, వస్తువాహనాదులు పంపినప్పుడు 'నిధి చాల సుఖమా, రాముని సన్నిధి చాల సుఖమా, నిజముగ తెలుపవె మనసా' అని మనస్సుని ప్రశ్నించు కున్నాడు.

**స్వామి సన్నిధి నిజమైన సుఖం అని ప్రబోధం కలిగి, వెంటనే అంతా త్యాగం చేసాడు. అందుచేతనే అతనికి 'త్యాగరాజు' అనే పేరు సార్థకమైంది. -త్యాగంలో రాజువంటివాడు.** నిరుపేదగా ఉండి కూడా సర్వభాగ్యాలను త్యజించి, పేరు సార్థక పరచుకొన్నాడు. ఆత్మానందం పొందుతాడు.

## పరమ ప్రేమ పరమాత్మ ప్రేమ:

మొట్టమొదట పరమాత్మను ప్రేమించాలి. జీవతంలో అన్ని భాగ్యాలకంటె మొట్టమొదట సాధించవలసింది పరమాత్మప్రేమ. ఇది ఒక్కటి వుంటే చాలు. **పరమాత్మ ప్రేమ స్వరూపం. ప్రేమ నిలయం. పరమ ప్రేమనే అయిదవ పురుషార్థము అంటారు. ఈ పరమ ప్రేమగలవారు ఇతరులను బాధించరు. వారిలో పాప భీతి కలుగుతుంది. దైవప్రీతి తోపాటు పాపభీతి ఆ వెంటనే జంటగా వస్తుంది.** ఈ దైవప్రీతి, పాపభీతితో సంఘనీతిని పెంచుకొంటారు. ఆ నీతే మనజాతి. మన జీవనజ్యోతి నీతి అంటే మంచి నడవడిక. ఇటువంటి సత్ ప్రవర్తన తో కూడినదే నిజమైన విద్య. ఇటువంటి

**"జాతి గౌరవంబు నీతిపై నిలుచును,**
**నీతి లేకయున్న జాతి చెడును,**
**నీతి కల్గు జాతి నిజమైన జాతిరా,**
**వినుడు భారతీయ వీర సుతుడ".**

మానవులం అనుకున్నందుకు నీతిని-నడతను ధరించి, ఆదర్శ జీవితాన్ని గడుపుటకు ప్రయత్నం చేయాలి. అపుడే ఈ నేర్చిన విద్యకు తగిన ఫలితం వస్తుంది. లేకపోతే అంతా నిష్ప్రయోజనం. విద్యార్థులు పెద్దపెద్ద మూటలవంటి సంచులు పుస్తకాలతో మోసుకు పోవటం ముఖ్యం కాదు. (ఉద్యోగం దొరకనప్పుడు బస్సుస్టాండులో మూటలుమోసి బ్రతకాలని ఈ నాటి నుంచే ప్రాక్టీసు చేస్తున్నారనిపిస్తుంది.) మీరు బానిసలుగా పశువుల వలె అణిగిమణిగి ఉండకూడదు. మానవుడు మాధవుడుగా, నరుడు నారాయణుడుగా మారి ఈ ప్రపంచాన్ని పాలించాలి. జగన్నాయకుడుగా తయారు కావాలి. పశువుగాకాక పశుపతిగా, పరమేశ్వరుడుగా తయారుకావాలి. అందుకు తగిన ఆధ్యాత్మ విద్యనభ్యసించాలి. **' ఆధ్యాత్మ విద్యా విద్యానాం'**- అని విద్యలకు తలమానిక మది.



**'సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస' అను మానవతా విలువలను అలవరుచుకోవాలి.** ప్రేమే దైవం. కర్మయే దైవం. సత్యమే దైవం. ఈ సత్యాన్ని ప్రేమించాలి. సత్యం ప్రేమ ఒక్కటే. పాపభీతితో అహింస ప్రారంభమవుతుంది హింసలేనప్పుడు శాంతి నెలకొంటుంది. శాంతి, అహింస రెండూ పాపభీతిలోనే చేరి ఉంటాయి. సమాజంలో శాంతంగా బ్రతకడమే ధర్మం. అందువలన సత్యం ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అన్నీకలిసే ఉంటాయి. ఈ ఐదు భావాలు ఐదు కోశాలు, ఐదు ప్రాణాలు.దైవ ప్రీతి, పాపభీతి, సంఘ నీతి ఈ మూడింటిని ప్రేమంచి పోషించు కుంటే ముమ్మూర్తి స్వరూపులు అవుతారు. ఈ మూడింటిని నిలుపుకొని మానవత్వాన్ని సార్థకం చేసుకోవాలి".
(అనంతపురం మహిళా కళాశాల31-12-1987)

అటువంటి ఆదర్శ విద్యార్థు లుగా తయారవటానికి వారు తీసికోవలసిన జాగ్రత్తలు; వారికుండవలసిన లక్షణాలు, లక్ష్యాలు చూద్దాం:

విద్యార్థుల్లో ముఖ్యంగా ఉండవలసింది క్రమశిక్షణ. దీనినే భగవాన్ ఎంతో అందంగా అర్థవంతంగా విపులీకస్తారు. మానవుడు " క్రమంగా ఒక శిక్షణ" తో అభివృద్ధి చెందుతాడు. క్రమంగా శరీరాన్ని అభివృద్ధి చెయడానికి ఒక క్రమపద్ధతిలో వ్యాయామం చేస్తారు. అదే విధంగా ఏ రకమైన కళను, విద్యను నేర్చు కోవాలన్నాక్రమంగా శిక్షణ పొందాలి. మనస్సుకి సంబంధించిన, హృదయానికి (ఆత్మకు) సంబంధించిన పరిజ్ఞానాన్ని అభ్యసించటానికి కూడా ఈ విధంగానే క్రమ పద్ధతిలో శిక్షణ పొందాల్సి ఉంటుంది. అందుకు మానవుడు (విద్యార్థి) క్రమశిక్షణతో విద్యను (జ్ఞానాన్ని) ప్రారంభించి, క్రమంగా ఇంద్రియ నిగ్రహాన్ని పెంపొదించుకొంటూ, మనస్సనే పరిమితిని (పరిధిని) దాటి, శరీరమనే ప్రహరీ గొడను దాటాలి. ఈ ప్రపంచరూపంలో అంతటానిండి ఉన్నదేదో అదే తాను అన్నటువంటి స్థితిని ఊరికే ఊహలతో కాక విచారణ, అనుభవముల ద్వారా విశ్వసించి తెలుసుకోవాలి. ఆ విధంగా **విద్యార్థి " హృదయం అనే మందులపెట్టిలో, విచక్షణ అను మాత్రలు, ఆత్మ నిగ్రహము అను ద్రావకము, నమ్మకమను దైవభక్తి, ఓర్పుకలిపిన పొడిని ఉంచు కోవాలి.** అప్పుడే అజ్ఞానమనే భయంకరమైన రోగం తగ్గిపోతుంది. లౌకిక, భౌతిక సుఖాలు, సంతోషాలు నిషా (మత్తు) వంటివి. కనుక మానవ జీవితాన్ని ఉద్ధరించే నిర్మాణాత్మకమైన పవిత్ర పద్ధతులు గురించి అలోచించాలి.

విద్యార్థులు క్రమశిక్షణ తో మరి కొన్ని నియమాల్నిపాటిస్తూ, విధిగా విద్యను అభ్యసించాలి. **అవి:**

విద్యార్థులు మనస్సులో ఒకటి, మాటలో ఒకటి, చెతలో మరోటి ప్రవర్తించ కూడదు. తనconscience (అంతరాత్మ) కి తగినట్లు నడుచుకోవడమే సరియైన తృప్తిని అందిస్తుంది. లేత వయస్సులో నున్న విద్యార్థులు మనస్సును మాత్రమే అనుసరించి అనేక అశాంతులకు, కష్టాలకు, అసంతృప్తులకు, నిరాశా నిస్పృహలకు గురి అవుతున్నారు. అందుకు వారు బుద్ధి ద్వారా విచారణ సలుపుతూ, ఏమి చెయ్యాలి, ఏది చెయ్యకూడదు, ఎక్కడికి ఎప్పుడు వెళ్ళాలి, అసలు వెళ్ళనక్కర్లేదా అని ఆలోచించుకుని ఏది చేస్తే గౌరవంగా ఉంటుందో అలాచెయ్యాలి.

విద్యార్థులలో ముఖ్యంగాఉండవలసిన ఇంకో లక్షణం **పట్టుదల.** ఏది సాధించాలనుకున్నారో అది సాధించేవరకు పట్టుదల విడువరాదు. దుశ్చింతలు దురహంకారము మొదలైనవి కాక కేవలం తెలివి తేటలపైన మేధాశక్తి మీద మాత్రమే ఆధారపడక, తలచిన దానిని సందేహించక, పట్టుదలతో సాధించడానికి ప్రయత్నించాలి. సాధించగలనా లేదా అనే సందేహం లేకపోతే పట్టుదలతో సాధించేలేనిది జగత్తులో ఏదీ ఉండదు.

విద్యార్థికి నిత్య జీవితంలో నియమం, నిదానం చాలా అవసరం. తెల్లవారి లేచిన తక్షణమే కాలకృత్యాలు ముగించుకొని, ప్రశాంత వాతావరణంలో కొన్ని నిముషాలైనా హృదయ పూర్వకంగా, ప్రేమతో పరమాత్మను స్మరించాలి. తదుపరి తన విద్యుక్తధర్మమైన నిత్య విధి కర్మలు (చదువు) మొదలైనవి నిదానంగా నిత్యం ఆచరిస్తూ వాటిలో మార్పులు, చేర్పులు చేసుకోరాదు. ఒకొక్క నాడు ఒకొక్క మార్పు చేయక నియమాన్ని పాటించాలి. ఈ నాడు ఒక గంటకు లేవడం రేపు మరోగంటకు లేవడం, ఈనాడాసమయంలో ఒక పనిచేయడం, రేపు మరోక పనిచేయడం మొదలైన మార్పులుండకూదదు. నిత్య జీవితంలో నియమ నిబంధనలు కఠినంగా పాలించాలి. ఈ నియమ నిబంధనలు పాటించటంలో భగవాన్ వారికి వారే సాటి. 1972, మే 6వ తేదీన వారి తల్లిగారైన ఈశ్వరమ్మ పరమ పదించినప్పుడు, భగవంతం మొదలైవారు ఆరోజు 'వేసవి తరగతులు' ండవని ప్రకటించారు దానికి వెంటనే, స్వామి దానికి అంగీకరించక ఆరోజు క్లాసులుంటాయని చెప్పి, క్లాసులు మామూలు





టైముకి జరిపించారు. "జనన మరణాలు స్వాభావికాలు". ఆమె చనిపోయింది కాని, పిల్లందరూ బాగున్నారు కదా"అన్నారు, స్వామి. ఆరోజే కొద్దిసేపటికి ముందు ఆమె బయటి నుండి తిరిగి వచ్చి క్లాసులు మొదలవలేదేమని ప్రశ్నంచారట. దానికి స్వామి," ప్రతిరోజూ జరిగే టైముకి జరుగుతాయ"ని చెప్పారట. అదే విధంగా భగవాన్ దర్శనం కోసం ఎంత పెద్ద అధికారులు, ఎవరు వచ్చినా వారి కార్యక్రమంలో మార్పు లేకుండా భక్తులకివ్వవలసిన దర్శనాలు మొదలైనవి జరుపుతుంటారు. "రూల్సు(నియమ నిబంధనలు) అందరూ తప్పక పాటించాలి. ఈ రోజుల్లో Rulesని పెట్టిన వారే అతిక్ర మిస్తారేమో కాని, నేనెప్పుడూ అతిక్రమించను. భగవంతుడు ఈ జగన్నాటక సూత్రధారి, పాత్రధారి అయిఉన్నాడు. ఇతర పాత్రధారులవలె తానూ నిబంధనల ననుసరిస్తూ, సూత్రధారిగా వాటిని అమలు పరుస్తుంటాడు. నదీ ప్రవాహానికి గట్లు లేకపోతే ప్రమాదం". అని హెచ్చరిస్తారు. 'అనుదినం స్వామి అనుగ్రహించే దర్శనాలు గాని, ఇంటర్వ్యూలు గాని, భజనలుగాని ఏ కారణం చేతా ఎప్పడు నిలిపి వేయబడవు. ఎవరు వచ్చినా, ఎ పండుగ వచ్చినా స్వామికి పని ఎక్కువవుతుంది. కాని వారి దిన చర్యలో మార్పుండదు. ఎంతవారైనా స్వామి కోసం కాచుకోవాలేతప్ప వారి కోసం స్వామి తమ పద్ధతిని మార్చుకోవడమనేది ఉండదుRules పాటించి, అమలుపరిచే అద్భుత సూత్రధారి, ఆదర్శ పాత్రధారి మన స్వామి', అని శ్రీ అనిల్ కుమారు అన్నారు. భగవాన్ అందించే సందేశాన్ని విద్యార్థులు ఆదేశంగా అమలు జరుపుతుండాలి. విద్యార్థులకు క్రమశిక్షణ (Discipline) చాలా అవసరం.

విద్యార్థులు ఇంకో విషయంలోశ్రద్ధ వహించాలి. చెడ్డ వారి సహవాసాన్ని తక్షణమే విడిచిపెట్టాలి. చెడ్డ వాని వల్ల ఉత్తముడు కూడా అధముడుగా మారి పోతాడు. అందుకే **'త్యజ దుర్జన సాంగత్యమ్'** అన్నారు. సజ్జనులయొక్క సహవాసమును అమితంగా ఆశించాలి. సజ్జనుడు నిరుత్సాహముతో క్రుంగిన స్నేహితుని ఉత్సాహపరుస్తాడు. **సత్యము, ప్రేమ, సహనము, సానుభూతి, త్యాగము ఇత్యాది గుణములతో కూడిన శీలవంతుడే సజ్జనుడు.** ఈ సందర్భములోనే **'స్మర సజ్జన సంపర్కమ్'** గుర్తు చేసుకోవాలి. విద్యార్థి లౌకిక విద్యను సక్రమంగా అభ్యసిస్తూ, క్రమంగా పవిత్రమైన కార్యములలో ప్రవేశించాలి. సేవలయందు, సహన సానుభూతుల లోపల ఇతరులకు తోడ్పడి సహాయము చేయుట, రోగులను సేవించుడట - వీలువెంబడి దీనులను, దిక్కులేని వారిని ఆదరించుట, చేతనైన సహాయము చేయుట, సేవాసంస్థల

కార్యక్రమాల్లో పాల్గొంటూ, నిస్వార్థ సహాయం అందివ్వటం - ఆస్పత్రులు, జైళ్ళు, అనాధ శరణాలయాలు,వృద్ధుల కోసం ఏర్పడిన కుటీరాలు మొదలైన వాటికి సహాకారాలందివ్వటం చేయవచ్చు. ఎంత పెద్ద పనిచేసేవనుకోవటం ముఖ్యం కాదు. **నిరాధారులను, నిస్సహాయులను చూచినప్పుడు ఆర్ద్ర హృదయంతో ఎటువంటి చిన్న సహాయం చేసినా వారికది చాలా ఉపకరిస్తుంది** ఉదహారణకు : కను చూపు సరిగాలేక తడబడుతూ, భయపడుతూ రోడ్డును దాట టానికి ప్రయత్నిస్తున్న వ్యక్తికి చేయూతనివ్వటం పెద్ద సేవగానే పరిగణించ వచ్చు, ఆ సమయసందర్భాల్ని బట్టి. దీనినే **'కురు పుణ్య మహో రాత్రమ్'** అని బోధించాయి శాస్త్రాలు.

విద్యార్థులు ఆవిధంగా ఆదర్శవిద్యార్థులుగా తయారవటానికి తప్పని సరిగ షడ్ సంపత్తులు అందుకోవటానికి ప్రయత్నించాలి. **షడ్ సంపత్తులు, శమ, దమ, ఉపరతి, శ్రద్ధ, తితీక్ష, సమాధానాలు.** వీటిలో **శమమనగా బహిరింద్రియములను అరికట్టు కొనుట. దమము అంతరింద్రియములకు సంబంధించినటు వంటిది.మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే నాలుగు అంతరింద్రియములు మానవునికి కనిపించవు.** వీటి ప్రోత్సాహ, ఉత్సాహముల చేతనే బహిరింద్రియములు ప్రవర్తిస్తాయి. నిజానికి బహిరింద్రియములను సరియైన విధంగా ఉపయోగించాలి. ఉదహరణకు కారును తీసుకుందాం. కారుకి సంబంధించిన నాలుగు టైర్లు, లైట్లు, (ముందు వెనుకలవి) హారన్ (Horn) పెట్రోలు టాంకు (Tank) బయటనే ఉంటాయి. కాని ఒక్క Steering మాత్రం లోపల ఉంటుంది. లోపల స్టీరింగు తిప్పినప్పుడే రోడ్డుపైన బయట టైర్లు నడుస్తాయి (తిరుగుతాయి). అంతే కాని పట్టుకు తిప్పితే తిరుగవు. దీనికి స్టీరింగు సరియైన స్థితిలో ఉండాలి. మన మనస్సు(Mind) Steering. ఈ అంతరింద్రియమైన మనస్సు పనిచేసినప్పుడే బహిరింద్రియములు (మన అంగములు) చేతులు, కాళ్ళు మొదలైనవి పనిచేస్తాయి. కనుక మనస్సును కంట్రోలు చెయ్యటానికి ప్రయత్నించాలి. శమదమాలు తర్వాత **'ఉపరతి:** వస్తుంది. ఉపరతి అంటే బహిర్ముఖ ఇంద్రియాల ప్రసక్తి లేకుండా అంతర్ముఖమైన భావాన్ని చింతించటం. నా చిత్తము పరిశుభ్రంగా ఉందాలేదా, నా భావములు సరైన వా కావా అని తన లో తాను విచారణచెయ్యాలి. ఆ విచారణతో వచ్చిన Self Satisfaction తో Self Sacrifice కు ప్రయత్నించాలి. ఆ విచారణతో వచ్చిన Self Satisfaction తో నిజమైన



తృప్తి - సంతృప్తి కలుగుతుంది. ఇదే ఆత్మ సంతృప్తి.Conscious -master. ఆ master ని follow అవాలి. ఉపరతితో వచ్చిన విచారణ, ఆత్మ తృప్తితో మానవునికి ఎంతో ధైర్యం వస్తుంది. తను తన Master అనే Conscience నే follow అయాడు కనుక జయాపజయాలు గురించి ఆలోచించడు. అంతా దైనాధీనంగా తీసుకుంటాడు. **ఇటువంటి సమత్వాన్ని తితీక్ష** అంటారు. జయాపజయాల్ని, నిందాస్తుతుల్ని, మంచిచెడ్డల్ని, ఎత్తుపల్లాల్ని, సుఖ దు:ఖాల్ని, వెలుగు చీకట్లును సమభావంతో తీసికోవటం. ("" Pleasure is an interval between two pains") అంటారు భాగవాన్. ఈ విధమైన Equal mindedness తప్పి పోయిందంటే జీవితమే ప్రమాదంలో మునిగిపోతుంది. కనుక ఈ సమ భావాన్ని విద్యార్థి దశనుండే పోషించుకోవాలి. విద్యార్థులు ముఖ్యంగా దీనిని అలవరచుకోవాలి, disappointments and misery, లేకుండా. ఆ తర్వాత విద్యార్థి కి **శ్రద్ధ** అనే సంపత్తి చాలా అవసరం. శ్రద్ధ లేకపోతే ఏ చిన్న కార్యం కూడా విజయవంతంగా జరగదు. శ్రద్ధ వలన సమయపాలన, కాలనిర్ణయము ఏర్పాటవుతాయి. ఇది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పాలకులకు, ఇంతెందుకు అందరికీ - ప్రతివ్యక్తికి చాలా అవసరం. ఎన్ని గంటలకు లేవాలి, Break-fast తీసికోవాలి, ఎన్ని గంటలకు కాలేజీకి పోవాలి మొదలైనవన్నీ సరియైన రీతిలో, పద్ధతిలో జరుగతూవస్తే - వాటన్నిటినీ అనుసరిస్తువస్తే, హృదయం కూడా పర్ ఫెక్టుగా (Perfect) గా ఉండటానికి వీలవుతుంది. అప్పుడే క్రమశిక్షణ అలవడుతుంది. శాస్త్రమునయు తెలుపబడిన గురువు ఉపదేశించినది రెండూ ఒక్కటే అని నిశ్చితమును పొందవలెను. సర్వ ప్రాణులు ఈశ్వరాంశమే అన్న శాస్త్ర వాక్యమును దృఢముగా విశ్వసించ వలెను. అదే విధంగా గురువుల యందు అచంచలమైన విశ్వాసము-నమ్మకము ఉండవలెను. గురువులు పూజనీయులు, శ్రేయో మార్గము చూపుతారు. శాస్త్రములు లోకక్షేమమును ప్రజాశ్రేయస్సును చూపునవి, కోరునవి. కనుక అట్టి పవిత్ర శాస్త్రముల పై గురువులపై పెద్దలపై నమ్మకము కలిగి యుండవలెను.

విద్యార్థినీ విద్యార్థులు పై విధంగా ఆదర్శవంతులుగా తయారవాలి.

## మూడవ ప్రకరణము

# అధ్యాపకులు

ఈ పవిత్ర విద్యావ్యవస్థలో విద్యార్థుల పాత్ర ఎంత ముఖ్యమో, అధ్యాపకుల (ఉపాధ్యాయుల) పాత్ర కూడా అంతే ముఖ్య మైనది. **ఉద్యోగు లందరికన్నా ఉపాధ్యాయుడు ముఖ్యుడు.** ప్రపంచానుభవంలేని పిల్లలు వేలాదిమంది అతని చేతులలో ఉంటారు. అతని ఉపదేశ ప్రభావాలు వారి లేత మనస్సులపై ఎక్కువగా ఉంటాయి. ఉపాధ్యాయునికి దురలవాట్లుంటే విద్యార్థులు అనుకరిస్తారు. చెడి పోతారు. అదే మంచి అలవాట్లతో, ప్రవర్తనతో ఉంటే ఆ మంచిని తీసుకుని మంచిగా తయారవుతారు. ఆ విధంగా ఉపాధ్యాయుని చెడుకాని, మంచికాని విద్యార్థుల మీద చాలప్రభావం చూపిస్తుంది. అందులోను " ఈనాటి పిల్లలు మొండితనంతో వాదించటానికి పూనుకుంటారు" అని భగవాన్ ఉదాహరణ చెప్పుతారు.

### గురుకులములు

మహాభారతము రచించిన వేదవ్యాసులవారి దగ్గర అనేకమంది శిష్యులు వేదాధ్యయనము నిమిత్తమై చేరేవారు. అందులో మొదటి శిష్యుడు వైశంపాయనుడు. ఇతను భక్తిశ్రద్ధలతో, వినయ విధేయతలతో గురువాజ్ఞను పాటించి తన జీవితమును సార్థకము గావించుకొన్నవ్యక్తి. **"సద్గుణంబులు, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనము" మున్నగువి నేర్పునదే విద్య.** అట్టి విద్యను విద్యార్థి నేర్వవలయును. అనుకొని గురువుదగ్గర వైశంపాయనుడు సద్విద్యను నేర్చుకొని తిరిగి తాను వేదమును బోధించే నిమిత్తమై ఒక గురుకులమును స్థాపించాడు. గురుకులమనగా అభ్యాసముల చేత, ప్రత్యేకమైన నిబంధనల చేత ఏర్పడినదని భావిస్తారు. అది కాదు గురుకులము. **గురుకులము అనగా గురువుగారి ఇల్లే శిష్యులకు నిలయం.** గురువు భుజించునదే శిష్యులకు ప్రసాదంగా ఇచ్చేవారు. రాత్రింబవళ్ళు గురువుతోనే జీవితము గడిపేవారు.

### గురువులు

గురువుని ఆధారముగా చేసుకొని అతని సుబోధనల చేత మనము ఉన్నత స్థాయికి చేరుతామనే విశ్వాసము మన భారతీయులది. శాస్త్ర సమ్మతమైన **గురువులు ఎనిమిదిమంది - బోధగురువు, వేదగురువు, నిపాతగురువు, కామ్యగురువు, వాచకగురువు, సూచకగురువు, కారణగురువు, విహితగురువు అని.**

**బోధగురువు** కేవలము శాస్త్రార్థము మాత్రమే బోధించి దానియొక్క నిబంధనలు తగిన రీతిగా ఆచరించటానికి ఉత్సాహప్రోత్సాహముల నందించేవాడు. **వేదగురువు**తత్త్వార్థమును బోధించి, తత్త్వదర్శనము గావించి మనస్సును దైవము వైపునకు మార్చేవాడు.**నిపాత గురువు** అనేక విధములైన సందేహములను రూపుమాపి మనస్సును పరిశుద్ధము గావించి చిత్తశుద్ధిచే ఆత్మతత్త్వాన్ని గుర్తింపచేస్తాడు.**కామ్యగురువు** కొన్ని కామ్యకర్మలను బోధించి యిహ పరములందు మోక్షము నందించేవాడు. తద్వారా పుణ్యకార్యములను ఆచరింపచేసేవాడు. తద్వారా యిహ పరములందు సుఖమునందించేవాడు. **వాచకగురువు** యోగతత్త్వము బోధించి దివ్యత్వ మైన ఆత్మతత్త్వమును అనుభవింప చేసేవాడు. **సూచకగురువు** శమదమాది గుణ సంపత్తిని బోధించి మానవుల యొక్క ఇంద్రియములను నిగ్రహింపచేసేవాడు. **కారణగురువు** జీవ బ్రహ్మైక్యానుసంధానము కలిగింప చేసేవాడు. జీవతత్త్వాన్ని దైవతత్త్వముగా మార్చగలిగేవాడు.**విహితగురువు** ఈ రెండింటి సంబంధము బింబ ప్రతిబింబముల యొక్క సంబంధమని బోధించేవాడు.**జీవునకు దేవునకు భేదము లేదని నిరూపించేవాడు. ఆచరణ రూపమైన ప్రబోధములు సల్పేవాడు. ప్రత్యక్ష ప్రమాణములు నిరూపించేవాడు. ఈ గురువు ఒక దైవము మాత్రమే.**

### అధ్యాపకులు

ఆధునిక విజ్ఞాన శాస్త్రముతో మానవుని తెలివి తేటలు పెరిగిపోతున్నాయి. కాని అవన్నీ కృత్రిమమైన విద్యలుగా రూపొందుతున్నవి. ఫలితంగా విద్యార్థుల్లో మొండి వాదనలు అధికంగా ఉంటున్నవి. ఇటువంటి పరిస్థితుల్లోనే ఉపధ్యాయులు (అధ్యాపకులు) చాలా ఓర్పునూ, నేర్పునూ ప్రదర్శిస్తూ తమ పవిత్ర కర్తవ్య మేమిటో దాన్ని ఏ విధంగా నెరవేర్చాగలమని యోచించుకోవాలి.

"అధ్యాపకుడు ఇచ్చేవాడు. విద్యార్థి పుచ్చుకునేవాడు". అయితే ఇచ్చేందుకు టీచరు దగ్గర ఏమైనాసరకు ఉండాలిగదా! ఈ నాడు పుచ్చుకోవటానికి విద్యార్థి సిద్ధంగా లేడు. ఇవ్వటానికి టీచరు దగ్గర సరకూ లేదు. అధ్యాపకులు వాటరు ట్యాంక్ లాంటివారు. విద్యార్థులు ట్యాప్ ల వంటి వారు. సహజంగా ట్యాంక్ లో ఎటువంటి నీరు ఉంటే, అటు వంటి నీరు ట్యాప్ లోనికి వస్తుంది. అదే విధంగా అధ్యాపకుడు ఎట్టి వాడో విద్యార్థి అట్టి వాడుగా తయారవుతాడు. **ఉపాధ్యాయుడు క్రమశిక్షణతో తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించకపోతే వేలమంది విద్యార్థులు చెడిపోతారు.** అధ్యాపకులు ఆదర్శ జీవతాన్ని గడిపినప్పుడు, విద్యార్థులు సత్ప్రవర్తనను అలవరచుకుంటారు. వాటర్ ట్యాంక్ లో పరిశుద్ధమైన నీరు ఉంటే ట్యాప్ లోనికి మంచి నీరు వస్తుంది. అదే విధంగా అధ్యాపకుడు పవిత్రమైన జీవితాన్ని గడిపితే విద్యార్థులు కూడా సచ్ఛీల సంపన్నులవుతారు. కనుక **విద్యార్థులకు అధ్యాపకులు మార్గదర్శకులుగా ఉండాలి.**

**"అధ్యాపకులు దేశమునకు ఆదర్శవంతమైన జ్యోతులు. ఒక విద్యార్థి చెడితే అతను మాత్రమే చెడగలడు. ఒక అధ్యాపకుడు చెడితే అనేక మంది విద్యార్థులు చెడటానికి అవకాశము ఉంటుంది. అధ్యాపకులు గైడ్ పోస్టు వంటి వారు. విద్యార్థులకు సరియైన ఆదర్శము నందించటంలో అధ్యాపకులు నిశ్చల మనస్సుతో వ్యవహరించాలి. గైడ్ పోస్టు ఊరికే అటూ, ఇటూ, ఇటూ, అటూ తిరగుతుండటంలో తప్పుదారి పట్టిస్తుంది. గైడ్ పోస్టు స్థిరంగా నిల్చొని దృక్పథాన్ని చక్కగా ఇతరులకు వివరించాలి. అధ్యాపకులు కూడా నిశ్చలమైన మనస్సుతో, నిస్వార్థమైన హృదయంతో ప్రేమ తత్వాన్ని పెంచుకోవాలి. భక్తి ప్రపత్తులను కూడా అభివృద్ధి గావించుకోవాలి. విద్యార్థుల అభివృద్ధిని, దేశాభివృద్ధిని సమాజక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోని అధ్యాపకులు ప్రవర్తించాలి. ఉన్నిత భావాలను పెంపొందించుకొని మంచి ఆదర్శమును లోకమునకు చాటుటకు అధ్యాపకులు పూనుకోవాలి." 'భుక్తి విద్యలెల్ల ముక్తి విద్యలు చేసి మోహంబు తెగటార్చు సద్గురువరుండు'** అంటారు భగవాన్ అందుకే. అధ్యాపకులు అదర్శ వంతులుగా ఉంటూ, **విద్యార్థులకు ఆదర్శాన్ని అందివ్వాలి.**

### నాలగవ ప్రకరణము

# ప్రయోజకులైన పౌరులుగా విద్యార్థులు

**శరీరము, మనస్సు, ఆత్మల కలయికయే మానవుడు. మానవ జన్మకు విలువనందించే సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, సహనము, సానుభూతి అని కంటికి కనిపించని శక్తులున్నాయి. ఇవన్నీ జన్మతో వచ్చిన అంతర్భూతమైన శక్తులే కాని బయటనుంచి వచ్చేవికావు. వీటిని ఆవిర్భవింప చేసుకొనేవే 'ఎడ్యుకేర్' సందేశం.** ఈ సందేశాన్ని సూక్ష్మంగా భగవాన్ ఇలా అందిస్తారు.

**" సత్యమనే పునాదులపై ధర్మమనే గోడలు కట్టబడుతాయి. అలానే ప్రేమను కార్యరూపంలో ప్రకటిస్తే అది ధర్మం అనబడుతుంది. ఈ ప్రేమనే మనస్సులో నిలుపుకొంటే శాంతి ఏర్పడుతుంది. ప్రతివారిలో అంతర్లీనంగా ఉన్న దివ్యశక్తి యే ప్రేమ. సత్య, ధర్మ, శాంతి, అహింసలలో అంతర్వాహినిగా ప్రవహించేది ప్రేమయే".**

విద్యార్థులు భౌతిక విద్యలతో పాటు పవిత్రమైన ఆలోచనలు మనసులో ఉంచుకోవాలి. అన్నిటి కన్నా సత్యాన్ని గ్రహించాలి. ఈ సత్యమును ఎంత త్వరగా గ్రహిస్తే అంత తొందరలో మత సామరస్యము, సానుభూతి, సహనము మొదలైన పవిత్ర గుణాలతో స్పందంచిన హృదయం చైతన్యవంతమై అందినీ ఏక భావంతో చూడగలుగుతుంది. ఇటువంటి నమ్మకము మొదట తనలో గట్టి విశ్వాసముగా ఏర్పడుటతో, క్రమేపి స్థిరపడి సంఘ శాంతికి దారితీసి దేశక్షేమాన్ని స్థాపిస్తుంది.

ప్రతి మనిషి తన ధర్మములన్నింటిని నియమముతో యధావిధిగా పాటించుటయే జీవితమునందు ఒక తపస్సు. త్రికరణములలో మనస్సు మొదటిది. అది ఆదేశములకు, ఉద్రేకములకు, వాంఛలకు దూరంగా ఉండాలి. పై గుణములు మనస్సుకు సహజాలు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు - మనస్సు నందు ఆవిర్భవించు ఆదేశాలు. అవి మానవునికి అంతర్ శత్రువులు.

**కామం - కర్మ నాశనం; క్రోధం- జ్ఞాన నాశనం; లోభం - భక్తి నాశనం.**

**కామ క్రోధలోభములు వరుసగా కర్మ, జ్ఞాన, భక్తి హీనుని చేస్తాయి. మూర్ఖుని గావించును.** క్రోధానాకి కామం కారణం. కామం అజ్ఞానం వల్ల కలుగుతుంది. 'అజ్ఞానం పశు లక్షణం.' అందుకు ఈ అజ్ఞానాన్ని త్యాగం చెయాలి. 'పశ్యతీతి పశు'.

మానవుడు **మూడు స్వభావాలు** కలిగి ఉంటాడు.

1. నీచమైన జంతు స్వభావము. 2. ప్రపంచ జ్ఞానము కల మానవ స్వభావము. 3. వాని యదార్థ మైన దివ్య స్వభావము.**ఈ దివ్యమైన స్వభావమే మానవుని నిజమైన ఆత్మ. అట్టి విద్యను నేర్పునదే బ్రహ్మవిద్య.**

విధ్యార్థులు నేర్చుకోవలసినది ఇటువంటి విద్యను. ఒక మంచి గుణంతో తనలో ఉన్న మిగిలిన మంచి గుణాలు కూడా సరియైన స్ఫూర్తిని పొంది, మంచి మార్పును తీసుకువస్తాయి. విచారణ, విచక్షణాశక్తులు అభివృద్ధిచెంది ఇతరుల్ని గ్రుడ్డిగా అనుకరించ (దురలవాట్లు నిముషంలో పట్టుపడతాయి విద్యార్థులలో) కుండా వివేకంతో ఎలా ప్రవర్తించాలి, దేనికి ఎప్పుడు ఏ విధంగా ప్రాధాన్యత ఇవ్వాలి అని ఆలోచించుకుని, ఆ విధమైన విషయాల్నిమాత్రమే గ్రహిస్తాడు. అప్పుడు ఇతరుల లోని చెడును అనుకరించటంకాని, అనుసరించుటకాని చెయ్యకుండా, వారిలోని మంచిని మాత్రమే గ్రహిస్తాడు.

"భూమిలో విత్తనము నుంచి, దానికి వలయు మట్టిని, గాలిని, నీటిని కూర్తుము. ఆ విత్తనము మొక్క అయిన పిదప మహావృక్షముగా మారును. అప్పుడు మట్టిగాని, గాలిగాని అగునా? తనకు సమకూర్చబడిన దానిని గ్రహించి, అది తన స్వధర్మానుసారమగు గొప్ప వృక్షమగును. మీరునూ (విద్యార్థులు) అట్లనే ప్రవర్తింతురు గాక. మీరు ఇతరులవద్ద నుండి నేర్చుకొనవలసినదెంతయో యున్నది. శ్రేయస్కరమగు దానిని ఇతరుల యొద్ద (హీన కులజుడనైనను సేవించి) అభ్యసింపుము. దానిని మీ స్వధర్మాను సారంగా మీలో యిముడ్చుకొనుము. అంతే కాని మీరు ఇతరులుగా మారరాదు. దీనిని విద్యార్థులు నేర్వవలెను. ప్రథమ విద్య ఇదే. ప్రధాన విద్య ఇదే", అని భగవాన్ విద్యార్థులకు బోధించే హితవు ఎంత అర్థవంతమైనదో, ఆచరణీయ



మైనదో విద్యార్థులేకాక, వారిని సరియైన మార్గంలో నడుపవలసిన తల్లిదండ్రులు, పెద్దలు, ఆధ్యాపకులు కూడా సరిగా అర్థం చేసుకోవాలి.

భగవాన్ మహావాక్యాల్లోని అంతరార్థాన్ని ఆకళింపు చేసుకొని, విద్యార్థులకు సరిగా అందచేస్తేనే వారిలో రావలసిన పరివర్తనకూడా సరిగా వస్తుంది.

పరోపకార బుద్ధి విద్యలో ప్రధాన సూత్రమంటూ చెట్లనే ఉదహరిస్తూ భగవాన్ ఇంకో ప్రబోధ కూడా చేసారు. **"చెట్లు తమ ఫలములను తాము భుజించక, త్యాగభావమున పరులకు అందించుచున్నవి. నదులు పరోపకార భావమున జలమును తాము గ్రోలక, ఇతరుల తాపమును ఎట్లు చల్లార్చు చున్నవో; ఆవులు తమ పాలను తమ బిడ్డలకై ఏర్పడిననూ, అవి పరోపకారభావవముతో పరులకు ఏ రీతిగా పంచి పెట్టుచున్నవో, అదే విధముగా విద్యార్థులు, విద్యావంతులు తాము ఆర్జించిన విద్యను పరోపకార చిత్తముతో, నిస్వార్థ త్యాగములతో తమ సేవలను ఇతరులకు నిమిత్తమై అందించాలి."** స్వార్థమనేది విద్యార్థులలో ఏ కోశానా ఉండకూడదు. ఈ సందర్భంలో, విద్యార్థులలో ఎంత సంకుచితభావం, స్వార్థం ఉంటుంటాయో, ప్రదర్శిస్తారో జ్ఞాపకం వస్తున్నది. మంచి మార్కులు తెచ్చుకున్నారు కదా, ఆన్సర్లు వ్రాయటంలోను, presentation లోను ఏ పద్ధతి ఉందో చూద్దమని, తమ పద్ధతిని అభివృద్ధి చేసుకోవచ్చనే జిజ్ఞాసతో కొంతమంది విద్యార్థులు కుతూహలం చూపిస్తారు. కాని ఆ బాగా వ్రాసినవారికి భయం. వాళ్ళు తమతో పోటీకి వస్తారేమో అని అసూయ. అందుకు ఆ పేపర్లు దాచేసుకుంటారు. ప్రక్కను కూర్చున్న పిల్లలు తమ పుస్తకంవైపు చూచినట్లనిపిస్తేనే ఆ వ్రాసేదేమిటో వారికి తెలియకుండా చేత్తో కప్పేస్తుంటారు. "ఈనాడు విద్యార్థుల్లో మితి మీరిన స్వార్థము ప్రవేశించినందువలన తమ తమ గతులనూ, మతులనూ పెడమార్గములో పెడుతున్నారు. తాము సంపాదించు కొన్న విద్యా సంపదను ఉదారంగా పరులకు దానం చేయాలి."

ఉపకారము చేయక పోయినా అపకారం చేయకూడదు. ఒక వేళ ఎవరైనా తనకు అపకారం చేస్తే వారి గురించి అధ్యాపకులకు, ప్రధానోపాధ్యాయునికి చెప్పాలి కాని, తాను దండించే పద్ధతి పెట్టుకోరాదు. ఉదార స్వభావంతో

నిరాడంబరత్వము అలవాటు చేసుకోవాలి. 'శక్తికి మించిన పరుగుల'న్నట్లు, కొంతమంది విద్యార్థులు కొంత విద్య నేర్వటంతోనే అహంకారిగా అభినయించటంకాని, తమలోటు తెలియకూడదని ఆడంబరంగా జీవితాన్ని గడపటం కాని చేస్తారు. తమ పరిస్థితుల్ని బట్టి, వాటికి తగినట్లు జీవించాలి.

విద్యార్థులు శుభ్రతను విధిగా పాటించాలి. బాహ్య శుభ్రతతో పాటు, అంత:శుభ్రత అవసరం. లోకరీతిగా నిత్య జీవితానికి సంబంధించిన ప్రతి వస్తువును శుభ్రం గా పెట్టుకోవాలి. ధరించే వస్త్రాలు, చదువుకొనే పుస్తకాలు, పుస్తకాలుంచే బీరువాలు (అలమారులు), పరిసర ప్రాంతాలు అన్ని పరిశుభ్రంగా ఉండాలి. "పండ్లు(Teeth), కండ్లు(Eyes) మొదలుకొని తిండ్లు, బండ్లు (Vehicles) వరకూ శుభ్రతను పాటించాలి. దీనివలన ఆరోగ్యము చేకూరును." **'అరోగ్యమే మహాభాగ్యం'**. ఎన్ని సంపదలున్నా, ఎటు వంటి చదువున్నా అరోగ్యం సరిగా ఉండాలి. లేకపోతే సుఖముండదు. సంతోషముండదు. ఈ బాహ్య శుభ్రత గురించి ఎవరికి వారే శ్రద్ధ పట్టాలి. అమ్మా, అక్క చెల్లెళ్ళు చేస్తారని అశ్రద్ధ చెయ్యకూడదు. ఈ బాహ్య శుభ్రత అలవాటుగా ఏర్పడితే అంత: శుభ్రత దానంతట అదే వస్తుంది. మనస్సు, బుద్ధి పవిత్రంగా, ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఇంతవరకూ చెప్పు కున్నట్లు విద్యార్థులు గమనించవలసిన సద్గుణాల్ని సక్రమంగా, సవ్యంగా పాటిస్తూ ఉంటే అంత: శుభ్రత ఆటోమేటిక్ (automatic) గా అలవడుతుంది. మలినమైన, అపవిత్రమైన, అసహ్య మైన, అనారోగ్యకరమైన (unhealthy) ఆలోచనలు, భావాలు స్ఫురించ కుండా ఉండటమే ముఖ్యం. (ఒక వేళ ఏ పరిస్థితిలోనైనా, ఎవరి ప్రలోభంతోనైన అటు వంటి స్పందన ఏర్పడితే బుద్ధి, హృదయం (అంతరాత్మ) వెంటనే మనస్సుకి బుద్ధిచెప్పాలి, వివేకంతో, విచక్షణతో. కనుకనే భగవాన్ అందించే నీతి. **"నేను మానవుడిగాపుట్టి, విద్యావంతుడుగా (విద్యార్థి గా) చెలామణి అవుతూ, గొర్రె మాదిరి పరుల మనసును అనుసరించికానీ. పరులమాటలు వినికానీ, నీ మనస్సును మాలిన్యము చేసుకోరాదు. అది గొర్రె లక్షణము అనుకుంటుండాలి"**, అని 'గురువాణి' ని అనుగ్రహిస్తూ, తమలో ఇటువంటి విశాల భావాలు హృదయ పరివర్తన తీసుకు వస్తున్నందుకు, విద్యార్థులు, అధ్యాపకులు, అందరూ భగవంతునికి (భగవాన్ శ్రీ సత్యసాయి బాబాకు) కృతజ్ఞలు చెప్పుకోవాలి.



కృతజ్ఞతా భావంతో జీవితాల్లో పరివర్తన తెచ్చుకుని, ఆచరణలో పెడుతూ, అదర్శంగా, అనందంగా ఉంటుండాలి.

గురుదేవుని గురువాణి (దివ్యవాణి) తో స్పందించి కృతజ్ఞలుగా ఉన్నట్లే, తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు; తమకు విద్యను, జ్ఞానమును ఇచ్చి, జీవితంలో తమను ఉన్నతస్థాయికి తీసుకోని పోవుటకు కృషి చేసిన అధ్యాపకులకు; 'జననీ జన్మభూమిశ్చ'- భారతదేశంలో పుట్టిన భారతీయులం మేము అని సగర్వంగా చెప్పుకోగల అదృష్టం కలిగించిన భారతదేశానికి -మాతృభూమికి - ముఖ్యంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలి.**దేశమే మన దేహంగా భావించాలి.**

## సంస్కృతి

**నిత్య జీవితంలో సమగ్రతాభావాన్ని సాధించేదే సంస్కృతి.** శరీరమునకు, మనస్సునకు, ఆత్మకు గల సరైన సంబంధ బాంధవ్యాన్ని గుర్తించి ఏకత్వమును భావించటమే సంస్కృతి. అనేకత్వంలోని ఏకత్వము నిరూపించేదే సంస్కృతి సర్వ 'సంస్కృతి' యందు ఆరితేరినది భారతీయ సంస్కృతి. భారతీయ సంస్కృతి కేవలం మాటలతో నిర్మాణమైనది కాదు. **కాలముచే మారక, ప్రళయముచే తరుగక, సృష్టిచే పెరుగక ఏ సత్యమైతే ఉన్నదో ఆ సత్యాన్నికి దివ్య స్వరూపమే భారతీయ ధర్మం.** ఇది నిత్య మైనది. సత్య మైనది. అందుచే విద్యార్థులు ప్రాచీన భారతీయ సంస్కృతిని గౌరవిస్తూ, విద్య యొక్క పవిత్రతను, పరమార్థాన్ని గుర్తిస్తూ, ఆధ్యాత్మిక విద్యతో ఆత్మ విశ్వాసం పెంచుకుంటూ, మానవతా విలువల ఆదర్శాన్ని నిత్యజీవితంలో అనుసరిస్తూ, చిన్న చిన్న కాలువల వంటి లౌకిక విద్యలతో పాటు, సముద్రమువంటి ఆత్మ విద్యను హృదయంలో చేర్చుకునే అభ్యాసం అలవరుచుకుంటూ, అనేకత్వములోని ఏకత్వాన్ని అందరిలోను దర్శిస్తూ, అందరి యందుండే దైవత్వాన్ని గుర్తిస్తూ జీవితాన్ని దివ్య మైన అనందంతో వర్ధి ల్లేలా కృషిచేయాలి.

" భారతీయులు ప్రాచీన కాలమునుండి శ్రవణ, మనన, నిధిధ్యాసములను, జపతపములనూ కేవలము ముక్తి నిమిత్తము ఆచరించ లేదు. మానసిక సంభాషణలనరికట్టే నిమిత్తమని బోధిస్తూ వచ్చేరు. ఆ సంభాషణలను అరికట్టి నప్పుడే నిర్మల మనస్సు చేత మహత్తర కార్యములను చెపట్టి సాధించవచ్చును.

**మనస్సునందు రెండు విధములైన తలంపులు జరుగుతుంటాయి. ఒకటి ఆలోచన, రెండవది మానసిక సంభాషణ,** (మనస్సుతో) మన సమస్యలను పరిహారము గావించు కొనే స్థితిని పొందేది ఆలోచనలు. దీనికి భిన్నంగా సమస్యలను మరింత అభివృద్ధిగావించి, మానవుని అనేక విధములైన పెడమార్గములను పట్టించేవి మానసిక సంభాషణలు. ఈ మానసిక సంభాషణలలో పరుల దూషణలనూ, చెడ్డనూ, పరిస్థితినీ ప్రవేశపెట్టు చున్నాము. మనకున్న అనారోగ్యమునకూ, త్వరలో ప్రవేశిస్తున్న వృద్ధాప్యమునకు, సమస్త దు:ఖములకూ ఈ మానసిక సంభాషణలే మూలకారణము. ఇవి పెరిగి పెద్దవై మానవత్వమును కూడా మరపింప చేయుచున్నవి. జాగ్రదావస్థ యందను భవించిన సంభాషణ స్వప్నావస్థ యందు కూడా ప్రారంభమవు తున్నందున నిద్రలోని మానసిక విశ్రాంతిని కోల్పోయి బాధించు దు:ఖము లనూ, విషాదములనూ అరికట్టుకో లేని బహీనులైపోతున్నారు. వాటి వలన లభించే ఫలితమేమాత్రమూ లేదు. **ఏ మానవుడు ఈ మానసిక సంభాషణను స్తంభింప చేసి, విశ్రాంతి నందు కొనగల్గునో అట్టి మానవుడే పరిపూర్ణ మానవుడు.** మానసిక సంభాషణలను అరికట్టే సాధనలను ఉపనిషత్తులు తెలుపుతూ వచ్చాయి. ప్రాణాయామము మొదటి సాధన. గాలిని పీల్చడము పూరకము. గాలిని విడవడము రేచకము. ఈ రెండింటి మధ్యలో గాలిని నిలబెట్టడము కుంభకము. ఈ పూరక, రేచక, కుంభకముల మధ్య మనస్సును ఏకాగ్రత పరచాలి. మనస్సునందు ఎవరు లోపలకు వెళ్ళుతున్నారు, ఎవరు బయటకు వెళ్ళుచున్నారు అని ప్రశ్నించుకోగా మానసిక సంభాషణలు తగ్గిపోతాయి. ఈ విధమైన ఉచ్ఛ్వాస, నిశ్వాసముల గమనము నందు మనస్సును ప్రవేశపెట్టిన మానసిక బలము చేకూరుతుంది. (విద్యార్థులు ప్రాణాయామము, దాని పద్ధతి, అర్థము సరిగా నెర్చుకోవాలి). రెండవ సాధన నిర్విరామ కర్మాచరణము. పరోపకారముతో, ప్రజాసేవతో కూడిన కర్మల నాచరించవలెను. మనస్సును పవిత్రకార్యములందు ప్రవేశ పెట్టినప్పుడు మానసిక సంభాషణలు తగ్గుతాయి.

భారతీయ చరిత్రలో పూజనీయులైన ఆదర్శమహాత్ములెందరో ఉన్నారు. తప్పు మార్గం బోధించిన ఉపాధ్యాయుని కాదని గాంధీజీ మహాత్ముడయ్యాడు (తల్లి సంరక్షణలో పెరిగి). మాతా పితరులనారాధించి ధర్మవ్యాధుడు





మహానుభావుడయ్యాడు. సత్యవ్రతాచరణచే రాముడు, హరిశ్చంద్రుడు అమరులైరి. **"అహింసా పరమోధర్మ:"** అని మనో వాక్కాయ కర్మలచే ప్రాణులను హింసించక గౌతమ బుద్ధుడు ఆచార్య పీఠము నలంకరించేడు. సద్ధర్మాచరణచే మానవులు మహాపురుషులైరి. విద్యార్థులు స్వయంకృషి, ఆసక్తితో, ఈ మహనీయుల జీవిత చరిత్రలను, వారు చూపిన ఆదర్శములను చదివి, గ్రహించి, ఆచరణలో పెట్టవలెను .

**"కాగితంబుమీద కలిగిన అక్షరాల్**
**చదివినంతనె ధరణి చతురుడగునె?**
**అక్షరముల యందు అర్థంబు నెరుగుచు**
**చదువునట్టి వాడె శ్రేష్ఠుడగును".**

**మర్మమెరిగిన మరునిముషములో మనసే వ్యక్తులకు గురువవుతుంది. హృదయమును ఏ నాడు పరిశుద్ధము గావించు కుంటామో ఆనాడే గురుపూర్ణిమ.** మనస్సే గురువవుతుంది. "నాకు స్వార్థ స్వప్రయోజనాలేవు. ఆస్తిపాస్తుల మీద అశే లేదు. **నా కున్న ఆస్తంతా నా విద్యార్థులే"** అంటూ,"విద్యార్థులు ఆత్మనిగ్రహము (Self Control), అత్మానందము (Self Satisfaction, contentment and happiness).ఆత్మజ్ఞానము (Self Realisation) లను సమ్మిళితపరచి ఆదర్శ విద్యార్థులుగా తయారవాలి. స్వేఛ్ఛ అని అనేక అర్థాలు చెప్పుకుంటూ, తోచిన పనులు అన్నీ చేయటం కాదు. ఇష్టం వచ్చినట్లు బజార్ల వెంట తిరగటం కాదు. హృదయ పరిపాకము, హృదయవిశాలము, హృదయ నిర్మలముతో నిజమైన స్వేఛ్ఛ వస్తుంది.

**"విద్యార్థులు ఒకొక్క దేశమునకు, ఒకొక్క గృహమునకు, ఒకొక్క బజారునకు ఒక జ్యోతి మాదిరి ఉండాలి.** పవిత్రమైన మానవతా విలువల్ని పోషించుకుంటూ, విద్యాసంస్థలలో ఉన్న సమయంలో అన్ని రంగాల్లోను ప్రవేశించి, పది మందితో కలిసి, పది మందితో కలిసి మెలిసి ఉంటూ, సహనాన్ని, సానుభుతిని, ప్రేమతత్త్వాన్ని, ఇతర మంచి గుణాల్ని(క్వాలిటీ ప్రధానమని గ్రహించాలి) పెంచుకోటానికి పూనుకొని, మంచి పేరు తెచ్చుకోవాలి. **నాకు కావలసింది మాటలులేని హృదయం. హృదయంలేని మాటలు**

**నాకు అక్కరలేదు"** అని ఖండితంగా, ఖచ్చితంగా విద్యార్థులకు తమ అమృత తుల్యమైన ప్రేమ సందేశాన్నిచ్చేరు, బాబా. విద్యార్థి దశనుండే మానవత్వాన్ని ఎలా పోషించుకోవాలో అనే శిక్షణనిస్తుంటారు. దైవం సన్నిధిలో ఉంటూ, వారి తోను, ఇతరులతోను మెలగవలసిన మంచి పద్ధతులను వారి సమక్షంలోనే నేర్చుకొంటూ, వారి ముఖత: నేర్చుకోవలసిన, ఆచరించవలసిన నీతుల్ని అభ్యసిస్తూ ఉన్న విద్యార్థులు ఎంత అదృష్టవంతులో కదా!

నేటి విద్యార్థులు రేపటి పౌరులు కనుక సమాజానికి ఉపకరించే రీతిగా సమాజ సేవయే సర్వేశ్వరసేవగా సమస్త శక్తులనూ సమాజానికి అర్పితం గావించాలి. విద్యా గర్వంచేత విద్యార్థులు **భగవంతుని సన్నిధికి దూరం కాకూడదు. భగవంతుని సన్నిహితం చేసేదే విద్య. 'సావిద్యా యా విముక్తయే' - ముక్తికోసమే విద్యనేర్వాలి. అదియే జీవిత గమ్యము. అది యే నిర్వాణము. అట్టి నిర్వాణ సంబంధమైన విద్యను నేర్వాలి.**

విద్యార్థులు నేడు భౌతిక విద్యలతో బాటు వినయ విధేయతలను, సచ్ఛీలమును అలవరచుకోవాలి. ఈనాటి విద్యార్థి కలిమిని, బలిమిని, చెలిమిని ఆశిస్తున్నాడే కాని ఏ మాత్రము గుణమునకు ప్రత్నించుట లేదు. **గుణార్జన నిమిత్తమేర్పడినది విద్య కాని ధనార్జన నిమిత్తమేర్పడినది కాదనే సత్యాన్ని ప్రతి విద్యార్థి చక్కగా గుర్తించాలి.** భావి భారత పౌరులుగా ఈ సత్యాన్ని ఇంకా బాగా గుర్తించి వర్తించాలి. అప్పుడు,

**"కోటీశ్వరుల కైన కూడు గుడ్డయె గాని**
**బంగారమును తిని బ్రతుక లేరు**
**కాలమే గాకున్న, కఱ్ఱయే పామగు**
**కలసి వచ్చిన, మట్టి కనక మగును,**
**పండితుడొక చోట పశువుగా మారు,**
**మూర్ఖుండు ఒక తరిని మునిగ మారు,**
**ధనవంతు నొకపరి దారిద్ర్య దేవత**
**వరయించి వారితో వరుసలాడు**
**ప్రాకులాడుటయే గాని, ప్రాప్తిలేకున్న**



**దమ్మిడీయైనను నీకు దరికి రాదు,**
**వద్దురాబాబు, వద్దురాబాబు ఏ ఆశ హద్దుమీరి,**
**బుద్ధి తో మెలగు శ్రీ సాయి వద్ద చేరి!!**
**(బుద్ధి కలిగి జీవంచుమో పెద్ద మనిషి)**
అనే విషయం గ్రహించి లోకరీతిని చక్కగా అర్థంచేసుకుంటాడు.

**ఈ లోకంలో ఒక్కటే శాసనమున్నది.** అదే ప్రేమ శాసనము. ఆ యా దేహము చేసిన కర్మలను బట్టి సుఖదు:ఖములు సంభవించును. మంచి, చెడ్డలు (కీడు) సంపూర్ణ విలువలు కావు. అవి వ్యక్తుల యొక్క లోపముల ప్రతిఘాతములని విద్య వివరిస్తుంది. **మానవుడనగా భావాల పంట. మంచినీ చెడ్డనీ విచక్షణచేసి, మంచి భావాలను భద్రపరుచుకొనేలా చేస్తుంది విద్య. అదే ఆత్మవిద్య.** ఉదాహరణమునకు ఒక కుర్చీ పేరు, రూపమునీ మనసులోనే కాని కఱ్ఱలో లేవు. నీ స్వప్రయోజనమును బట్టి అన్ని సంబంధములూ ప్రాముఖ్యతలూ కలుగుతాయి. సంబంధము కోరికను హెచ్చించే ఏర్పాటు కాదు. కోరికలను పరిగెత్తించే విధానము. జ్ఞానమనగా కోరికలను పోగొట్టే ఒక ఉద్యమము. అందుచే ఎవరూ ఎ వస్తువునూ దాని నిమిత్తం ప్రేమించడు. దానిని ఎంత సేపూ తన స్వార్థ నిమిత్తం ప్రేమిస్తాడు. ఒక ఉద్దేశము లేనిదే ఏ మానవుడూ కదలడు, ఒక ఉద్దేశమునకు ఆ వ్యక్తి సంపూర్ణ కర్త కాదు అని విద్య తెలుపుతుంది. ఒక స్థితిలో నున్న దానిని మరొక స్థితిలోనికి మార్చునదే కర్మ. ఒకే శక్తి (చైతన్యము) అన్ని చేతులతో, కళ్ళతో, చెవులతో పని చేయుచున్నది. యావత్తు మానవజాతి ఒకే పదార్థముతో చేయబడినది. అమెరికా వాని శరీరము, చైనా, ఆఫ్రికా, భారతీయ శరీరములన్నీ ఒకే ఒక విధమైన మాంసము, రక్తము, ఎముకలతో కూడియున్నవి. పుట్టుకతో వచ్చిన సహజ జన్మము, కోరికలు, సకల జీవులకూ సామాన్యంగా ఉన్నాయి. వైజ్ఞానిక మార్గంలో, పరిశోధనలో కూడా రాతిలో, కఱ్ఱలో, లోహంలో జీవం ఉన్నదనే సత్య ప్రకటన వ్యక్తమపుతుంది. **అదే దైవిక మైన సత్తువ (శక్తి) - ఆత్మ. దేవుడు. ఈ దేవుడు ఒక్కడే అనే అకళంకమైన నమ్మకం ఏర్పడాలి.** ఏ దేశీయులైనా, మతస్థులైనా దీనిని ఆత్మ విద్య వల్ల అభ్యసిస్తారు. తెలుసుకుంటారు. దేవుడు ఒక్కడే అనే భావం, ఎరుక ఇరుసుగా ఉండి, దానిచుట్టూ మిగతా సిద్ధాంతాలు తిరుగుతుంటాయి.

ఇది చిన్నప్పట్నుంచే పిల్లలు అభ్యసిస్తే **'అనేకత్వంలోని ఏకత్వం'** ఏర్పడి ప్రేమ అను 'పంట' చక్కగా పెరుగుతుంది. దీనినే భగవాన్ దివ్యబోధలో "అత్మతత్త్వమనే" విత్తనం ప్రాణవంతమై ఎవరి హృదయంలో హత్తుకుంటుందో, అది పారమార్థిక సస్యాభివృద్ధిని అత్యద్భుత రూపంగా వెలువడేటట్లు చేస్తుందం"టారు. ఈ ప్రక్రియలో మహనీయ బోధ జరుపు గురువులు (సామాన్య గురువుల కంటే ఉత్తములు), బుద్ధి కుశలత, బుద్ధి పరిపాకము గల శిష్యులు ఇద్దరూ ముఖ్యమే. అప్పుడే హృదయ క్షేత్రంలో ప్రాణ వంతమైన ఆత్మతత్త్వ చింతన అనే విత్తనం బాగా నాటుకుంటుంది.ఇదే లౌకిక విద్యల కతీతమైన ఆత్మవిద్య అవసరం. **"విత్తనం మొలకెత్తి, చెట్టు అయి ఎలాగైతే వృద్ధి చెందుతుందో అలాగే మానవుడు కూడా పెరిగి, పరిణామం చెంది, అన్నీ విధాలా పరిపూర్ణుడు కావాలి. మానవునికి రెండు రకాలైన పరిజ్ఞానములు కలవు. ఒకటి ఇహలోక పరిజ్ఞానము. రెండవది పరలోక పరిజ్ఞానాము".**

ఇహలోక పరిజ్ఞానానికి లౌకిక విద్య, పరలోక పరిజ్ఞానానికి బ్రహ్మ విద్య అవసరం. ఇహమును సుఖింప హేమతారక విద్య పరమును సుఖింప బ్రహ్మవిద్య; అన్నారు. అందుకు విద్యార్థి ఎదుగుతూ (శరీరకంగా, మానసికంగా) పరిణామం చెందుతూ, చైతన్య స్వరూపులైన జీవులకు జడస్వరుపులైన వస్తువులతో శాశ్వత సుఖము, సంబంధము, సంతోషము, ఉండదని గ్రహిస్తాడు. నదులకు సముద్రములాగ, జీవులకు గమ్యస్థానము నిత్యసుఖము, మోక్షము అందించే బ్రహ్మ ప్రాప్తి మాత్రమే అని తెలుసుకుంటాడు. మనకి కనిపించని, తెలియని మోక్షము గురించి మానసిక పరిణామం, ప్రగతి పొందని మానవులే పట్టించుకోరుకదా, చిన్నప్పటినుంచీ విద్యార్థి దశలో ఉన్న వారికి చెప్పే అవసరం ఎందుకని తలిదండ్రులు, అధికారులు, పెద్దలు అనవచ్చు, అనుకోవచ్చు. మోక్షమంటే ఏప్పుడో చనిపోయిన తర్వాత, వస్తుందో, వచ్చిందో లేదో అనుకునే మోక్షం కాకుండా, మనిషి మనస్సుని కోర్కల నుండి ఎప్పుడు పవిత్రము, శుద్ధం చేసుకుంటాడో అప్పుడు నిర్మల మనస్కుడవుతాడు. అప్పుడు మోహము నాశనమవుతుంది. **ఈ మోహ నాశమే మోక్షము. "మోహక్షయమే మోక్షము".** అని శ్రీ సత్యసాయి భగవానుడు జ్ఞానబోధ గావిస్తారు.



ఆ విధంగా సరిగా గ్రహించలేని పుట్టి గిట్టని - అంటే చావు పుట్టుకలు వాటి అంతరార్థం తెలియని మోక్షం మొదలైన వాటిగురించి ఏదో అనుకుంటూ(అనుకో కుండా కూడా) అర్థం లేని అశాంతి జీవితాలను గడిపేస్తుంటారు. చివరికి ఆఖరు శ్వాస విడిచే సమయంలోనైనా (నేటి భీకర పరిస్థితులు, అల్లకల్లోలసమయాల్లో అదీ సాధ్యం కాదేమో మామూలుగానే) మనస్సుని పరమాత్మ యందు లగ్నం చేద్దామన్నా, ప్రాపంచిక తాపత్రయాల్లో అదీ వీలవదేమో - భగవాన్ చెప్పినట్లు ఆ సమయంలో కూడా ఒరేయ్, ఆ ఆవు దగ్గరకు దూడ పోయిందేమో, దాన్నికట్టి రారా అంటాడు కాని, రామా, కృష్ణా, సాయీ అంటూ నిర్మలంగా జీవితం చాలించడు. ఇటు వంటి ఘోర పరిస్థితుల నుండి కాపాడ బడటానికి చిన్నప్పటినుంచే ఆత్మ విద్య - ఆధ్యాత్మిక విద్య బోధిస్తుంటే మనిషిలో మార్పు వస్తుంది!! లౌకిక విద్యతో పాటు ఈ ఆత్మ విద్యగా ఆధ్యాత్మవిద్యగా కొంత కాకపోతే కొంతైనా పారమార్థికం గురించి ఆలోచిస్తూ ప్రశాంత జీవనాన్ని గడుపుతాడు. అనాదినుంచీ ఆచారంగా వస్తున్న వేదాధ్యయనాలు, శాస్త్ర పురాణేతిహాసాల సౌలభ్యం, అర్థం, ఆనందం మనకి అందుబాటులో ఉన్నాలేకపోయినా, భగవాన్ బాబా ఎంతో దయదలచి, ప్రేమతో మనకీ 20, 21 శతాబ్దపు వేదాన్ని సులభంగా, సునిశితంగా గ్రాహ్య మయ్యేటట్లు చెపుతున్నారు. మనందరం ఎంతటి అదృష్టవంతులమో! పూర్వజన్మ సుకృతంగా వచ్చిన ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకుంటూ సత్ఫలితాల్ని పొందుదుముగాక! దీనికి "ఏ శ్రమయు, ఏ ప్రాప్తియు. ఏ యోగ్య కర్మయు చేయనక్కరలేదు. నిరంతరము మనస్సును పర్మాత్మయందు ల్గ్నము చేసిన చాలు", అని మనకు అనుగ్రహించిన సులభ మార్గంలో పయనిస్తూ, ప్రత్యక్ష ప్రభువుకి కృతజ్ఞతాంజలులు అర్పిస్తుందాము.

శుభం

# అనుబంధం గురించి నాలుగు మాటలు

భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్య సాయి బాబా విద్య - విజ్ఞానశాస్త్రము, ఆత్మవిద్య అయిన ప్రజ్ఞానశాస్త్రము, విద్యార్థినీ విద్యార్థులు, భారతీయ సంస్కృతి మొదలైన అనేక విషయాల గురించి, అనేక సందర్భాల్లో నుడివిన విషయాల్ని ఆయా అధ్యాయాల్లో వ్రాయటమైంది. అయితే భగవాన్ తమదైన మధుర భాషలో, శైలిలో ఆ విషయాల్ని గురించి, ఆ భావాల్నే - ఉదహరణాలు మొదలైన వాటితో ఇంకా విపులంగా - ఎంత అందంగా, మనకి ఆసక్తి కరంగా విపులీకరించారో ఒక ప్రత్యేక అధ్యాయంలో పెట్టటమైంది. మనన, నిధిధ్యాసములకు ఎంత గానో ఉపకరిస్తుంది. అన్నిటినీ ఒక చోట చదువుకుని ఆనందించే (ఈ ప్రక్రియ) - ఎన్ని సార్లు విన్నా, చదువుకున్నా ఇనుమడించిన ఆత్మానందాన్ని అందిస్తుంటుంది. అదే ప్రత్యక్ష ప్రభువు మనకి అందరికీ అందించే ఆత్మ విద్య, వ్రాస్తూ ఉన్న సమయంలోనే కాకుండా తర్వాత తర్వాత ఆయా సందర్భాల్లో భగవాన్ నుడివిన దివ్యోపన్యాసాలు, వారందించు ఆదేశాలు కూడా ఆ విధంగా దీనిలో అనుబంధంగా చోటు చేసుకున్నాయి.

'త్వమేవ మాతా చ పితాత్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవ దేవ'.

అని మనం ప్రార్థించు రీతిగానే 'గురుదేవులు' గా వారందించే ప్రబోధామృతాలు అనంతంగా ఉంటాయి. మనం మన జీవిత గురు కులాల్లో వారి శుశ్రూషలో వారి నోటినుండి వచ్చే ప్రతి పదం పవిత్ర మంత్రంగా మననం చేసుకుంటూ, అంతర్భూతంగా, అంతర్లీనంగా, ఎన్నో అంతరార్థాలతో ఉన్న ఆ దివ్య సందేశాల్ని జీర్ణించుకుంటూ (ఆచరణలో పెట్టే) ఆ స్ఫూర్తితో వాటిని ఇంకా ఇంకా విశ్లేషించుకుంటూ, ఏ కొంచమైనా అచరణలో పెడుతూ, మనం మారుతూ, భగవాన్ చేపట్టిన బృహత్కార్యాల్లో ఏ కొద్దిగానైనా వారికి సేవ చేసుకోగల్గితే 'జీవన సార్థక్యం' సిద్ధించినట్లే అని భావిద్దాము.



భగవాన్ 'విద్యావాహిని' లో ప్రారంభించి, ఈ మధ్య వచ్చిన 'ఎడ్యుకేర్' సాహిత్యంలో తలమునకలు వేయిస్తూ చూపిన 'ఉడతా భక్తి' సాయి రామ సేవ ఇది. 'భగవాన్ ఉవాచ'గా 'త్రివేణి సంగమ' స్నానం. అందరికీ అన్ని తరహాలవారికి ఉపకరిస్తుందని విజ్ఞులకు విన్నవించు కుంటున్నాము. భగవాన్ 'సాయి ఒక్కడు నీ ప్రక్కన' అని హామీ నందించి, ప్రక్క ప్రక్క నుంటూ చేయి పట్టి నడిపిస్తూ, చేయించిన పవిత్ర కార్యమిది.

విద్యార్థుల నుద్దేశించే అయినా, బాబాయే చెప్పినట్లు, విద్యార్థులు బాల్యమంతా తలిదండ్రుల సంరక్షణలోను, తర్వాత అధ్యాపకుల శిక్షణలోను గడుపుతుందురు కనుక, పెద్దలైన తలిదండ్రులు, అధ్యాపకులు కూడా బాబా అందించే ఈ దివ్య వాక్కుల్ని అర్థం చేసుకుని, ఆదర్శప్రాయులైన విద్యార్థుల్ని తయారు చేయటం తమ కర్తవ్యం గా భావించాలి.

తూములూరు ప్రభ<br>తూములూరు కృష్ణమూర్తి

# అద్భుత సృష్టి అందించు గుణపాఠాలు

ప్రాచీనకాలంనుండి మహనీయులు, ఋషులు భారతదేశ సంస్కృతీ సంపదల గురించి భారతీయులకు చెపుతూవచ్చేరు. అందుకు భారతీయ సంస్కృతిని గురించి విధిగా తెలుసుకోవాలి, ప్రతి ఒక్కరూ, ఒకో దేశానికి ఒకో రకమైన విశిష్ఠ, విలక్షణమైన సంస్కృతీ, సంప్రదాయాలుంటాయి. అవే ఆ దేశాన్ని ఇతర దేశాలనుండి; ఆ దేశీయుల్ని ఇతర దేశీయులనుండి ప్రత్యేకించి చూపుతాయి. ఇటువంటి అవగాహనతో, ప్రతి భారతీయుడు 'జననీ జన్మభూమశ్చ స్వర్గాదపి గరీయసి' అని భావించాలి. ఈ కృషిలో చిన్నప్పటినుంచే దైవ చింతన, దైవప్రీతి, సృష్టిక్రమము, సృష్టివైచిత్రములు మొదలైనవి అర్థంచేసుకుని, ఆనందపడుతుండాలి.

"సృష్టి అంతటికీ భగవంతుడు బీజం. ఈ బీజభూతమైన భగవంతుని నుండి గుణాలుద్భవించాయి. ఆ బీజం మొక్కగా పెరుగుతుంది. ఈ వికాసం యొక్క వివిధ దశలు - మొక్క, ముళ్లు, ఆకులు, పూలు, పళ్ళు అన్నీ బీజం లోనే ఉంటాయి" .

సృష్టిలో అనేక రూపాల్లో దివ్యత్వం ఉంటుంది. అణువునుంచి మహత్తువరకు కూడా అది సాక్షీ భూతంగా సృష్టి అంతటా వ్యాపించి ఉంటుంది.

ఋగ్వేదంలోని సృష్టి మంత్రాలు ఇదే చెప్తాయి.

భిన్నత్వం ప్రకృతి గుణం; ఒక్క పరమాత్మ అనేకంగా అగుటకు సంకల్పించాడు. సృష్టిఅంతా దివ్యత్వం యొక్క ప్రదర్శన.

ఆధునిక విజ్ఞాన శాస్త్రం 15 బిలియన్ల సంవత్సరముల క్రిందట నిరవధికమైన మందం కలిగిన ఒక పరమాణువు పేలిపోయింది అనే బిగ్ బాంగ్ - Big Bang సిద్ధాంతాన్ని చెప్తుంది. బిగ్ బాంగ్ కి ముందట స్థితిని గూర్చి సైన్స్ ఏమీ చెప్పలేక పోయింది. బిగ్ బాంగ్ తోనే దేశ కాలములనే భావాలు ప్రారంభమైనాయి. ఆ పేలుడులో వెలువడిన చిన్న ముక్కలు ఇప్పటికీ ఒక దాని నుండి ఇంకొకటి సుదూరంగా వెళ్ళిపోతూ అంతరిక్షంలో విశ్వం వ్యాపిస్తున్నదనే భావాన్ని మొదట పేలుడు జరిగినప్పుడు శూన్యంలోకి





ప్రకంపనాలు ప్రారంభించాయని విశ్వమంతా పేలుడు ధ్వనితో నిండి పోయిందని ఆ సిద్ధాంతంలో శాస్త్రజ్ఞులు చెప్పారు. ఆ విధంగా సూక్ష్మ రూప అంతరిక్షంనుండి స్థూల రూప మైన భూమి వరకు విశ్వం అంతా భిన్నత్వంలోని దివ్యత్వాన్ని, ఏకత్వంలోని ప్రాథమిక సత్యాన్ని ప్రకటిస్తూ ఆవిర్భవించింది. ఈ సృష్టి అనుభవించడానికి పంచతన్మాత్రలు (పంచభూతముల గుణాలు - శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు); పంచేంద్రియాలు - శ్రవణము(చెవి), చర్మము, కన్ను, నాలుక, ముక్కు సృష్టించబడ్డాయి. శూన్యం యొక్క గుణం శబ్దం. అది విశ్వ వ్యాపి; పంచభూతములలో (ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి). వీనిలో పృథ్వి (భూమి) చాల ప్రధానమైనది. దానిపై ఉండే జీవరాసుల కన్నింటికీ అది పోషణ నిస్తుంది. ఈ విధంగా ప్రకంపనల దగ్గరనుండి ప్రసారము, ప్రసారస్థితి నుండి వాస్తవస్థితికి దివ్యత్వానికి సాక్షీభూతంగా సృష్టి నిలచిఉంది. ఈ పంచభూతముల గుణాలే పంచతన్మాత్రలు. ఇవన్నీ ప్రాథమిక మూలస్థానమైన సచ్చిదానందము నుండి వచ్చాయి. ఆ విధంగా "నన్ను నేను ప్రేమించుటకై నన్ను నానుండి విడిగా చేసుకున్నాను"అన్నాడు భగవంతుడు. సృష్టి ఆ విధంగా ఏర్పడిది. అట్టి సృష్టిలో సంతోషప్రదాలైన ఎన్నో మార్గాలను భగవంతు డిచ్చాడు. కాని వాటిని అందరితో పంచుకొని అనుభవించాలి. అందులో నీ భాగానికి మాత్రమే నీకు హక్కు ఉంది" .

సృష్ట్యాదినుండి అసంఖ్యాక జీవులు ఈ గ్రహంపై ఉన్నప్పటికీ మానవుడే ఉత్తముడు. తనను గురించి తాను అన్వేషణ చేయ గలవాడు, తనలోని దివ్యత్వాన్ని ప్రకటించ గలవాడు మానవుడొక్కడే. అందుకే మానవ జన్మ చాల అరుదు. జంతూనాం నరజన్మ దుర్లభం.

"సృష్టిలో పంచభూతాలున్నాయి. మానవునిలో పరమప్రేమ అనే ఆరవ గుణము కూడా ఉన్నది".

"జీవితం ప్రేమతో ప్రారంభం అవుతుంది. జీవితంలో నుండి వచ్చే ప్రేమ మాధుర్యం అన్నింటికి మూలభూతమైన విశిష్ఠ సూత్రం".

"నూలు యొక్క పడుగు పేకలతో వస్త్రం తయారైనట్లే ఆలోచనల పడుగు పేకలతో మనసు తయారవుతుంది". మానవుడు మనస్సును

అదుపులో పెట్టుకుని, హృదయాన్ని ప్రేమతో నింపాలి. ప్రతి వ్యక్తిలో మానవతా విలువలు ఉంటాయి. అవి బయటి నుండి తీసుకుని రాలేము. లోపలనుంచే గ్రహించాలి. **ఆ మానవతా విలువలను బయటకు కార్యరూపంలో తీసుకొని వచ్చుటే ఎడ్యుకేర్". సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింసలను వ్యాపింప చేయుటే బాబావారి అవతార లక్ష్యం.**

**"వ్యక్తుల యొక్క బాధలను తొలగించి, వారిని ఆశ్వాసించటం ఒక్కటే నాకర్తవ్యం కాదు. నా అవతార కార్యంలో అది యాదృచ్ఛికం (incidental) మాత్రమే. వేదశాస్త్రముల సారాన్ని ప్రజాహృదయాలలో పున: ప్రతిష్ఠించుటే నా ప్రధాన కర్తవ్యం".** దీనికి భగవాన్ ఆచరించే కార్యములు, చేయు ప్రబోధలు, వేదశాస్త్ర వివరణలు ఉపకరిస్తాయి. క్లుప్తంగా కొన్ని:

| పంచ భూతములు | పంచభూతముల, తన్మాత్రలు, గుణాలు | ఇంద్రియము |
|---|---|---|
| ఆకాశము | శబ్దము | శ్రవణము (చెవి) |
| వాయువు | స్పర్శ | చర్మము |
| అగ్ని | రూపము | కన్ను |
| జలము | రసము | నాలుక |
| పృథ్వి | గంధము | ముక్కు |

**"సత్యమనే పునాదులపై ధర్మమనే గోడలు కట్టబడతాయి. అలాగే ప్రేమను కార్యరూపంలో ప్రకటిస్తే అది ధర్మం అనబడుతుంది. ఈ ప్రేమనే మనసులో నిలుపుకొంటే శాంతి ఏర్పడుతుంది. సత్య ధర్మాలను అవలంబిస్తే శాంతి యొక్క పూర్ణ స్వరూపాన్ని అనుభవించవచ్చు. ఈ ప్రేమ అనేది ఎక్కడనుంచి వచ్చింది అని విచారించి ఆ మూలాన్ని అర్థం చేసుకుంటే అహింస అనే సత్యాన్ని గుర్తించవచ్చు. ప్రతివారిలో అంతర్లీనంగా ఉండే దివ్య శక్తియే ప్రేమ. సత్య, ధర్మ, శాంతి, అహింసల లో అంతర్వాహినిగా ప్రవహించేది ప్రేమయే".**

ఒక చెట్టు పంచభూతముల నుండి - భూమి, నీరు, సూర్యకాంతి, గాలి ద్వారా పోషణను పొందుతుంది. తిరిగి దాని పళ్ళు, పశుగ్రాసం, ప్రాణవాయువు, బెరడు, కలప ఇచ్చి జంతువులకు, పక్షులకు అనేక



సూక్ష్మ జీవులకు అంటే భూతకోటికి పోషణను ఇస్తోంది. అలాగే

| | | |
|---|---|---|
| సూర్యుడు - | కాంతి కిరణాలను ప్రసరింపచేసి | సృష్టి పెరుగుదల |
| పూలు - | లోని తేనెను ఆస్వాదించి | తుమ్మెద సరిగా ఉంటుంది |
| అగ్ని - | ఉష్ణ గుణం, దహన గుణం | సహజ గుణాలు |
| మానవుడు - | త్యాగ, దయా, ప్రేమ గుణాలతో చుట్టూ సామరస్యాన్ని పెంపొందిస్తూ, తన విధులను నిర్వహించాలి. | |

ఈ విధంగా సృష్టిలోని ప్రతి వస్తువు మానవునికి ఎన్నో గుణపాఠాలు తెలియ చెప్తుంది.

## ఆత్మ ప్రబోధ - అందరికీ

భగవాన్ చెప్పే ప్రబోధలుప్రతి శ్రద్ధగా పాటించటం విద్యార్థుల కే కాకుండా అందరికీ ముఖ్యం. స్వామి చెప్పే ప్రతి మాటా మంత్రమే. ప్రతి వాక్యం వేదసమానమే. అయినా ఈ విషయానికి, సందర్భానికి తగినట్లు కొన్ని ఇందు చేర్చటమైనది:

రోజును ప్రేమతో ప్రారంభించు - Start the day with love
రోజును ప్రేమతో గడుపు - Spend the day with love
రోజును ప్రేమతో నింపు - Fill the day with love
రోజును ప్రేమతో ముగించు - End the day with love

అను సూక్తులు దైవాన్ని చేరే మార్గమే కాకుండా, మననే దైవం వలె మార్చుతాయి. ఎంత పరదూషణ ఉంటే మానవుడు అంత క్రుంగి పోతాడు. స్వార్థాన్ని త్యాగం చేసి, ప్రతివారినీ ప్రేమించాలి. కించిత్తైనా సహాయం చేస్తూండాలి. Help Ever - Hurt Never- 'పరోపకారాయ పుణ్యాయ పాపాయ పరపీడనం' అని గుర్తించాలి. పరులకెంత సహాయం చేస్తే అంత సహాయం లభిస్తుంది. అలాగే పరులకెంత కీడు చేస్తే అంత కీడు కల్గుతుంది.

అందుకు విశాల భావంతో ఉంటే పవిత్ర ఆనందం లభిస్తుంది.

'సహస్ర శీర్షా పురుష స్సహస్రాక్ష సహస్రపాత్' అనే గుర్తింపు సంఘంలో ఏకత్వానికి దైవత్వానికి దారితీస్తుంది.

“నేను ఏమి చేసినా, తలపెట్టినా నిస్వార్థంగా చేస్తాను, సమాజ benefit కోసం. నాకు ఫలితం ఒక్కటే. అది అందరి ఆనందం. నాకు ఎవరితో విరోధంలేదు. అందరితో సంయోగమే.” “All are one”, అను ఏకాత్మ భావాన్ని ప్రబోధిస్తారు.“దీనికి నేనే సాక్షి” అంటారు స్వామి. ఈ "All are one" అనే భావం చిన్నప్పటినుంచీ, విద్యార్థి దశ నుంచీ వస్తే ఈర్ష్య, ఓర్వలేనితనం, అనారోగ్యకరమైన పోటీతత్త్వం మొదలగునవి లేకుండా ఉంటాయి. వేష భాషల కంటే సుగుణస్వభావం అతి ముఖ్యం అని గ్రహిస్తారు.

“ఈ నాటి బాలురు రేపటి తండ్రులు, బాలికలు రేపటి తల్లులు. అందుకు చిన్నప్పుడు మీ తల్లిదండ్రులను గౌరవించడం నేర్చుకుంటే రేపు మీ బిడ్డల నుండి మీరు గౌరవాన్ని పొందడానికి అర్హత సంపాదించు కుంటారు. మొక్క చిన్నదిగా ఉన్నప్పుడు వంపులతో పెరిగితే పెద్దయాక ఆ వంపులు పోవు. అందుకే చిన్నతనంలో ప్రవర్తన మంచిగా ఉండాలి”.

అలాగే ఈ నాటి విద్యార్థులు రేపటి పౌరులు. మనోబలము, విద్యాబలము, బుద్ధిబలము, ధనబలము, జనబలము ఎన్ని ఉన్నా గొప్ప అధికార స్థానమును ఆక్రమించినా, మానసిక కోమలత్వము, దయ, ప్రేమ శూన్యమైతే లక్ష్యం సిద్ధించదు.

విద్యార్థి దశ నుండే మానవత్వాన్ని దైవత్వంగా మార్చుకోవాలి. మానవుని మాధవుని గా మార్చే నిమిత్తమై ‘ దైవం మానుష రూపేణ’ దైవం మానవాకారము ధరించి వచ్చాడు. అని మానవాకారంలో ఉన్న మాధవుణ్ణి గుర్తించగల్గాలి. కామ రాగ రహితమైన బలము భగవత్స్వరూపము. కామ, రాగ సహితమైన బలము పశుబలములే కాని పశుపతి బలము కానేరదు. కనుక పశు బలమునకు ప్రాధాన్య మివ్వక పశుపతి బలములు పెంచుకుంటూ ఆదర్శ పౌరులుగా రూపొందాలి.

బాలవికాస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పవిత్రమైన భావ చైతన్యమును అభివృద్ధి చేసుకోవాలి. విద్యార్థులు తమ మనస్సులను వికసింపచేయు కార్యములను చేయుచుండవలెను. ఉపాధ్యాయులు వారిని దైవోన్ముఖులుగా తీర్చిదిద్ది సాటిలేని సమాజ సేవ చెయ్యాలి. ఈ మనో



భావములందు ప్రవేశపెట్టి సంస్కరించగలరు. ఇటు వంటి పవిత్ర ఆత్మవిద్యనభ్యసించే వారి సంతోషం భగవంతునికి ఆనందం కలిగిస్తుంది.

**“మంచితనము నందు, మానవత్వము నందు;**
**నీతి యందు, నిండు నిజము నందు;**
**ఆచరించి చెప్పు, ఆచరించి చూపు ఆదర్శములనెల్ల;**
**అతడే యువకుడు, ఆమె యువతి కాదె;**
**ఇట్టి వారె బెస్ట్ ఫ్రెండ్సు మీకు,**
**ఇట్టి వారె బెస్ట్ ఫ్రెండు నాకు”** అని యువకులైన విద్యార్థులు ఎటు వంటి బెస్ట్ ఫ్రెండ్సుని ఎన్నుకోవాలో అనే నీతిని బోధిస్తూ, అటువంటి వారే నాకూ బెస్ట్ ఫ్రెండ్సు అని తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు, బాబా.

“భగవంతుని ఆనందం భక్తుల బహుమానం”

మన సమాజం లోనే సర్వ స్వరూపమైన మానవత్వాన్ని ఆవిర్భవింప చేసుకొని, సర్వం బ్రహ్మమయం అనే స్వరూపాన్ని మనం నిరూపించాలి, అని యువకులైన విద్యార్థులకు సలహా నిచ్చారు, సత్య సాయి బాబా. **బ్రహ్మ అనగా పెరుగుట, విస్తరించుట, వ్యాపించుట. ‘ఈశావాస్య మిదం సర్వం’. సర్వమును ఈశ్వరుడే. బ్రహ్మము స్వప్రకాశము, స్వప్రతిష్ఠము. బ్రహ్మకు బ్రహ్మనే ఆధారము. ఆత్మ కంటే బ్రహ్మ వేరు కాదు. ‘ఆనందో బ్రహ్మ’. పరమాత్మయే.**

చుక్కలన్నీ బ్రహ్మ. సూర్యుండు బ్రహ్మ. చంద్రుడన్నను బ్రహ్మ; జలము బ్రహ్మ; స్వర్గమన్నను బ్రహ్మ, వైకుంఠ మది బ్రహ్మ. తల్లి యన్నను బ్రహ్మ. తండ్రి బ్రహ్మ. పుట్టించునది బ్రహ్మ. పోషించునది బ్రహ్మ. గిట్టించునది బ్రహ్మ. గృహిణి బ్రహ్మ. కాలమంతయు బ్రహ్మ. కాయంబు బ్రహ్మ. ప్రకృతి అంతయు బ్రహ్మ. ప్రాణంబు బ్రహ్మ. సర్వమును బ్రహ్మ. మరియు ఈ సభయు బ్రహ్మ. సత్యమును బ్రహ్మ. తెలుపు (తెలిపే) సత్యసాయి, ఈ సత్యసాయి బ్రహ్మ. సర్వము బ్రహ్మమయమే. బ్రహ్మమునకు వేరైన పదార్థ మొక్కటియూ లేదు. సర్వము బ్రహ్మ రూపముగా నున్నపుడు మనము వెదుకుట ఎక్కడ? తాను చిక్కుట ఎక్కడ? విశ్వవిభుడే (ప్రాణేశ్వరుడే) హృదయేశ్వరుడు”.

"కాయమునుగానీ, కర్మనుగానీ, అపవిత్రము చేయక, పరులను బాధించక, తానూ బాధ పడక, మంచిగా ఉండి, మంచిని తలంచుచు, మంచిగా జీవించినప్పుడు బ్రహ్మత్వమనునది సులభముగా అర్థమగును. లబ్ధియగును", అని అపురూపమైన ఆత్మ విద్యను యువతకు బోధిస్తూ, ఆత్మతత్త్వమును (బ్రహ్మత్వమును) సులభంగా అర్థమయేటట్లు చేస్తారు, భగవాన్. భౌతిక, లౌకిక విద్యలతో పాటు ఇటు వంటి ఆధ్యాత్మిక విద్య మేళవింపు కూడా చాలా అవసరం. అప్పుడే ఈ సృష్టియందు మానవత్వానికి తగిన తెలివితేటలు, ప్రత్యేక జ్ఞానాన్ని అందించిన సృష్టికర్త చేసిన సృష్టి క్రమ పరిణామము విజ్ఞాన శాస్త్రాని కందని, సృష్టిలోని చిత్రవైచిత్ర్యా లు మొదలైనవి కొంతవరకైనా మానవుడు అర్థం చేసుకుని, అబ్బురపడి, ఆనందంతో ఆ ప్రజ్ఞానాన్ని పెంపొందించు కుంటాడు. దీనినే **'ప్రజ్ఞానం బ్రహ్మ'** అన్నారు. ఇదే **"Constant Integrated Awareness'.** ఈ 'ప్రజ్ఞానం' అన్ని సమయాల్లోను, అన్ని కాలాల్లోను మార్పు చెందక, నిశ్చలంగా ఉంటుంది. **ఈ ప్రజ్ఞానమే ఆత్మ. ప్రజ్ఞానము. ఎరుక, ఆనందము, నేను, బ్రహ్మ ఇవన్ని ఆత్మకు పర్యాయ పదాలే.** భౌతికమైన లోకమును గుర్తించి దీనికి పేర్లు మారుస్తూ వచ్చారు. ఎవరి భాషలు పురస్కరించుకుని ఒకే వస్తువునకు, పదార్థానికి పేర్లు పెడతారు. కాని, వస్తువులో, పదార్థంలో మార్పు ఉండదుకదా! అందుచే మానవుడు ఒకొక్క పేరును ఒకొక్క రూపముగా భావిస్తున్నాడు. **ఇది దేహము. క్షేత్రమని మరొక పేరు. ఈ దేహము లో దేహి అని, క్షేత్రము లో క్షేత్రజ్ఞుడు** అని ఒకడున్నాడు. ఆ క్షేత్రజ్ఞుడు లేక దీనికి క్షేత్రమనే పేరు లేదు. కనుక పేరుకు తగిన ప్రవర్తన అందులో గుర్తింపచేస్తుంది. మానవత్వం చాలా విశిష్టమైనది. ఉత్కృష్టమైనది. సౌజన్య మైనది. సౌశీల్య మైనది. అటు వంటి **మానవత్వాన్ని మొదట అర్థం చేసుకుని మొదట మానవునిగా, తర్వాత మాధవుని గా** మారే ప్రయత్నం చేయాలి. ఈ ప్రయత్నంలో మానవునికి అజ్ఞానమనే అంధకారాన్ని నిర్మూలం చేసి జ్ఞానజ్యోతి అనే ప్రకాశాన్ని అందించే గురువు పాత్ర చాలా ముఖ్యం. **గురువంటే కేవలం లౌకిక విద్యలు బోధించేవాడు కాదు. అతడు అధ్యాపకుడు** మాత్రమే. ఈ అధ్యాపకులలో, తాను ఆచరించి ఇతరులకు బోధించేవాడు గురువు. **ఆచరణతో నిరూపణ చేసేవాడు ఆచార్యుడు.** "అటువంటి గురువు



బోధతో ప్రపంచమంతా ప్రజ్ఞ యొక్క చైతన్య తత్వం అర్థం చేసు కోవటం కష్టం. కాని, "ఉన్నది ఒక్కటే. ప్రకాశించేదీ ఒక్కటే, ఆనందింప చేసేది ఒక్కటే. అనేక భ్రాంతుల చేత అనేకత్వముగా అనుభవించి అనేక రూపనామములు కల్పించుట గా ఉంటున్నది కనుక ఆత్మతత్త్వము అనగా ఏకత్వముతో కూడిన దివ్యత్వమనే సత్యాన్ని గుర్తించాలి", అను చైతన్య తత్వమును అర్థం చేసుకో గల్గుతాడు, మానవుడు. ఈ సత్యాన్ని అర్థం చేసుకుంటే ప్రపంచమంతా వ్యాపించి, నడుపుతూ ఉన్న దివ్య శక్తి అదే అనే జ్ఞానం కల్గి, దృఢ పడుతుంది. రూపనామాలు (రాముడు, కృష్ణుడు అని) వేరుగా ఉన్నా, అంతటా వ్యాపించి ఉన్న దివ్యశక్తి ఒక్కటే అనే అనేకత్వంలోని ఏకాత్మభావం తో బ్రహ్మా నందం పొందుతాడు. ఇటు వంటి అవగాహన విద్యార్థుల్లో చిన్నప్పటినుంచే ఏర్పడి, క్రమేపి దృఢ పడాలి. మానవులందు ఆత్మచింతన కుదరటంతో ప్రపంచం మారుతుంది.

ఈ ఆత్మ విద్యలో ఆత్మచింతన కుపయోగించే కొన్ని కొన్ని ప్రార్థనలు, శ్లోకాలు, స్తోత్రాలు, సూత్రాలు, సూక్తులు మొదలైనవి విధిగా నేర్చు కుంటారు.

## విద్యార్థులకు హిత బోధ

"పట్టిన పట్టేదో పట్టనే పట్టితివి
పట్టు నెగ్గెడుదాక అట్లే ఉండు"

అని, విద్యార్థినీ విద్యార్థులు పట్టు దలతో ప్రారంభించిన విద్యను నిష్ఠతో, నీమంతో సాగించి, సాధించాలి. ఆ చదువుకి, తన జీవితానికి సార్థకతను చేర్చుకోవాలి. అప్పుడు "వరదుడు (భగవంతుడు) మద మాత్సర్యముల ద్రుంచి ముద మిస్తాడు", తప్పక. అంతే కాని - చదువు ప్రారంభించినప్పటి నుంచి, ప్రారంభించక ముందు నుంచే ప్లానులు(plans) వేస్తుంటారు. అసలు ప్రస్తుత రోజుల్లో అత్యాశతో తల్లిదండ్రులు పెద్దలే ఈ మన స్తత్త్వాన్ని పిల్లల్లో పెంచుతున్నారు. ఓనమాలు నేర్వకముందే వాళ్లని దగ్గర, ఒళ్ళో కూర్చోపెట్టుకుని అడుగుతుంటారు. 'ఏమి చదువుతావురా, ఏమి చదవాలని వుంది - డాక్టరా, ఇంజినీరా, అమెరికా వెడతావా,

ఇంగ్లండు వెడతావా' అని. ప్రపంచంలో ఇంకేమి చదువులు లేనట్లు, అమెరికా, ఇంగ్లండు తప్పని సరిగా వెళ్ళి తీరాలి నీవు. భగవాన్ అందుకే పెద్దల్నీ, పిల్లల్నీ మనస్సులో పెట్టుకునే

“నిద్రలేచిన దాది నిద్రపోయెడుదాక ఆస్తికై,
కుస్తీలు పడతారయా;
ధనము కోసం దైవధ్యానాలు, బోనాలు
కోటి పన్నాగములు పన్నేరయా;
రూపాయి కొరకై లోపాయికారి గా
అడ్డమైన గడ్డి తింటారయా;
రంగ రంగా యంచు దొంగ మ్రొక్కులు మ్రొక్కి;
పంగనామము ప్రజలకు పెడతారయా;
ఇతరు లెరుంగక యున్న ఈశ్వరు డెరుంగడా;
తగిన ఫలములు అనుభవిస్తారయా”

అని జీవిత సత్యం వెల్లడి చేసి, మంచి మార్గం లో మనుష్యులు ఆలోచించు కుంటూ, తమ పిల్లల్ని చిన్నప్పటి నుంచీ తప్పు దారిలో పడకుండా, మంచి మానవ లక్షణాల్ని పెంచుకుంటూ మంచిగా ఉంటూ, మంచి విద్యను నేర్చుకుని, తమను ఉద్ధరించుకుంటూ, సంఘానికి, దేశానికి, ప్రపంచానికి మేలు చేయాలి. చిన్నప్పటి నుంచే తోటి మంచి బాలురకు, పెద్దలకు క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థులు నేర్వాలని, **అంతర్లీనంగా తనలోనే ఉన్న మానవతా విలువల్ని వెలికి తీస్తూ, క్రియా రూపంలో ఆచరిస్తూ, ఆత్మ విద్యను, భౌతిక విద్యతో భాగంగా పఠించాలని ఉద్ఘాటిస్తున్నారు.** భగవాన్ ఈ విధంగా:

**“మీరు చేసే పనులు పరులకు హితంగా ఉన్నప్పుడే మీకు సన్నిహితుడనవుతాను. మీకు ప్రండుగా ఉంటాను”** అని హామీ ఇస్తున్నారు. ఈ మాటలతో ఎంత 'ధీమా' గా ఎంత విజయ వంతంగా జీవితాలను సాగించొచ్చు కదా! ద్వాపరయుగంలో ఒక్క అర్జునుడికి మాత్రం గీతోపదేశం చేసి, అర్జునుడి ద్వారా మనకా సందేశాన్నందించేరు కృష్ణ పరమాత్మ. కాని కలియుగంలో, నేటి సత్య సాయి భగవానుడు “నా జీవితమే నా



సందేశం” అంటూ సాధు సత్పురుషులకు, ధనిక, పేద వర్గాలవారికి, విద్యార్థినీ విద్యార్థుల నుండి, అధ్యాపకులు, ఉద్యోగులకూ, స్త్రీ పురుషులు ఆదిగాగల ఇన్ని కోట్ల మానవాళికి, (అంత ఎందుకు సర్వ మానవులకు) ఎన్ని ప్రబోధాలందిస్తున్నారో అనూహ్యం. ఆనాటి కురు క్షేత్ర సంగ్రామాన్ని మించిన నిత్య జీవన సమరంలో తాము సర్వసమర్థుడైన సూత్రధారుడుగా, తామే అతి యోగ్యుడైన పాత్రధారుడుగా, ఇంత ఎందుకు సనాతన సారధిగా ఉంటూ తాము రచించిన నాటకంలో మనమంతా సుశిక్షితులైన, , ప్రయోజకులైన పాత్రధారులుగా మన పాత్రల్ని మనం ధీమాగా, నేర్పుగా, ప్రేమను నింపుకుంటూ, పంచుకుంటూ విజయాన్ని సాధించే సద్గతి మనకు అనుగ్రహించాలని పూనుకున్నారు. ఈ లక్ష్య సాధనలో వారవలంబించేవి ఎన్నో ప్రక్రియలు. అవన్నీ వారికి వారేసాటి యైన భగవంతుడుగా వారికే చెల్లుతాయి.

“చదువులన్ని చదివి చాల వివేకియై
మదిని తన్నెరుగడు మందమతుడు;
ఎంత చదువు చదివి ఏరీతి యున్నను
హీను డవగుణంబు మానలేడు;
తరచి చదువు చదువ తర్క వాదమె
గాని పూర్ణ జ్ఞానంబెపుడు పొందలేడు;
చదువు లన్నియు చదివి చావంగ
నేటికి చావు లేని చదువు చదవ వలయు”

అని తమ గురుదేవు వాణిని ఎన్ని తరహాల వారికి అందిస్తున్నారో చూడండి! మరి ఇన్ని కోట్ల మానవాళిలో ఇంకెన్ని తరహాల వారుంటారో కదా!! భౌతిక విద్యలో ఒక అంశం గా Mathematicsలో నిష్పత్తి (Ratio)గురించి మెదడుకి పని చెపుతాడు విద్యార్థి. మరి, మనం, ఇన్ని కోట్ల మందిమి భగవాన్ అనుక్షణం మనకోసం శ్రమించే ఈ పవిత్ర లక్ష్య సాధనలో ఎంత సహాయ సహకారాలందిస్తూ వారి పనిని సఫలీకృతం చెయ్యగలం; మన మట్టుకు మనము భక్తి విశ్వాసాలతో, వివేక విచక్షణలతో మన పాత్రల్ని పవిత్రముగా, ఉత్తమంగా చేయగలం; దివ్య భావాలతో,

భవ్య కోరికలతో, నవ్య చేతలతో పరిమితి లేని ఆత్మానందాన్ని అనుభవించ గలం; ఆ విశ్వేశ్వరుడి విశ్వనాటకంలో సత్యం, ధర్మం, ప్రేమ, శాంతి, అహింస అనే అమూల్య రచనలు ప్రాచుర్యభావాల్ని, ఏనిష్పత్తిలో పొంద గల్గుతాయను కుంటూ, లెక్క వేసుకుంటూ మనం కూడా అనుక్షణం ఆచరణకోసం కృషి చేస్తూ, మనం మారుతూ,**"దైవ ప్రీతి, పాప భీతి, సంఘ నీతి"**ని స్థాపించిన వార మగుదుము గాక! ప్రయోజకులైన పౌరులుగా ప్రపంచ ప్రగతిని సాధించుదాము గాక!! ఇదే మనం తీర్చే దైవ ఋణం. వారికి అర్పించి, వారిని అర్చించే కృతజ్ఞతాంజలులు!

## పరమార్థ విశ్లేషణ

**బ్రహ్మ చర్య అంతరార్థము.**

**బ్రహ్మ చర్య మనగా పవిత్రమైన భావం, చర్య, దేహముతో కూడుకొన్న జీవితము.** కాని, దురదృష్టవశాత్తు బ్రహ్మ చర్య మనగా కేవలము వివాహము కాకుండ, జీవితాన్ని ఏదో విధంగా గడుపు కోవటమని భావిస్తున్నారు.

బ్రహ్మ మరియు చర్యము: అనగా **ఏ చర్యను అనుభవించినా, ఏ భావం సంకల్పించినా, ఏ కార్యములో ప్రవేశించినా సమస్తమును బ్రహ్మభావముతో చూడటమే బ్రహ్మ చర్యము. సర్వత్రా భగవంతు డున్నాడనే పవిత్ర భావంతో, దివ్యమైన చర్యతో, నిస్వార్థ మైన సేవతో గడపటమే బ్రహ్మ చర్యము యొక్క ప్రధాన లక్ష్యము.**

**జీవితము నాలుగంతస్థుల సౌధము:**

మానవ జీవితములోని నాలుగాశ్రమములు ఒక సౌధములోని నాలుగు అంతస్థుల వంటివి. క్రింద అంతస్థు బ్రహ్మ చర్యము. తర్వాతది గృహస్థము-మూడవది వానప్రస్థము, నాల్గవది సన్యాసము. అందువలన బ్రహ్మచర్యము మిగిలిన మూడింటికి ఆధారభూతమై ఉంటుంది. బ్రహ్మ చర్య బ్రహ్మ చర్యము, గృహస్త బ్రహ్మ చర్యము, వానప్రస్థ బ్రహ్మ చర్యము, సన్యాస బ్రహ్మచర్యము - ఇలా అన్నింటిలోను బ్రహ్మ చర్యము అంతర్భూతమై ఉంటుంది. అన్నింటిలోను ఈ పవిత్రతను - బ్రహ్మ





చర్యమును ప్రవేశ పెట్టినప్పుడే బ్రహ్మ చర్యమునకు సరైన అర్థము లభిస్తుంది. **మానవుడనగా - పవిత్రమైనటు వంటివాడు; గుర్తింపు కలిగినవాడు; నమ్మకము కల్గినవాడు. మా - అనగా ఎప్పటికీ, నవ అనగా క్రొత్త గా-అంటే ఎప్పటికి క్రొత్తగా ఉండేవాడు. క్రొత్తదనం అంటే పవిత్రత అని అర్థం. పవిత్రమైన మానవత్వాన్ని, పవిత్రమైన చర్యలతో, పవిత్రమైన భావంతో గడపటమే బ్రహ్మచర్యం.** అందుచే బ్రహ్మచర్యమంటే లోక సంబంధమైన అర్థం కాకుండా, మానసికంగా అంతర్భూతమైన తత్వాన్ని అర్థం చేసుకొని వర్తించడమే.

గృహస్థ, వానప్రస్థ, సన్యాసములకు బ్రహ్మ చర్యము తో చాల ప్రధానమైన సంబంధం ఉంది. విద్యార్థి దశ చాల పవిత్రమైనది. మిగిలిన మూడు దశలు కూడ విద్యార్థి దశ పైనే ఆధారపడి ఉన్నవి. కనుక ఈ నాలుగు అంతస్థుల సౌధంలో మొదటి దానికి పునాది చాల భద్రంగా ఉండాలి. క్రింది అంతస్థు కూలిపోతే మిగిలిన అంతస్థులన్నీ కూలిపోతాయి. కనుక బ్రహ్మ చర్యంలో మానవత్వాన్ని పవిత్రంగా ఉంచుకోవాలి. **వాక్కు పవిత్రము, మనో పవిత్రము, చిత్త పవిత్రము, క్రియా పవిత్రము - ఈ నాల్గింటి పవిత్రములతో కూడి ఉండాలి బ్రహ్మ చర్యము.** ఏది చూచినా చేసినా గాని బ్రహ్మ భావం తో దాన్ని అర్పితము చేయటం- ఇదే బ్రహ్మ చర్యము.

**సదాలోచన - సత్ప్రవర్తన:**

జీవితంలో మానవునకు కావలసిన ముఖ్య వస్తువులలో అతి ముఖ్యమైనది - అన్నము. ఈ అన్నమే లేక పోతే జీవితమే ఉండదు. కనుకనే జీవితము అన్నమయముగా ఉంటుంది. కాని మానవుడు అన్నం తిని తృప్తి పడే స్వభావుడు కాదు. కడుపు నిండినంత మాత్రాన మనసు నిండదు. జీవితము సంతృప్తి చెందదు. అందుకు అన్నము దేహమునకు, ఆనందము మనస్సుకి అత్యవసరము.**ఆనందముతో కూడినటువంటి జీవితమే మానవునికి పరి పూర్ణ జీవితము.** ఇది బ్రహ్మ చర్య దశలో ప్రథమ సోపానముగా ఉండాలి. బ్రహ్మ చర్యానికి ప్రధాన లక్షణాలు మూడు. దివ్యమైన భావాలు పెంపొందించుకోవటం, సుగంధ పూరితమైన ఆలోచనల్ని

అభివృద్ధి చేసుకోవటం, అచంచలమైన ఆలోచనల్ని అలవరుచు కోవటమూ, అవి, అప్పుడే ఈ అన్నమయంతో ప్రారంభమైన జీవితం ఆనందమయంగా ఉంటుంది. ఈ నాటి మానవునికి ఇంటి నిండా బిడ్డలు, కంటి నిండా నిద్ర, ఒంటి నిండా బట్ట ఉన్నప్పటికీ జీవితంలో సుఖం లేదు. అది తన ప్రవర్తన నుంచి ఆరంభమౌతుంది. ఆలోచన పవిత్రమైనపుడు పవిత్రమైన కర్మలలో ప్రవేశిస్తాడు. కర్మలు పవిత్రమైనపుడు జీవితం పవిత్రంగా, ప్రశాంతంగా ఉంటుంది. కనుక అశాంతికి దూరమవాలంటే ఆలోచనలు, ప్రవర్తనలే మూల కారణం అని గుర్తించాలి.

**త్యాగ భావం - భోగ భావం:**

నేటి మానవుని లో త్యాగ భావం తగ్గిపోయి, భోగ భావం ఎక్కువై పోవటంతో అవసరమైన అన్నానికి కూడా కరువు ఏర్పడింది. యజ్ఞ యాగాదులు కేవలం క్రతువులుగా, హోమం ముందు కూర్చుని మంత్రాల్ని జపించటం గా భావిస్తున్నారు. **యజ్ఞ మంటే త్యాగ భావం.** భోగ భావం చేత బాహ్య ఆకర్షణ అధికమవుతుంది. ఉదాహరణగా: నల్ల తుమ్మెద మంచి చేవ పట్టిన కర్ర నైనా తన ముక్కుతో పొడచి తొలిచి రంధ్రాన్ని ఏర్పరుస్తుంది. కర్ణుడు, తన తొడ మీద గురువు పరుండినప్పుడు ఆ పురుగు తన తొడ తొలుచుకుని పోయినప్పటికిని పట్టించుకోకుండా ఉన్నాడు. అంత శక్తి కల ఆ పురుగు పద్మంలో ప్రవేశించి, ఆ పద్మం మూసుకు పోగానే ఆ సున్నితమైన రేకుల్ని (petals) దాటి బయటకు రాలేక పోతుంది. ఆ పుష్పము లో ఉండే మధురమైన మకరందం గ్రోలుతూ తన దివ్య తత్వాన్ని మరచిపోతుంది. ఆ విధంగా మానవుడు తన చుట్టూ తన ఇంటిలో సర్వత్రా ఉండే దైవత్వాన్ని విస్మరించి, తానూ దివ్య స్వరూపుడననే విశ్వాసం కోల్పోయి కేవలం భౌతికమైన విషయ వాసనల చేత మత్తుడై తన శక్తిని మరచి పోతున్నాడు.

**దైవత్వం - శాశ్వత ఆనందదాయిని:**

**జగత్తులో దైవత్వమొక్కటే శాశ్వతము.** మిగిలిన వన్నీ అశాశ్వతమే. అట్టి శాశ్వత దైవత్వాన్ని మనస్సులో భద్ర పరుచుకోవాలి. దివ్యత్వమనే గుణమే అందరినీ కాపాడుతుంది. దైవాన్ని నమ్ముకున్నవారికి ఏ విధమైన తక్కువ ఉండదు. బాధలు పర్వతాల వలె, ఉప్పెనలా వచ్చినా, మంచు



వలె మటు మాయమవుతాయి. కనుక దైవం పై విశ్వాసాన్ని అభివృద్ధి పరుచుకుని, స్థిర పరుచుకోవాలి.

**నమ్మి చెడినవాడు లేడు:**

అన్నింటికీ మూలము నమ్మకము. నమ్మక చెడిన వారున్నారు కాని నమ్మి చెడిన వాడు ఈ లోకాన లేడు. అనిత్యము, అశాశ్వతమైన విషయాల్ని-చిత్రాన్ని, వార్తాపత్రికల్ని, నవలల్ని, నాటకాన్ని, పంచాగాల్ని-నమ్ముతున్నారు కాని, పవిత్రమైన, భగవద్వాక్యమైన దివ్య వాణిని నమ్మలేక పోతున్నారు. దైవవిశ్వాసానికి దూరం కావటమే కారణం. అందువలన ఈనాడు చేయ వలసింది దైవవిశ్వాసం అధికం చేయటం. ఈనాటి యువకులకు ఇది మరీ ముఖ్యం. వారు అనేకములైన ప్లాన్లు వేసు కొంటూ పోతున్నారు. కాని ఈ ప్లానుల వల్ల శాంతి రావటంలేదు. దైవ విశ్వాసంతో ఏ ప్లాను అయినా వేసుకో. అయితే దైవానికి సంబంధించిన ప్లాను వెయ్యాలి. దైవ విశ్వాసంతో తప్పు మార్గంలో పయనించి దైవానికి విరుద్ధంగా ప్రవర్తించకూడదు.

**పురుషార్థము:**

**పురుష అంటే పురుషుడు, స్త్రీ అని కాదు, ఇక్కడి అర్థం. దేహం లో నఖ శిఖ పర్యంతం సంచరించే చైతన్య శక్తికే 'పురుష' అని పేరు.** కేవలము దేహాన్ని పురస్కరించుకొని పురుషుడు కాదు. ప్రతి దేహము నందు కూడా ఆ చైతన్యమున్నది. కనుక స్త్రీ పురుషులందరికీ ఈ పురుషార్ధము అత్యావశ్యకము. ఈ చైతన్యమునే పరమ పురుష అన్నారు. దీనిని character, శీలము, నీతి, పౌరుషము అన్నారు. ఇదే personality అయింది. క్రీస్తు పూర్వం నుంచి పవిత్రమైన వాటిని 'పర్సోనా'(persona)అని పిలుస్తూ వచ్చారు. **పర్సోనా అంటే పవిత్రము.** పవిత్రత అనేది అందరిలోను ఉన్నది. కాబట్టి దీనినే పర్ సన్ (person) అన్నారు. 'పర్సోనా' నుంచే పర్ సన్ (person) వచ్చింది. పర్ సన్ నుంచి పర్సనాలిటీ (personality) వచ్చింది. **దీని అంతరార్థం 'మానవ జీవితం పవిత్రమని'.** బ్రహ్మచారియైనా, గృహస్థు యైనా, వానప్రస్థుడైనా, సన్యాసియైనా ఈ పవిత్రత ను కోల్పోకుండా, కాపాడుకొంటూ, అభివృద్ధి పర్చుకొనేవాడు ఎవరైనా 'బ్రహ్మ చారియే', అదే బ్రహ్మ చారికి అంతరార్థం.

హనుమంతునికి వివాహం అయింది. సువర్చల ఆయన భార్య. అయినా ఆయన శుద్ధ బ్రహ్మ చారియే. అనగా నిరంతరం రామ చింతనము నందే ఉంటూ ఎప్పుడూ భగవంతుని గురించే ఆలోచించేవాడు. అంటే నిరంతరము నిత్య బ్రహ్మ చర్యమే చేస్తుండేవాడు.

రామ పట్టాభిషేక సమయంలో రాముడు అనేక రకములైన బహుమతులు ఇచ్చాడు. అప్పుడు సర్వకాల సర్వావస్థలలోను తమకు సేవ చేసే హనుమంతునికి ఒక్క బహుమానం కూడా ఇవ్వలేదే అని సీత బాధ పడగా **'అతనికి నన్ను నేనే ఇచ్చు కుంటున్నాను, అతనికి ఇవ్వదగిన బహుమానం నాదగ్గర వేరే ఏమున్నది',** అన్నాడు రాముడు. వెళ్ళి హనుమంతుణ్ణి కౌగిలించుకొన్నాడు. అప్పుడు సీత, కేవలం భౌతికంగా స్పర్శ అందిస్తే అది బహుమానం ఎలా అవుతుంది' అంటూ

**రఘుపతి కార్యము ఈడేర్చిన కపి**
**రాజశిఖామణి నీవయ్యా**
**అదనున పురిని జగముల వెలసిన**
**హనుమ ద్గురుడవు నీ వయ్యా**
**పరిపరి లంకా పురమును జొచ్చిన**
**పురవర శౌర్యము నీ వయ్యా**
**పరిపరి విధముల జానకి వెదకిన**
**అమిత పరాక్రముడ వీ వయ్యా**
**రఘుపతి కార్యము నెరవేర్చిన కపి**

**రాజ శిఖామణి నీ వయ్యా,** అని సీతమ్మ కపి రాజ శిఖామణి తో 'నీవే లేక పోతే రామ కార్యము నెరవేర్చే వారెవరు' అని జనక మహారాజు తనకిచ్చిన విలువైన ముత్యాలహారం హనుమంతున కిచ్చింది. హనుమతుడు, అందరూ చూస్తుండగానే, ఆ హారాన్ని తుంచేసి, ఒక్కొక ముత్యాన్ని కొరికి పారవేయ సాగాడు. అంతరార్థం తెలిసినా సీత, అందరికీ సరియైన పాఠం నేర్పాలని, 'హనుమంతా, విలువైన ముత్యాల్ని కొరకటం, చెవి దగ్గర పెట్టుకొని పారవేయటం చేస్తున్నా వెందుక'ని ప్రశ్నించింది. 'అమ్మా, ఏ ముత్యంలోనైనా రామ నామం ఉన్నదేమో అని చూస్తున్నానన్నాడు! 'పిచ్చివాడా! ముత్యంలో రామ నామముంటుందా' అని సీత అడుగగా,





'రామ నామం లేని ముత్యాలు నాకు రాళ్ళతో సమానం. వజ్రాలైనా, మణులైనా, మరకత మాణిక్యములైనా సరే రామ నామం లేకపోతే నాకు మట్టితో సమానమే. రామ నామం లేనిది నా దేహంలో అణు మాత్రం కూడా లేదు, నాకు సర్వత్రా రామ నామమే కావాల' ని తన చేతిపైన గల ఒక వెంట్రుకను తీసి చెవి దగ్గర పెట్టగా ఆ వెంట్రుక కూడా 'రామ్, రామ్, రామ్' అని శబ్దం చేయసాగింది. అతని దేహమంతా రామ నామముతో నిండి పోయింది. **సర్వ కాల సర్వావస్థ లందు రామ చింతన చేయుట వల్ల హనుమంతుణ్ణి బ్రహ్మ చారి అన్నారు. ఇంకా, 'రామా, దేహభావంతో నీవు ప్రభుడవు. నేను సేవకుడను. మనో భావంతో నీవు బింబము, నేను ప్రతి బింబము, ఆత్మ భావంతో నీవే నేను నేనే నీవు' అన్నాడు. హనుమంతుడు దేహంతో దాస్యత్వాన్ని, జీవం తో ప్రతి బింబత్వాన్ని, ఆత్మతో ఆత్మతత్వాన్ని అనుభవించట మే బ్రహ్మచర్యం.**జీవితంలోని మిగిలిన మూడు ఆశ్రమాలలోను బ్రహ్మ చర్యం అంతర్వాహినిగా ఉండాలి. కాబట్టి విద్యార్థులు బ్రహ్మ చర్య దశను చాల జాగ్రత్తగా తీర్చిదిద్దుకోవాలి. పవిత్ర భావాల్ని పెంచుకోవాలి. అప్పుడే పవిత్రమైన చర్యలు పెంపొందుతాయి. ఈ రెండింటికీ గల అవినాభావ సంబంధం, సమైక్యతయే జీవితం. అందువలన, విద్యార్థులు ఏ ఆశ్రమంలో ప్రవేశించినా పవిత్రతను ప్రాణ ప్రదంగా చూచుకోవాలి.

ఏకాగ్రతతో దైవత్వాన్ని సాధించవచ్చు. తాదాత్మ్య భావన తో ఉండటం వల్ల సర్వమూ సమకూరుతుంది. తెనాలి రామకృష్ణుడు అట్టి భావంతో బావ చెప్పిన మాట గురించి బాగా యోచించి తగిన సమాధానం కృష్ణదేవరాయలుకి చెప్ప గల్గేడు. ఆ పదం -'**ఏ - ఆ-వు-రా-బా-వా** ' అనే అంతరార్థం -ఏ అంటే మరాఠీలో రా; ఆవ్ హిందీలో రా; రా అంటే తెలుగులో రా; బా అంటే కన్నడంలో రా; వా అంటే తమిళంలో రా అని అర్థం - అయిదు భాషలలో నుంచి అయిదు అక్షరాలలో ఒక పదమైనది. ఆ యా అక్షరాలకు ఆ యా భాషలలో ఒకటే అర్థం. (1. మరాఠీ 2. హిందీ 3. తెలుగు 4. కన్నడ 5. తమిళ్)- ఆవు ఈనుతోంది అని రామ కృష్ణుడు చెప్పగా ' ఏ- అవ్- రా-బా-వా' అని అతని బావ ప్రశ్నలోని పదాన్ని పట్టుకుని, రామకృష్ణుడు జపం చేస్తూ కూర్చుని తెల్లవారి ఆస్థానంలో అష్ట దిగ్గజాలు చెప్పలేని సమాధానాన్ని తాను చెప్ప గల్గేడు. **చక్కటి సమయ స్ఫూర్తి, ఏకాగ్రత, పవిత్ర చమత్కారంతో జీవితము ఆదర్శవంతంగా తయారవుతుంది.**

## విద్య లో  మానవతా విలువల మేళవింపు

"విద్య యందు నైతిక విలువ జేర్చి
మార్పు కలిగించి చూడాలి
వేదాలు ఈనాడు వాదాల పాలయ్యె
శాస్త్రంబు లన్నచో చప్పబడియె
బహు పురాణంబులు ప్రాతవై పోయెను
శతకంబున్నియు జిడ్డు పడియె
గ్రంధ రాజంబులు గంగ పాలై పోయె
చక్కని నీతులు చెల్లి పోయె
గురు రాజులందరు బరువు భారం బైరి
పెద్దలందరు వట్టి మొద్దులైరి
కల్లలాడు వాడీనాడు పురుషవరుడు
విత్తమున్నట్టి వాడె పో ఉత్తముండు
ఔర! కలియుగపు ప్రభావ మేమి యందు?
సత్యమును తెల్పు బాట సాయి మాట".

**"ఇట్టి కలి యుగాన్ని సంస్కరించటానికి సదాచార, సత్సంప్రదాయ, సత్ప్రవర్తన రూపమైన నిదర్శనముల ద్వారా ప్రచార ప్రబోధములు సలిపి ధర్మ సంస్థాపన నిమిత్తమే ఇప్పుడు నేను రావటం. ఈ అవతార ఉద్దేశం వ్యక్తుల కష్టాలను తొలగించి, ఓదార్చి, నివారించుట మాత్రమే కాదు. అరటి చెట్ల ప్రధాన ప్రయోజనం తియ్యని పండ్లను అందించుటే అయినా చెట్టు ఆకులు, పూవులు, ఊచ మొదలైనవి ఎన్నో ఉపయోగ పడవచ్చును. కానీ చెట్టు ప్రధాన ప్రయోజకత్వం మధురమైన పండ్లను అందించడమే. అదేవిధంగా యీ సత్య సాయి అవతార ప్రధాన లక్ష్యము భారత వర్ష ములో వేదశాస్త్రాలను పున: ప్రతిష్ఠచేసి ప్రజలలో వాటి పట్ల అభినివేశము కలిగించి, వేదసారమును అఖిల మానవులకు అందించే ప్రధాన కేంద్రముగా రూపొందించడమే. సనాతన ధర్మాన్ని పోషించి, రక్షించుటకే నేను అవతరించాను."** సనాతన ధర్మ పోషణకొరకు వేదాధ్యయనానికి అవకాశం కల్పించారు. సనాతన సారధి మాస పత్రిక స్థాపన (1958 సంవత్సరం శివ రాత్రి నాడు ) 'ఇప్పుడిప్పుడే నా



సందేశం ఉపదేశముల ద్వారా ప్రారంభమైనది,' అని ఆ పత్రికను విడుదలచేస్తూ **"సనాతన సారధి పురాతన వేదశాస్త్ర ఉపనిషత్తులు అనే సైన్యముతో అన్యాయ, అక్రమ, అసత్య, అహంకార, అనాచారములనే అసురులను హతమార్చటానికి బయలుదేరింది. ప్రపంచమంతటా భక్తి జ్ఞాన బీజాలను వెదజల్లి సనాతన ధర్మ పున: స్థాపనకు కృషి సల్పుతుంది"**, అన్నారానాడు స్వామి, 'సనాతన సారధి' కి యిచ్చిన సందేశంలో స్వామి. " గొప్పవారు తమ సిద్ధాంతాన్ని ఎప్పుడు కోల్పోరు. ప్రశాంత స్థితిని కాపాడు కొని ఆటంకములను అనుకూలముగా మార్చుకొనగలరు. సమస్తమూ ఆత్మయే అని అనుభూతికి తెచ్చుకొనిన మానవుడు ఎప్పుడూ ఎట్టి పదార్థాలనూ ఆశించడు. నిరుత్సాహము చెందక అంతయు తానే నని నిరంతరానందాన్ని  అనుభవిస్తాడు. అట్టి స్థితిని పొందుట మానవుని ప్రధాన కర్తవ్యం. దీనిని అందించుటే సనాతస సారధి విధి, ఇదే భక్తుల పాలిటి పెన్నిధి", అని ప్రకటించారు.

ఇంకా, సనాతన ధర్మ పోషణకొరకు ప్రశాంతి విద్వన్మహాసభ ఏర్పాటు, శ్రీ సత్య సాయి సేవా సంస్థల స్థాపన, విద్యాగిరి రూపకల్పన మొదలగు ప్రణాళికలను రూపొందించారు, స్వామి. కలియుగపు ప్రభావంగా ప్రపంచంలో నేడున్న పరిస్థితుల్ని ఎత్తి చూపుతూ, అవన్నీ సవరింప బడటానికి చిన్నప్పట్నుంచే బాల బాలికల్లో సరియైన అవగాహన ఏర్పడాలి. దీనికి విద్య యందు భౌతిక, లౌకిక, విజ్ఞాన శాస్త్ర విషయాలతో పాటు నైతిక విలువల్ని నేర్పే విద్యను చేర్చాలి. నైతిక విలువల ప్రభావంతో ఉన్న బాల బాలికలు స్వతస్సిద్ధంగా తమ లోనే ఉన్న మానవతా విలువల్ని రక్షించుకుంటూ పెంచుకుంటూ, క్రమేపి ఉత్తమ పౌరులుగా తయారై , భగవాన్ చెప్పినట్లు తమను తాము సంస్కరించుకోవటమే కాకుండా, ఇతరుల్ని, మార్చ గల్గుతారు. ఆ విధంగా సత్య సాయి అవతార ప్రధాన లక్ష్యం ఈడేరుతుంది. 'సనాతన సారధి' గా సాయి మాట - దివ్య సంకల్పము - సత్యమును తెల్పు బాట. ఆ బాట పయనించే " అఖిల మానవులు" ఆనందంగా, ఆత్మానందంతో వర్ధిల్లుతారు. ఇదే ఈ 21 వ శతాబ్దపు ఆత్మ విద్య - Educare ప్రాశ స్త్యం. వజ్ర సంకల్పముగల స్వామి పవిత్ర లక్ష్యం తప్పక ఈ డేరుతుంది, అని స్వామి ఉద్ఘాటించారు.

ఈ నైతిక విలువల సంస్కారం గల ఒక విద్యార్థి కథ పై విషయాన్ని ధృడ పరుస్తుంది. ధృవ పరుస్తుంది కూడా. ప్రఖ్యాత విజ్ఞాన శాస్త్రవేత్త సి.వి. రామన్ తన సంస్థ లో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టి, వచ్చిన ఒక విద్యార్థి (అభ్యర్థి) సరియైన సమాధానాలు చెప్పక పోవటంతో ఆ ఉద్యోగం రాదనీ, వేరే ఉద్యోగం చూచుకోమని సలహా ఇచ్చి, వెళ్ళి పోయేముందు అతనికి రావల్సిన రైలు ఛార్జీలు ఆఫీసులో తీసుకోమన్నాడు. కానీ, రామన్ పని పూర్తి చేసుకుని ఆఫీసు గది నుంచి బయటకు వస్తూ ఆ విద్యార్థి ఇంకా వరండాలోనే ఉండటంతో రామన్ చిరాగ్గా వెళ్ళిపొమ్మని ఆ విద్యార్థి మందలించాడు. దానికి ఆ యువకుడు 'సార్, క్షమించండి. ఇందాక రైలు ఛార్జీలు ఇవ్వటంలో ఎక్కౌంటెంట్ (Accountant)నాకు ఐదు రూపాయలు ఎక్కువిచ్చేరు. ఆయన లంచ్ (lunch) కి వెళ్ళేరు. ఆయన తిరిగొచ్చేక ఆ డబ్బు వాపస్ ఇవ్వడానికి ఇక్కడ వెయిట్(wait) చేస్తున్నాను', అని సవినయంగా సమాధానం చెప్పేడు. రామన్ ఆ విద్యార్థి **'నీతి నిజాయితీ'** లకు సంతోషించి, అటువంటి సంస్కారవంతుడిని ప్రోత్సహించటం తన భాధ్యతగా, 'రేపే వచ్చి ఆర్డర్ తీసుకో, ఉద్యోగంలో చేరు' అని 'గాడ్ బ్లెస్ యూ' అనే శుభాకాంక్షలతో ఆనందం అందించాడా యువకుడికి. అందుకు డిగ్రీలు బ్రతుకు తెరువుకి పనికి వస్తాయి. వ్యక్తికి సమాజంలో గౌరవ స్థానం అందించేది నైతిక విద్యా విధానం వల్ల వచ్చే సంస్కారమని ఋజువవుతుంది. "విద్య యందున విధిగ నైతికము చేర్చి మార్పు కలిగించి చూడు" అని భగవాన్ సత్య సాయి బాబా ప్రాధమిక పాఠశాల మొదలు విశ్వ విద్యాలయం వరకూ విద్యావిధానం మారాలి అని అధికార స్థానముల నలంకరించిన పెద్దలకు సలహా ఇస్తున్నారు. వినయ విధేయతలు, ఇంద్రియ నిగ్రహము, సచ్ఛీలము, నీతి నిజాయితీలు మొదలగు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విలువలు విద్యార్థులకు అత్యవసరమని నొక్కి వక్కాణిస్తున్నారు, స్వామి. అందుకు విద్యా విధానంలో మార్పు అవసరమని వ్యర్థ ప్రసంగాలు, నినాదాలు చేసేవారు, పత్రికల్లో వ్యాసాలు వ్రాసేవారు, ప్రస్తుత విద్యా విధానం లోని లోపాల్ని చెప్పి సరి దిద్దవలసిన పద్ధతులు ఆచరించాలి. ప్రపంచంలో శాంతి యుత సహ జీవనానికి కావల్సిన మానవతా విలువల ప్రాముఖ్యత గురించి ప్రభుత్వం, విద్యా బోధకులు, ప్రజలు, విద్యార్థులు గ్రహించి శ్రమించి సాధించాలి.

# కొన్ని ప్రార్థనలు

1. శుక్లాంబర ధరం విష్ణుం శశి వర్ణం చతుర్భుజమ్
   ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే
2. సరస్వతీ నమస్తుభ్యం వరదే కామ రూపిణి
   విద్యారంభం కరిష్యామి సిద్ధి ర్భవతు మే సదా!
3. నానా విజ్ఞాన సంధాత్రీం బుద్ధి శుద్ధి ప్రదాయినీం
   అమృతత్వ ప్రదాత్రీం చ విద్యా లక్ష్మీం నమామ్యహమ్.
4. సర్వ శక్తి స్వరూపాం చ సర్వ సిద్ధి ప్రదాయినీం
   సర్వేశ్వరీం శ్రీ విజయ లక్ష్మీం దేవీం నమామ్యహమ్.
5. ధన మగ్నిం ర్ధనం వాయు: ధనం భూతాని పంచచ
   ప్రభూతై శ్వర్య సంధాత్రీం ధన లక్ష్మీం నమామ్యహమ్.
6. ఓం భూర్భు వస్సువ: తత్స వితుర్వరేణ్యం
   భర్గో దేవస్య ధీమహీ ధియో యోన: ప్రచోదయాత్
7. సాయీశ్వరాయ విద్మహే: సత్య దేవాయ ధీ మహి:
   తన్న: సర్వ: ప్రచోదయాత్
8. సాయి బాబాయ విద్మహే షిర్డీ పుర్యైన ధీమహి:
   తన్నో బాబా: ప్రచోదయాత్
9. శ్రీ భాస్కరాయ విద్మహే: సాయి దేవాయ ధీ మహి:
   తన్న: సూర్య: ప్రచోదయాత్
10. ప్రేమాత్మనాయ విద్మహే: హిరణ్య గర్భాయ ధీ మహి:
    తన్న: సూర్య: ప్రచోదయాత్
11. సహనా వవతు సహనౌ భు నక్తు
    సహ వీర్యం కరవావహై
    తేజస్వినా వధీ త మస్తు మా విద్వషావహై
    ఓం శాంతి శాంతి శాంతి:

12. గురు ర్బ్రహ్మా గురుర్విష్ణు ర్గురుర్దేవో మహేశ్వర:
గురుసాక్షాత్ పర బ్రహ్మా త స్మై శ్రీ గురవేన:

13. కరగ్రే వర్ధతే లక్ష్మీ కర మధ్యే సరస్వతీ
కరమూలేతు కౌమారీ ప్రభాతే కర దర్శనం

14. తథా కృతం దేవ యథై వ కారితం
తథామతం దేవ యథై వ జ్ఞాపితం
తథోదితం దేవ యథై వ వాదితం
సమాప్త మ త్త్వ వవిభో దిన వ్రతం.

15. సుషు ప్తె నాయ యస్మాం తద్ దేవ త్వాం ప్రార్థయా మహే
త్వమత్సంగ: ప్రభో ఏకం చిర శాంతి సుఖాస్పదమ్
ఓం శాంతి శాంతి శాంతి:

16. త్ర్యంబకం యజా మహే సుగంధిం పుష్టి వర్ధనమ్
ఉర్వారుక మివ బంధన న్మృత్యో ర్ముక్షీ యమామృతాత్

17. బ్రహ్మార్పణం బ్రహ్మా హవి: బ్రహ్మాగ్నౌ బ్రహ్మా నాహుతం
బ్రహ్మైవ తేన గంత వ్యం బ్రహ్మా కర్మ సమాధినా

18. అహం వైశ్వా నరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రిత:
ప్రాణాపాన సమా యుక్త: పచామ్యన్నమ్ చతుర్విధమ్

19. ఆదిత్యాయ చ సోమాయ మంగళాయ బుధాయ చ
గురు శుక్ర శని భ్యశ్చ రాహవే కేతవే నమ:

20. ఓం జై జగదీశ హరే స్వామి సత్య సాయి హరే
భక్త జనా సంరక్షక - పర్తి మహేశ్వరా
ఓం జై జగదీశ హరే 11

శశి వదనా శ్రీ కరా సర్వా ప్రాణపతే
ఆశ్రిత కల్పలతీకా - ఆ పద్బాం ధవా 11

ఓం మాత పితా గురు -దైవము మరి యంతయు నీవే



స్వామి మరి యంతయు నివే
నాద బ్రహ్మా జగన్నాథా- నాగేంద్ర శయనా 11 ఓం

ఓం ఓం కార రూప ఓజస్వి-
ఓసాయి మహాదేవా సత్య సాయి మహాదేవా
మంగళ హారతి అందుకో- మందర గిరిధారీ 11 ఓం
నారాయణ నారాయణ
సత్య- నారాయణ నారాయణ నారాయణ
నారాయణ నారాయణ ఓం
సత్య-నారాయణ నారాయణ ఓం
సత్య-నారాయణ నారాయణ ఓం
ఓం జై సద్గురు దేవా
ఓం శాంతి శాంతి శాంతి:

## విద్య చతుష్టయములు

*అన్వీక్షకి త్రయీ, వార్తా దండనీతి*
*అన్వీక్షకి అనగా ఆత్మ అనాత్మల వలన మోక్ష సాధనమగు విద్య.*
*త్రయీ అనగా కర్మ ద్వారమున స్వర్గ సాధనమగు విద్య.*
*వార్తా అనగా కృష్యాది ఫలరూపమైన విద్య.*
*దండనీతి అనగా పాలకులచే (ప్రభుత్వముచే) ధన ధాన్య సంపాదన సాధనమగు విద్య*
*ఈ నాలుగింటిలో మొదటిదైన అన్వీక్షకి తప్ప మిగిలిన మూడునూ జన్మప్రదములు.*

# ఉప సంహారము

'విద్య - విద్యార్థులు' అంశం పై భగవాన్ అనుగ్రహిస్తూ వచ్చిన ఎన్నో విషయాలు తెలుకున్నాం. ఆ విధంగానే Educare గురించి వారు చెప్పిన అనేక విషయాలు విన్నాం.

ఇంగ్లీషు వ్యవహార కోశంలో (Dictionary) లో Education కి Educare కి ఇవ్వబడిన అర్థాన్ని, నిర్వచనాన్ని; Sai's Message to the youth అని Sai yuvak లో వచ్చిన సాయి సందేశాన్ని; Educare గురించి భగవాన్ బాబా ఇచ్చిన నిర్వచనాలు ఉపసంహారముగా చేర్చటమైంది.

Education అంటే "The process of nourishing or rearing; The process of bringing up; The manner in which a person is brought up. Hence culture or development of powers, formation of character, often qualified as intellectual, moral etc., like educated society; The systematic instruction, schooling or training given to the young and by extension to adults in preparation for the work of life.

Also the whole course of scholastic instruction which a person has received - often qualified as classical, legal, medical etc., culture and development of powers, formation of character; often qualified as intellectual, moral etc.,

Educate (v) to reach; to cause to have knowledge, good character, manners and power to make a living; since educator is one or that which;

Educare: to bring up from childhood so as to form habits, manners, mental and physical aptitudes; To provide schooling for; To train to develop some special aptitude, taste or disposition; to lead forth.

Educe (v) to draw or lead out eg- a hidden power; to form some judgment from facts; Bring out develop;

Educates: ( Educational; educationist; Educative etc., are derivatives from Education).

"ప్రతి వ్యక్తి లో అంతర్గతంగా మానవతా విలువలుంటాయి. అవి బయట నుండి తీసుకొని రాలేము. లోపలి నుండే రావాలి. అ మానవతా విలువలను బయటకు కార్య రూపంలో తీసుకొని వచ్చుటే ఎడ్యుకేర్"- బాబా



'భగవాన్ ఉపయోగించే ఎడ్యుకేర్ అనే పదం మానవ వికాసానికి, జ్ఞానార్జనకు గల అన్ని అంశాలు కలుపు కొన్న ప్రధాన విధానంగా రూపొందింపబడింది. ఇది సమస్త మానవాళికి సంబంధించిన మహత్తర సందేశం. చరిత్ర లో ఒక అవతారం జ్ఞానాన్ని, ఆచరణను అతీతంగా మేళవింపచేసి కుల మత, జాతి, వర్ణ వ్యవస్థలకు అతీతం గా మానవులను తీసుకు వెళ్ళగల ప్రక్రియ ఈ ఎడ్యుకేర్.

**International Seva conference - Guru Poornima**

Sai's Message to the Youth: "International Seva conference - Guru Poornima " - July 2002.

I want you to be leaders to protect the world. Leaders like Lions- self reliant, courageous, majestic and just. Lion is the king of animals and I want you to be a king among men.

Your hearts are my home! Swami will safeguard the purity of your heart which is His house. Swami will bless you with His presence, around, behind and before you. Remember three things always: Always serve wherever you are. Seek chances to help others. Never lose opportunity to use your skills and enthusiasm for the alleviation of sorrow, pain and distress. Again, do not omit or neglect or postpone your own particular spiritual practice. Above all, have the faith that Swami is with you, at all times and places.

He who dedicates his time, skill and strength to service can never meet defeat, distress or disappointment. For service is its own reward. His word will be ever sweet and soft, his gestures will be ever revered and humble. He will have no foe, no fatigue, no fear.

Young people who are capable of making sacrifices are very essential to-day. Not only this, we need courageous young people who can proclaim to the world the Omnipresence of Divinity. It is necessary to have young people who can face and fight with courage, situations arising from injustice, unkindness and cruelty.

It is necessary to have young people who will not strive for only worldly and material benefits, but will give sufficient importance to the ethical and spiritual aspects, young people who are prepared to give up temptations and selfish ideas, and who are able to serve community in a selfless manner; young people who can, through their experience, proclaim and tell others, that inner Divinity is the most important thing.

Service is worship, each act of service is a flower placed at the Feet of the Lord.

Be eager to share enthusiastically in activities for helping others, even more than in activities for helping yourselves. And pay attention to activities that can ' please' God. God is in everyone. So if God is pleased, everyone is pleased.

Do intense Sadhana now, when you are young and strong so that you can be in peace and joy all your life. Many postpone spiritual exercises until old age, when they retire from professional activities. But once,you retire, every limb of yours will be too tired to work effectively. Make the most profitable use of this present period of you lives. Do not waste the hours in irrelevance and irreverence. Do not indulge in the condemnation of others or in self-condemnation.

Young people! This is the golden age. You should not waste even half a second. Do some work or other useful service to society. Do not be egoistic. Enter work in order to extinguish ego.

Young people ask why they should not enjoy freedom as fish, birds and animals do. They should understand that each of these creatures is enjoying freedom in accordance with its own sphere of life. Similarly, man should enjoy freedom related to his human condition. You cannot call yourself a human being and lead a life of an animal. Enjoy the freedom of a human being . To be free like an animal is to become an animal, yourself.



In this young age of yours, while you are still in your youth, the kind of sacred thoughts that generate in your mind and sacred experiences you go through will determine the future for you.

Whatever you do as service, to whomsoever you offer the act, believe that it reaches the God in that person.

Cultivate faith in the value of seva; believe that love can overcome hatred. Have faith in righteousness and moral life. This is called Dharma (righteousness) since, dharma means that which is worn, that which envelopes, that which protects etc., Do not stray into wrong paths, enticed by sensual desires and plans for self-aggrandizement.

The age span 16-30 is crucial,for that is the period when life adds sweetness to itself, when talents, skills and attitudes are accumulated , sublimated and sanctified. If the tonic of unselfish service is administered to the mind during this period,life's mission is fulfilled.

One must necessarily have three essential qualities of discipline devotion and duty. It is only when the students have have three qualities, that they will become useful to society.

At first God stands at a distance watching watching your efforts, He is like the teacher who stands aside while the student writes the answer to his questions, when you shed your attachment to the material world and turn to doing good and serving others, God comes encouragingly; He is like the sun god who stands waiting outside the closed door, like a servant who keeps his place. He does not announce His presence or knocks at the door; He simply waits. But when the master opens the door even a little, the sun rushes in at once drives out the darkness. When you ask God for help,He is right beside you with hands held out to help you. All you need is the discrimination to pray to God, the wisdom to remember Him.

I am always with you, even if you don't believe in Me, even when you try to forget Me, even when you laugh at Me, or hate Me, even when I seem to be on the opposite side of the earth. I am in you , you are in Me. Don't forget that, we cannot be separated.

.......a young person should acquire self confidence. Faith creates love. Love creates tolerance and compassion and God reveals Himself to those with tolerance and compassion. Thus faith in yourself is of primary importance. Youth should be full of love and compassion and thereby acquire great moral and spiritual strength.

Fill your mind with high thoughts and the highest ideals. Keep them in your mind day and night and out of that will come great work. Talk not about impurity but say that you are pure. You have hypnotised yourselves into this thought that you are little; that you are born and you are going to die, and live in a constant state of fear. My dears! your Sai is always with you, in you around you. do not fear. Be Happy.

Juvenile correctional facility in texas (USA) - children's hospital, nursing home, prayer before meals, songs on human values, bhajans, games, dances, visits to places of interest; old age homes visits to entertain the elderly, ...... traditions brush with modernity(in UK) personal development programme which is not necessarily about producing leaders but more about nurturing the leadership qualities in individuals.

.........to provide a sound basis for youngsters to grow both spiritually and mentally during an erratic period of adolescence, multi faith events; drug awareness campaigns; Global Handicapped Day (22-7-2001) schools are truly universal; students to be obedient and attentive.

# మంగళా శాసనము ( A Benediction)
# ఆశీర్వాదము

కృతయుగము, ద్వాపరయుగము, కలియుగములలో అమిత శక్తి శాలి యైన పరమాత్మ అనేక అవతారాలు ధరించి, ధరణికి దిగి వచ్చాడు. అవతార మంటేనే దిగి రావటం- అవతరించటం. దిగి రావటం అనగానే భగవంతుని గురించి అదేదో న్యూనతగా అనుకోనక్కరలేదు. సర్వశక్తి సమన్వితుడైన భగవంతుడు ఆయా సమయాలు, పరిస్థితుల బట్టి ఏ అవతారంలో వచ్చినా, అప్పటికి తగిన లక్ష్యం తో వచ్చి, కార్య సాధన చేసి, తాత్కాలిక ఫలితాల్ని అందిస్తుంటాడు. మనం కూడా తాత్కాలిక ఫలితాల్ని అను భవిస్తుంటాం. అవతార లక్షణాల్లో పరిమాణం (quantity) ఉండొచ్చు కాని (quality) మాత్రం ఒకటి గానే ఉంటుంది. తానే సృష్టించిన జగత్తును వరించి, ప్రజలను ప్రేమించి, వారిని అనుగ్రహించే నిమిత్తం అవతరిస్తాడు. అవతరణను తల్లి బిడ్డల ప్రేమతో పోల్చవచ్చు. బిడ్డ ఆనందంగా ఆడుకొంటూ, మధ్య మధ్య 'అమ్మా' అని పిలుస్తుంటుంది. తల్లి అంత పట్టించుకోకుండా తన పని తాను చేసు కొంటుంది కాని, బిడ్డ నడుస్తూ నడుస్తూ పడిపోయినా, లేదా ఏదైనా బాధ కలిగినా, గట్టిగా తల్లిని పిలిచి ఏడుస్తుంది. భగవంతుడు చేసే పని కూడా అలాగే ఉంటుంది. పరమాత్మ తన ప్రేమకోసం, ప్రేమతో సృష్టించిన జీవరాసులను ఎంతో ప్రేమిస్తాడు. వృద్ధి చేస్తాడు. ఆదరిస్తాడు. మానవులు ఆర్తితో ఎలుగెత్తి పిలిస్తే వెంటనే వారికి బాసటగా నిలిచి, తన ప్రేమానుగ్రహాల్ని అందిస్తాడు. తల్లి బిడ్డకోసం వంగటం, పరమాత్మ మానవాకారంలో దిగి రావటంలో అవమానం ఏమీ లేదు, ప్రేమ ప్రకటన తప్ప.

**'అంతర్ బహిశ్చ తత్ సర్వ వ్యాప్య నారాయణ స్థిత:-**

భగవంతుడు సర్వత్రా వ్యాపించిన వాడు. భగవత్తత్వమనేది సర్వత్రా వ్యాపించి నటువంటిదే. 'ఈశావాస్య మిదం సర్వం' - భగవంతుడు ఈ జగత్తు నందు సమస్త పదార్థము లందు ఉన్నటువంటి దివ్య శక్తియే. అట్టి శక్తిని మానవులు మాత్రమే గుర్తించ గలరు. అందుకే భగవంతుడు మనుష్యాకారంలో, మానవరూపమును ధరించి 'దైవం మానుష రూపేణ' వస్తాడు. దైవత్వమును వివిధ రూపనామములతో ఆరాధించినప్పటికీ ఆ దివ్య తత్వాన్ని ఏకత్వ మైన బ్రహ్మతత్వంగా, ఆత్మతత్వంగా విశ్వసించాలి. పూజలు ఏ విధంగానైనా

చేయవచ్చు, కాని పూలు ఒక్కటే. దైవం ఎక్కడో, ఏదోస్థానంలో ఉన్నాడను భ్రమను దూరం చేసుకోవాలి. నేనే దైవం అని విశ్వసిస్తే, తనలోని ఆత్మయే బ్రహ్మగా అనిపిస్తాడు. ఆ విధంగా మానవులు తామే దైవంగా భావించి, విశ్వసిస్తే అందరి పట్ల ఏకత్వం ఏర్పడుతుంది. ఇదే అనేకత్వం లోని ఏకత్వం. ప్రతి వ్యక్తి యందు సత్యం, ప్రేమ ఉంటుంది. ఆ ప్రేమను వివిధ మార్గాల్లో ప్రవేశ పెట్టవచ్చు. కాని ప్రేమ మాత్రం ఒక్కటే. ఈ ప్రేమయే దైవం. ఇటువంటి జ్ఞానం, గ్రంధ పఠనంతో రాదు. గ్రంధాలు చదివేటప్పుడు, వ్రాసేటప్పుడు భగవంతుడు, సర్వులు ఒక్కటే అనే సత్యాన్ని విశ్వసించి, ఆరాధన చేసినట్లే, ఇటువంటి ఆరోగ్యకరమైన పవిత్ర ఆశయాలు, సమత్వము చిన్నప్పట్నుంచే పిల్లల్లో అభివృద్ధి చేయాలి. అప్పుడే వారు ఆదర్శ విద్యార్థులుగా తయారవుతారు. సరైన పోటీ తత్వం తెలివి తేటలు పెంచుకుంటారు. మార్కులు, rankలు ముఖ్యం కాదు. Remarkలు (రిమార్కులు) లేకుండా ప్రవర్తించాలని మంచిగా ప్రవర్తిస్తారు. స్వార్థంతో వచ్చే ఈర్ష్య, అసూయ, నిరాశ, రాగ ద్వేషాలు మొదలైన దుర్గుణాలు పెరుగకుండా తమలో స్వతసిద్ధంగా ఉన్న మంచి లక్షణాల్ని అభివృద్ధి చేసుకుంటూ సార్థకత పొందుతారు. ఈ మానవతా లక్షణాల్ని బయటకు కార్య రూపంలో తీసుకు రాగల్గటమే 'ఎడ్యుకేర్' అన్నారు, భగవాన్. విద్య ఆ విధంగా మానవ వికాసానికి, జ్ఞానార్జనకు గల అన్ని అంశాలు కలుపుకొన్న ప్రధాన విధానం ఈ ప్రక్రియ. భౌతిక, లౌకిక విద్యకు అతీతమైన ఆధ్యాత్మక తత్వమును మానవాళికి అన్నివిధాలా అవగాహన చేసుకొనేలా చేస్తుంది. దీని ప్రాశస్త్యం, అవసరం గురించి భగవాన్ అనేక సందర్భాల్లో చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకుందాం!.

భౌతిక విద్య, దానితో పాటు ఆచరణ విద్య మధ్య గల వ్యత్యాసాలు, వాటి మేళవింపును పిల్లల్లో ఎలా తీసుకు రావాలి, పెద్దలు ఏ విధంగా కృషి చేయాలి అనే వివరాల్ని తెలుసుకున్నాం, చాలా వరకూ; భగవాన్ అనుగ్రహించిన అనేక విషయాలతో. వాటిని సక్రమంగా ఆకళింపు చేసుకుని వీలైనంత ఆచరణ లో పెడుతూ ఉంటే అదే మనం తీర్చుకునే దైవ ఋణం. అప్పుడు మంగళకరుడైన ప్రభువు మంగళాశాసనము లభిస్తుంది.

**లోకా సమస్తా: సుఖినో భవంతు**
**ఓం శాంతి శాంతి శాంతి:**